# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 186 | హైదరాబాద్ | మంగళవారం 13-01-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

త్రుల మధ్య విభేదాలు సహజమే.. అందుకే ట్రంప్‌మోదీ మధ్య దూరం!: అమెరికా రాయబారి



## కొత్త కార్యాలయానికి ప్రధాని మోదీ..
# మారనున్న పీఎంవో చిరునామా

- రాయ్‌సీనా హిల్స్ వద్ద సిద్ధమైన ప్రధాని కొత్త కార్యాలయం
- 'సేవా తీర్థ్'గా నామకరణం చేసిన కేంద్ర ప్రభుత్వం
- ఈ నెల 14 తర్వాత పీఎంవో తరలింపు ఉంటుందని అంచనా
- స్వాతంత్య్రం తర్వాత తొలిసారి సౌత్ బ్లాక్ నుంచి మారనున్న పీఎంవో
- మ్యూజియంగా మారనున్న ప్రస్తుత నార్త్, సౌత్ బ్లాక్‌లు

11లో

## వాహనాల చలాన్లకు డిస్కౌంట్ ఇవ్వొద్దు
# ఖాతా నుంచి డబ్బులు కట్ కావాలి



11లో

- వాహనాలకు చలాన్లు విధిస్తున్నప్పటికీ డిస్కౌంట్ ఇస్తారనే ఆలోచన ఉందని వ్యాఖ్య
- వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలోనే బ్యాంకు ఖాతాను లింక్ చేయాలని సూచన
- మైనర్లకు ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులపై కేసు పెట్టాలన్న ముఖ్యమంత్రి



11లో

## ప్రభుత్వ ఉద్యోగులకు
# తెలంగాణ సర్కార్ శుభవార్త


- ప్రభుత్వ ఉద్యోగుల డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు
- పెరిగిన డీఏ 2024 జులై 1 నుంచి వర్తింపు
- జనవరి నెల వేతనంతో పాటు పెరిగిన డీఏ చెల్లించనున్న ప్రభుత్వం

## భారత క్రీడా రంగంలో భారీ సంస్కరణలు
# క్రీడా సంఘాల్లో ఆటగాళ్లకే పెద్దపీట

- క్రీడా సంఘాల పాలనపై కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు జారీ
- పాలకవర్గాల్లో కనీసం నలుగురు మాజీ క్రీడాకారులకు తప్పనిసరిగా చోటు
- క్రీడాకారుల కోటాలో మహిళలకు 50 శాతం ప్రాతినిధ్యం కల్పన
- ఎన్నికల నిర్వహణకు ప్రత్యేకంగా జాతీయ స్పోర్ట్స్ ఎలక్షన్ ప్యానెల్
- ఆరు నెలల్లోగా కొత్త నిబంధనలకు అనుగుణంగా బై-లాస్ మార్చుకోవాలని ఆదేశం

11లో





11లో

## ఇస్రో రాకెట్
# ప్రయోగం విఫలం

- సమస్యను విశ్లేషిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు
- నిర్ణీత సమయానికి నింగికెగిరిన పీఎస్ఎల్వీ– సీ62
- రెండు దశల పాటు సాఫీగా సాగిన రాకెట్ ప్రయాణం

## సంక్రాంతి సంబరాల కోసం
# నారావారిపల్లె చేరుకున్న సీఎం

- సంక్రాంతి వేడుకల కోసం స్వగ్రామానికి సీఎం చంద్రబాబు
- సొంతూరిలో చంద్రబాబుకు ఘనస్వాగతం
- కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి సంక్రాంతి పండుగ సంబరాలు
- పర్యటనలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- నాలుగు రోజుల పాటు స్వగ్రామంలోనే ముఖ్యమంత్రి బస

11లో



## అమరావతిలో జోరుగా
# రెండో విడత ల్యాండ్ పూలింగ్

### కర్లపూడిలో ప్రారంభం

- కర్లమూడి, లేమల్లె తదితర గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ ప్రారంభం
- మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ప్రవీణ్ లను ఘనంగా స్వాగతించిన స్థానికులు
- తమ గ్రామాలను ఎంపిక చేసినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపిన గ్రామస్థులు

11లో



భారత శక్తి

# అందరి చూపు మోడీ వైపు...

ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డ చందంగా మారింది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిస్థితి.. రష్యా?ఉక్రెయిన్ యుద్ధం ముగించడానికి ఇప్పుడు భారత్‌పై బాంబు పేల్చాలని నిర్ణయించాడు. రష్యాను ఒప్పించడమో.. ఢీకొనడం సాధ్యం కాక.. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్న భారత్‌పై భారీగా టారిఫ్ విధించేందుకు పావులు కదుపుతున్నారు. రష్యాపై ఒత్తిడి పెంచేందుకు ద్వైపాక్షిక ఆంక్షల చట్టానికి అంగీకారం తెలిపారు. సెనేటర్ గ్రాహం ఎక్స్‌లో పోస్ట్ పెట్టి ట్రంప్‌తో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాలు విధించే అధికారాన్ని యుఎస్ పొందుతుంది. వచ్చే వారంలో ఓటింగ్ జరుగనుంది. పుతిన్ యుద్ధానికి పరోక్షంగా నిధులు అందించడానికి భారత్, చైనా కారణమని ట్రంప్ ఆరోపణ. చైనా ప్రపంచంలోని అతిపెద్ద రష్యన్ చమురు కొనుగోలుదారు, భారత్ రెండో స్థానంలో ఉంది. ఈ ఆంక్షలు రక్తపాతానికి మద్దతును కట్టడి చేస్తాయని గ్రాహం వాదన. గతేడాది భారత దిగుమతులపై 50 శాతం సుంకాలు విధించినట్లే ఇప్పుడు మరింత గట్టిగా ఉంటుంది. భారత్?అమెరికా మధ్య వాణిజ్య ఒప్పంద చర్చలు కొనసాగుతున్నాయి. ఈ బిల్లు ఆంక్షలు ఈ సంభాషణలను ప్రభావితం చేస్తాయి. భారత్ ఆర్థిక వ్యవస్థకు చమురు ధరల పెరుగుదల భారాన్ని మోపవచ్చు. పుతిన్ శాంతి మాటలు చెబుతూనే యుద్ధాన్ని కొనసాగిస్తున్నారని గ్రాహం విమర్శించారు. ఈ ఆంక్షలు మాస్కో ఆదాయాలను తగ్గించి ఉక్రెయిన్‌కు మద్దతును బలోపేతం చేస్తాయి. బ్రెజిల్ వంటి ఇతర దేశాలు కూడా ఈ జాబితాలో చేరతాయి. ఈ చర్య భారత్‌కు రష్యన్ చమురు ఆధారాన్ని ప్రశ్నిస్తుంది. ప్రత్యామ్నాయ మూలాలు కనుగొనడం, యుఎస్‌తో దౌత్య చర్చలు జరపడం అవసరం. ట్రంప్ విధానం ఉక్రెయిన్ యుద్ధాన్ని త్వరగా ముగించే అవకాశాన్ని కల్పిస్తుంది. కానీ ఆర్థిక సవాళ్లను తెచ్చిపెడుతుంది. ట్రంప్ పాలిటిక్స్‌లో కొత్త మలుపు ఇది. వెనుజువెలాలోకి అమెరికా సైనికులను పంపించి ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను కిడ్నాప్ చేశారు. ఈ క్రమంలో ఆ దేశంలోని చైనా, రష్యా డిఫెన్స్ సిస్టం విఫలమయ్యాయి. దీంతో అమెరికా ఆపరేషన్ విజయవంతమైంది. దీంతో ట్రంప్‌కు అహంకారం తలకెక్కింది. దీంతో క్యూబా, ఇరాన్, కొలంబియా, మెక్సికోతోపాటు భారత్‌ను టార్గెట్ చేశారు. వెనెజువెలాలో మదురో దంపతులను లక్ష్యంగా చేసుకుని యుఎస్ విజయవంతమైంది. రష్యా ఎస్?300, చైనా రాడార్లు అమెరికా చొరబాటును పసిగట్టలేకపోయాయి. దీంతో యుఎస్ ఆయుధాల ఆధిపత్యాన్ని నిరూపించింది. ఈ సంఘటన ఆయిల్ వనరులపై యుఎస్ ఆకాంక్షలను స్పష్టం చేస్తోంది. వెనుజువెలాలోని 303 బిలియన్ బ్యారెళ్ల క్రూడ్ ఆయిల్‌ను తరలించుకుపోవడానికి యుఎస్ కంపెనీలను ట్రంప్ ప్రోత్సహిస్తున్నారు. వెనుజువెలాలో విజయం తర్వాత ట్రంప్ ఇప్పుడు మరో ఐదు దేశాలపై ఫోకస్ పెట్టాడు. వెనెజువెలాపై ఆధారపడి ఉన్న క్యూబాను త్వరగా కూల్చివేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయిల్ సరఫరాలు ఆగిపోతే ఇది సులభమవుతుందని వ్యూహం. అందుకే క్యూబాను ఫస్ట్ టార్గెట్ చేశారు. క్యూబాకు చెందిన మచాడో కూడా అమెరికాకు మద్దతు ఇస్తున్నారు. ఇరాన్‌పై మునుపటి దాడుల్లోనూ రష్యన్ టెక్నాలజీ విఫలమైంది. కొలంబియా అధ్యక్షుడు పెట్రోతో మాటల యుద్ధం ఉధృతమైంది. ఈ దేశాల్లో పాలన మార్పులు లక్ష్యంగా యుఎస్ ఒత్తిడి పెరుగుతోంది. కానీ పెట్రో బలంగా నిలబడ్డారు. ట్రంప్‌కు సవాల్ చేస్తున్నారు. అయితే కొలంబియా మెక్సికో పక్కనే ఉంది. అందుకే దానిని కూడా ఆక్రమించి చూస్తున్నారు. అమెరికా కోర్టుల ప్రకారం ఇవి తప్పు చేస్తున్నాయి కాబట్టి అక్కడి ప్రభుత్వాలను కూలుస్తామని ట్రంప్ అంటున్నారు.

అక్రమ వలసలు, మాదకాలు కారణంగా మెక్సికోను లక్ష్యంగా చేసుకుని యుఎస్ సైనిక చర్యలు ఆలోచిస్తోంది. సరిహద్దు భద్రతకు ఇది ముఖ్యమని ట్రంప్ వాదన. నాటో సభ్య దేశమైన డెన్మార్క్ భూభాగం గ్రీన్‌లాండ్‌ను యుఎస్ కోరుతోంది. భద్రతా కారణాలతో ఈ డిమాండ్ ప్రపంచవ్యాప్త చర్చనీయాంశం. ఇది యుఎస్ ప్రభావాన్ని ఈ ప్రాంతంలో విస్తరించే అవకాశాన్ని కల్పిస్తుంది. ట్రంప్?మోదీ మధ్య వ్యాఖ్యలు ఉధృతమవుతున్నాయి. రష్యా నుంచి ఆయిల్ దిగుమతులు, టారిఫ్‌లు, మొక్కజొన్న వ్యాపారం విషయాల్లో యుఎస్ ఒత్తిడి పెరిగింది. షెల్ ఆయిల్ కొనుగోళ్లకు భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోంది. భారత్ మౌనంగా ఉండి స్వంత ఆస్థాను కాపాడుకుంటోంది. యుఎస్ ఆయుధాలు అమ్మకాలకు ఈ సంఘటనలు ప్రచారం చేస్తున్నాయి. మన దేశం మీద అమెరికా ఇప్పటికే 50% టారిఫ్ విధిస్తోంది. అప్పట్లో అమెరికా తీసుకున్న నిర్ణయం వల్ల భారత్ కుప్పకూలుతుందని అందరూ అనుకున్నారు. వారు అనుకున్నట్టుగానే స్టాక్ మార్కెట్ కుప్పకూలిపోయింది. సంపద మొత్తం ఆవిరి అయిపోయింది. ఆ తర్వాత నెమ్మదిగా పరిస్థితి మారిపోయింది. అప్పటి మాదిరిగా కాకపోయినప్పటికీ, అమెరికాకు భారత్ నుంచి ఎగుమతులు వెళ్తూనే ఉన్నాయి. వాస్తవానికి ఈ సుంకాల వల్ల అమెరికాలో ఉన్న కస్టమర్ల మీదనే భారం ఎక్కువగా పడుతుంది. ట్రంప్ వల్ల అమెరికాలో ఆ వస్తువులను కొనేవారికి ఆర్థికంగా భారం పెరిగింది. ఈ ఎఫెక్ట్ ఇండియన్ కంపెనీల ఎగుమతుల మీద కాస్త ప్రభావం చూపించింది. అంతేగాని ఆ సంస్థలు భారీగా నష్టాలు చవిచూసిన దాఖలాలు లేవు. ఇప్పుడు ట్రంప్ చెబుతున్నట్టుగా 500% సుంకాలు విధించినప్పటికీ ఎగుమతులు కాస్తలో కాస్త క్షీణిస్తాయి. అయితే అమెరికా మార్కెట్లో భారతదేశం నుంచి వచ్చే వస్తువుల ధర పెరుగుతుంది. అలాంటప్పుడు అమెరికా ప్రజలు వాటిని ఒకవేళ ఎంచుకుంటే.. పెద్దగా ఇబ్బంది ఉండదు. అలాంటప్పుడు ట్రంప్ వెయ్యి శాతం సుంకాలు విధించినప్పటికీ పెద్దగా ఇబ్బంది ఉండదు. కాకపోతే అమెరికాకు భారత్ నుంచి ఎగుమతి వస్తువుల పరిమాణం తగ్గుతుంది.. 500% సుంకాలు విధిస్తామని ట్రంప్ చెప్పగానే భారత్ లోని స్టాక్ మార్కెట్లు ఒత్తిడికి గురయ్యాయి. 8 లక్షల కోట్లు ఆవిరి అయిపోయాయి. వాస్తవానికి ఈ నష్టం స్టాక్ మార్కెట్ చరిత్రలో కొత్తది కాకపోయినప్పటికీ.. ట్రంప్ కు భయపడడం మొదలైతే.. అలానే ఇబ్బంది పెడుతూనే ఉంటాడు. కాస్త నిలబడి గట్టి సవాల్ విసిరితే అన్నీ మూసుకొని కూర్చుంటాడు. మోదీ తనను బతిమాడుతున్నాడని ట్రంప్ చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మోదీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మోదీ నిర్ణయంపైనే భారత ఎగుమతులు ఆధారపడి ఉంటాయి.

# భారతి సిమెంట్స్ పై గురి

ఒంగోలు, జనవరి 12, (భారత శక్తి)


ఏదైనా చెబితే హేతుబద్ధత ఉండాలి. అబద్ధం చెప్పినా నమ్మినట్టు ఉండాలి. కానీ ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డి తరచూ ఫెయిల్ అవుతున్నారు. ఇటీవల మీడియా ముందుకు వచ్చి మళ్లీ అమరావతి పై లేనిపోని మాటలు మాట్లాడారు. ఇప్పుడిప్పుడే జగన్ విషయాన్నీ మరిచిపోతున్న అమరావతి రైతులను మళ్లీ కెలికారు. నది గర్భంలో అమరావతిని కడుతున్నారు అంటూ నిందలేశారు. అయితే రెండో విడత భూసేకరణకు దిగుతున్న ప్రభుత్వంపై అమరావతి రైతులు అసంతృప్తితో ఉన్నారు. జగన్ ఆ మాటలు అనేసరికి వారంతా తమ అసంతృప్తి తగ్గించుకున్నారు. తమ శాశ్వత శత్రువు జగన్మోహన్ రెడ్డి అని బలంగా నమ్మడం ప్రారంభించారు. డామిట్ కథ అడ్డం తిరిగింది అంటూ సజ్జల రామకృష్ణారెడ్డి ఎంట్రీ ఇచ్చారు. జగన్ మాటలను వక్రీకరించారని సంజాయిషి ఇవ్వడం ప్రారంభించారు. అమరావతి తో వదల్లేదు జగన్. ఏపీ నుంచి పరిశ్రమలు వెళ్లిపోతున్నాయని కూడా వ్యాఖ్యానించారు. అందులో భారతి సిమెంట్స్ గురించి ప్రస్తావించారు ఇప్పుడు అందరూ ఆశ్చర్యపోతున్నారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు చాలా కంపెనీలు పెట్టుబడుల పేరుతో ఏపీలో ఆస్తులు ఆక్రమించుకుంటాయి. జగన్ అధికారంలో లేకపోతే వాటి దగ్గర పెట్టుబడులకు డబ్బులు ఉండవు. అయితే పారిపోయిన పరిశ్రమల జాబితాలో జగన్మోహన్ రెడ్డి భారతి సిమెంట్స్ ను చేర్చడం చాలామంది ఆశ్చర్యానికి కారణం అయింది. ప్రభుత్వం వేధిస్తున్నందున తమ సంస్థను కూడా తరలిస్తామని జగన్ చెబుతున్నారు. అయితే ప్రభుత్వం అక్రమంగా ఆయన కేటాయింపు చేసుకున్న భూముల లీజు విషయంలో నోటీసులు మాత్రమే ఇచ్చింది. దానిని వేధింపులుగా భావిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. జగన్ అధికారంలో ఉన్నప్పుడే తన కుటుంబ సంస్థలకు నిబంధనలకు విరుద్ధంగా వేల కోట్ల రూపాయల విలువైన గనులను కట్టబెట్టారు. భారతి సిమెంట్స్ కు కేటాయించిన లీజుల్లో నిబంధనలను ఉల్లంఘించారని తేలడంతో.. కూటమి ప్రభుత్వం ఆ లీజులను రద్దు చేసేందుకు సిద్ధపడింది. దానిని పరిశ్రమలను తరిమివేయడం అంటారా?అసలు భారతి సిమెంట్స్ ఏర్పాటు అక్రమమని ఆరోపణలు ఉన్నాయి.. భారతి సిమెంట్స్ అసలు పేరు అది కాదు. రఘురాం సిమెంట్స్. 2004లో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత.. ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి ఆ కంపెనీని కొనుగోలు చేశారు. రఘురాం సిమెంట్స్ కంపెనీకి సున్నపురాయి లీజులు ఉన్నాయి. భారతి సిమెంట్స్ గా మారిన తర్వాత ఆ లీజులను ఆ కంపెనీ వాడుకుంది. ఇటువంటి పరిస్థితుల్లో గనుల విషయంలో కేంద్రం స్పష్టమైన పాలసీని తీసుకొచ్చింది. ఓ కంపెనీ పేరుతో లీజులు తీసుకొని.. మరో కంపెనీ టేక్ ఓవర్ చేస్తే లీజులు చెల్లవు అని స్పష్టం చేసింది. 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వం రఘురాం సిమెంట్స్కు ఇచ్చిన ప్రాథమిక అనుమతిని కూడా రద్దు చేసింది. 2019లో ఏపీలో అధికారం మారిన తర్వాత సీన్ చేంజ్ అయింది. కొన్ని రకాల న్యాయపరమైన అంశాలను తెరపైకి తెస్తూ లీజులను పునరుద్ధరించుకున్నారు. అయితే హైకోర్టు ఈ విషయంలో కొన్ని రకాల సూచనలు చేసిన పట్టించుకోలేదు. సరిగ్గా 2024 ఎన్నికలకు ముందు లీజులను పునరుద్ధరిస్తూ జీవోలు జారీచేశారు. దీనిపై కేంద్రానికి ఫిర్యాదు వెళ్ళింది. విచారణ




చేయాలని రాష్ట్రానికి కేంద్రం లేఖ రాసింది. దీంతో అసలు విషయం బయటపడింది. రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు ఇవ్వడంతో పరిశ్రమలను తరిమేస్తున్నారన్న ప్రచారం మొదలుపెట్టారు జగన్.

# చంద్రబాబుకు తలనొప్పిగా సొంత మనుషులు

విజయవాడ, జనవరి 12 (భారత శక్తి)



చంద్రబాబు నాయుడుకు ఇప్పుడు సొంత సామాజికవర్గంలోనే శత్రువులు ఎక్కువయ్యారు. ప్రత్యర్థులు చేసే విమర్శలను పెద్దగా పట్టించుకోవాల్సిన పనిలేదు. కానీ సొంత సామాజికవర్గం నేతలే చంద్రబాబు ప్రతి నిర్ణయాన్ని తప్పుపడుతుండటం ఆయనకు రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెడుతుందనే చెప్పాలి. ఒకరకంగా చంద్రబాబు నాయుడుకు బయట శత్రువులతో కంటే ఇంట్లో శత్రువులతో యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఈసారి కనిపిస్తుంది. ప్రధానంగా ఈసారి మాత్రం కమ్మ సామాజికవర్గం నేతలు మాత్రమే ఆయనను రాజకీయంగా ఇరకాటంలోకి నెడుతున్నారని చెప్పాలి. అందులో ప్రధానంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఏబీ వెంకటేశ్వరరావు, ముప్పవరపు వెంకయ్య నాయుడులు ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలు ఇబ్బందికరంగా మారాయి. వడ్డే శోభనాద్రీశ్వరరావు మాజీ టీడీపీ నేత. చంద్రబాబు మంత్రివర్గంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు రాజకీయంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితేనేం రాజధాని అమరావతి విషయంలో చంద్రబాబు నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు. చంద్రబాబు వ్యతిరేక మీడియాతో పాటు సోషల్ మీడియాలో కూడా వడ్డే ఇంటర్వ్యూలతో చెలరేగిపోతున్నారు. చంద్రబాబు రాజధాని పేరిట రైతులను నిలువునా ముంచుతున్నారంటూ వడ్డే శోభనాద్రీశ్వరరావు పదే పదే వ్యాఖ్యానిస్తున్నారు. తొలిదఫా ల్యాండ్ పూలింగ్ కు ఇచ్చిన రైతులు ఇబ్బందులను చూసైనా రెండో విడత భూ సమీకరణకు సహకరించవద్దంటూ రైతులకు వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిస్తున్నారు. పచ్చని పంటలు పండే భూములను సర్వనాశనం చేస్తున్నారని, కలల్లో చంద్రబాబు విహరిస్తున్నారని ఫైర్ అవుతున్నారు. మరో ఎయిర్ పోర్టు, మరో ఆరులేన్ల రహదారి అవసరమా? అని ప్రశ్నిస్తున్నారు. ఇక ఏబీ వెంకటేశ్వరరావు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇంటలిజెన్స్ చీఫ్ గా పనిచేశారు. తర్వాత పదవీ విరమణ చేశారు. కానీ ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్ద పదవి వస్తుందని ఏబీ వెంకటేశ్వరరావు భావించారు. పోలీసు కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమించారు. దానిని తీసుకునేందుకు ఏబీ వెంకటేశ్వరరావు ఇష్టపడలేదు. పైగా రాష్ట్రంలో కొత్త పార్టీ పెడతానని చెబుతున్నారు. అలాగే యాభై వేల ఎకరాలు తొలి విడత సేకరించిన భూమిని ఎవరెవరికిచ్చారో లెక్కలు చెప్పాలంటూ ఏబీ వెంకటేశ్వరరావు మీడియా ద్వారా నిలదీస్తున్నారు. ఇది కూడా చంద్రబాబుకు ఇబ్బందికరమే. ఇక మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఇటీవల మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను తప్పుపట్టేలా మాట్లాడటం కూడా బాబు సర్కార్ ను ట్రబుల్ లోకి నెట్టింది. విద్య, వైద్యం మాత్రం ఉచితంగా పేదలకు అందించాలని, మిగిలిన పథకాలను రద్దు చేయాలంటూ వెంకయ్య నాయుడు చేసిన వ్యాఖ్యలు జగన్ తో పాటు చంద్రబాబుకు కూడా తగిలినప్పటికీ ఎక్కువ డ్యామేజీ చంద్రబాబుకే నంటున్నారు. అలా ఈ ముగ్గురు చేస్తున్న వ్యాఖ్యలు చంద్రబాబుకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి

# హిందూ సమాజం ఒక్కటే మోహన్ భాగవత్

మధుర జనవరి 12 (భారత శక్తి)

హిందూ సమాజం ఒక్కటే. సమాజంలో ఏ విధమైన వివక్ష ఉండకూడదని ఆర్ ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చెప్పారు. అందరినీ సమానంగా చూస్తామని తెలిపారు. 'హిందూ సమాజం అంతా ఒక్కటేనని మేం నమ్ముతాం. భాష, కులం, వర్గ భేదాలను ప్రపంచమే చూపిస్తుంది. ప్రపంచం ఎంత మంది హిందువులను గుర్తించిందో వారందరిలోనూ నాకు స్నేహితులు ఉన్నారు. ఒకరినొకరు కలుస్తాం, తింటాం, తాగుతాం. కష్టసుఖాల్లో అండగా నిలబడతాం' అని ఉత్తర్ ప్రదేశ్ మధురలో జరిగిన ఒక కార్యక్రమంలో చెప్పారు.

10సరదాగా భావతరంగిణి సంక్రాంతి సందడి

భావతరంగిణి ఆధ్వర్యంలో స్థానిక మహతి కళావేదికలో ఆదివారం సాయంత్రం జరిగిన సంక్రాంతి సందడి సరదాగా సాగింది. లలిత, సినీ, జానపద గీతాలు, కూచిపూడి నాట్యాలు, హాస్య స్కిట్స్ , వదిన బిమరదళ్ల హాస్య సంభాషణలు ప్రేక్షకులను విశేషంగా ఆలరించాయి రావినూతల సత్యనారాయణ అలనాటి మేటి సినీ గీతాలు ఆలపించగా, అల్లాడ శ్యామలత భోగి ,గొబ్బెమ్మల పాటలు ఆలపించారు. పాటలకు అనుగుణంగా కొంతమంది మహిళలు నృత్యాలు చేశారు. తుమ్మల షనయ సిరి, మేధశ్రీ లు రాధాకృష్ణుల నృత్యంచేయగా ,దేవిశ్రీ ప్రియ కూచిపూడి నాట్యం చేశారు అనంతరం భవిష్య రచించి దర్శకత్వం వహించిన హాస్య స్కిట్స్ "జలుబు వదలాలంటే , ఫోటోల పెళ్లిళ్లు,అడ్రస్ గందరగోళం, బ్యాంక్ చెక్, డాక్టర్ తెలివి " మొదలైన హాస్య స్కిట్స్ ను ఔత్సాహిక కళాకారులు రావినూతల వెంకటేశ్వరరావు ,కోసూరు ఈశ్వరరావు, ఆర్.ఎస్ .నారాయణ, వై .శ్రీరామ్, శ్రీమతి పి.శాంతి బాల నటుడు చి: కృష్ణ కౌండిన్య దత్ లు అభినయించారు . వదిన మరదలు హాస్య సంభాషణలో హైదరాబాదుకు చెందిన చిలుకూరి నవ్య శ్రీ గాయత్రి,జమ్మలమడక బిందు దత్త శ్రీ లు సరదా సరదా మాటలతో అందరినీ నవ్వించారు.

# రాజ్యసభ సీటు రేసు చర్చ

విజయవాడ, జనవరి 12, ((భారత శక్తి)

కూటమిలో రాజ్యసభ సీటు రేసు చర్చకు దారితీస్తోంది. మరో నాలుగు నెలల్లో ఏపీలో నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ కానున్నాయి. ఆ నాలుగు సీట్ల కోసం అటు టీడీపీ, ఇటు జనసేన, మరోవైపు బీజేపీలో ఎవరి ఎక్స్‌పెక్టేషన్స్ వాళ్లకు ఉన్నాయ్. టీడీపీలో అయితే పైరవీల పర్వం నెక్స్ట్ లెవల్‌లో నడుస్తోందట. ఈ ఏడాది మే-జూన్ మధ్య జరిగే రాజ్యసభ సభ్యుల ఎన్నికలపై అప్పుడే లాబీయింగ్ జోరుందుకుందట. ఖాళీ అయ్యే నాలుగు సీట్లను టీడీపీ, కూటమి పార్టీలే గెలుచుకునే అవకాశం ఉంది. ఏపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వాని పదవీ కాలం 2026 జూన్ 21తో పూర్తి కానుంది. గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఉపఎన్నికలో టీడీపీ తరఫున రాజ్యసభకు ఎన్నికైన సానా సతీష్ పదవీకాలం కూడా జూన్‌లోనే ముగుస్తుంది. వీళ్ల స్థానంలో నలుగురు నేతలు ఏపీ నుంచి రాజ్యసభకు ఎన్నిక కానున్నారు. అయితే మూడు పార్టీలు..నాలుగు సీట్లను ఎలా పంచుకుంటాయనేదే ఆసక్తికరంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు రాజ్యసభకు ఉప ఎన్నికలు జరిగాయి. తొలుత మూడు స్థానాలకు, ఆ తర్వాత ఒక స్థానానికి ఎన్నిక జరిగితే టీడీపీ, బీజేపీ చెరో రెండు సీట్లు తీసుకున్నాయి. కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేనకు ఇప్పటివరకు రాజ్యసభలో అడుగుపెట్టే అవకాశం దక్కలేదు. ఈ పరిస్థితుల్లో త్వరలో ఖాళీ కానున్న రాజ్యసభ ఎన్నికల్లో



జనసేనకు ఓ సీటు కేటాయిస్తారని అంటున్నారు. జనసేనకు కేటాయించే రాజ్యసభ సీటులో లింగమనేని రమేష్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మెగాస్టార్ చిరంజీవి పేరు కూడా పరిశీలనలో ఉందని..తన అన్నయ్యను పెద్దలకు సభకు పంపితే ఎలా ఉంటుందనేదానిపై పార్టీ ముఖ్యనేతలతో పవన్ చర్చలు జరుపుతున్నట్లు ఇన్‌సైడ్ టాక్. నాలుగింట్లో ఒకటి జనసేనకు పోతే మిగిలేది మూడు సీట్లు. త్వరలో రిటైర్ అయ్యే నలుగురు రాజ్యసభ సభ్యుల్లో ఒకరైన రిలయన్స్ సంస్థలకు చెందిన పరిమళ్ నత్వానీని మళ్లీ రాజ్యసభకు పంపాలని బీజేపీ ఆలోచనగా చెబుతున్నారు. సేమ్‌టైమ్ బీజేపీ ఇంకో సీటును కూడా కోరే అవకాశం ఉందన్న గుసగుసలు మొదలయ్యాయి. అదే గనుక జరిగితే..బీజేపీకి రెండు సీట్లు ఇస్తే టీడీపీకి దక్కేది ఒక్కటే సీటు. ఆ సీటులో కూడా గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఉపఎన్నికలో టీడీపీ తరఫున ఎన్నికైన సానా సతీష్‌కే మళ్లీ రెన్యూవల్ చేస్తారని టాక్ వినిపిస్తోంది. దీంతో టీడీపీకి కొత్తగా ఒక్క రాజ్యసభ సీటు కూడా వచ్చే అవకాశం లేదన్న చర్చ జరుగుతోంది.

టీడీపీలో చాలా మంది సీనియర్లు, గత ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన లీడర్లు రాజ్యసభ రేసులో వెయిటింగ్‌లో ఉన్నారు. గత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండిపోయిన గల్లా జయదేవ్, పొత్తుల్లో భాగంగా సీట్లు కోల్పోయిన దేవినేని ఉమా, పిఠాపురం వర్మ, జవహర్‌తో పాటు సీనియర్ నేత వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, కంభంపాటి రామ్మోహన్‌రావు, టీడీ జనార్ధన్, కనకమేడల రవీంద్రకుమార్, రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి..రాజ్యసభ బెర్తును ఆశిస్తున్న వారిలో ఉన్నారు. పెద్దల సభకు వెళ్లాలని ఆశపడుతున్న నేతలంతా టీడీపీకి, చంద్రబాబుకు సన్నిహితులు. పార్టీకి ఏదో విధంగా ఉపయోగపడిన వారే. కమ్మ, ఎస్సీ, బీసీ, రెడ్డి వర్గాల నుంచి ఆరేడుమంది రాజ్యసభ సీటు ఆశిస్తుండగా..తమకు దక్కే సీట్లపైనే టీడీపీ అధిష్టానం డైలమాలో ఉందట. ఎలాగైనా రెండు సీట్లు తీసుకుని ఒకటి సానా సతీష్‌కు రెన్యూవల్ చేయడంతో పాటు మరొక సీటు ఆశావహుల్లో ఎవరికో ఒకరికి ఇచ్చి మిగతా వారిని మండలి రేసులో పెట్టే ప్లాన్ చేస్తున్నారట చంద్రబాబు.

========================

# రాజధాని రచ్చ



అమరావతి, జనవరి 12, (భారత శక్తి)

అమరావతి రాజధాని విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ , ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అవలంబిస్తున్న తీరు రాజకీయ వర్గాల్లోనే కాకుండా సామాన్య ప్రజల్లోనూ తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఒక ప్రధాన రాజకీయ పార్టీ రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన అంశంపై కాలక్రమేణా తన వైఖరిని మార్చుకుంటూ రావడం, ఆ పార్టీ రాజకీయ పరిపక్వతను , విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తోంది.రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సాక్షిగా అమరావతిని రాజధానిగా నిర్ణయించినప్పుడు, అప్పటి ప్రతిపక్ష నేతగా జగన్ మోహన్ రెడ్డి హృదయపూర్వకంగా ఆమోదం తెలిపారు. రాజధాని కనీసం 30 వేల ఎకరాల్లో ఉండాలి, అప్పుడే అది మహా నగరమవుతుంది అని ఆనాడు ఆయన చేసిన ప్రసంగాలు నేటికీ రికార్డుల్లో ఉన్నాయి. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే 33 వేల ఎకరాల సేకరణను తప్పుబట్టడం, దానిని ఒక రియల్ ఎస్టేట్ కుంభకోణంగా చిత్రించడం ప్రజల్లో మొదటి అనుమాన బీజాన్ని నాటింది. 2019 ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు కంటే గొప్పగా అమరావతిని నిర్మిస్తాం అని ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్, అనూహ్యంగా మూడు రాజధానుల నినాదాన్ని తెరపైకి తెచ్చారు. వికేంద్రీకరణ పేరుతో అమరావతిని కేవలం శాసన రాజధాని కే పరిమితం చేయడం వల్ల వేల సంఖ్యలో రైతులు రోడ్డున పడ్డారు. ఐదేళ్ల పాటు అభివృద్ధిని పూర్తిగా నిలిపివేసి, న్యాయస్థానాల్లో కేసులు వేస్తూ కాలయాపన చేయడం వల్ల రాజధాని ప్రాంతం ఒక శిథిలారణ్యంగా మారిందిమూడు రాజధానుల విధానానికి మద్దతు లభించలేదు. ఎన్నికల్లో మునుపెన్నడూ లేని విధంగా 11 సీట్లకు పడిపోయిన తర్వాత, వైసీపీ తన పంథాను మార్చుకున్నట్లు కనిపించింది. మళ్ళీ తాము కూడా అమరావతినే రాజధానిగా కొనసాగిస్తామని సజ్జల ప్రకటించారు. కానీ ఇప్పుడు కొత్తగా అమరావతిని నదీగర్భంలో కడుతున్నారంటూ జగన్ చేస్తున్న వ్యాఖ్యలు మరో కొత్త గందరగోళానికి తెరలేపాయి. రివర్ బేసిన్ అంటే ఏమిటో స్పష్టత లేకుండా ఇటువంటి ఆరోపణలు చేయడం కేవలం అభివృద్ధిని అడ్డుకోవడమేనని విమర్శలు వస్తున్నాయి. గతంలో ఇదే అమరావతిలో తన నివాసాన్ని నిర్మించుకున్నప్పుడు లేని పర్యావరణ ముప్పు, ఇప్పుడు ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటేనే కనిపిస్తోందా అని సామాన్య జనం ప్రశ్నిస్తున్నారు.రాజకీయాల్లో వ్యూహాలు మారవచ్చు కానీ, ఒక రాష్ట్ర మనుగడకు సంబంధించిన ప్రాజెక్టుపై విధానం మాటిమాటికీ మారకూడదు. జగన్ , వైసీపీ అనుసరిస్తున్న ఈ “యూ-టర్న్” రాజకీయం వల్ల ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకం సడలుతోంది. ఒకసారి రాజధాని అని, మరోసారి కాదని, మళ్ళీ అవునని, ఇప్పుడు మునిగిపోతుందని చెప్పడం ద్వారా వైసీపీ తన సొంత కేడర్‌ను కూడా అయోమయంలో పడేస్తోంది. నిత్యం మాట తప్పను.. మడమ తిప్పను అని చెప్పే నాయకుడు, రాజధాని విషయంలో ఇన్నిసార్లు మాట మార్చడం ఆయన రాజకీయ జీవితంలో ఒక పెద్ద మైనస్‌గా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రజలు రాజకీయ పార్టీల నుంచి ఆశించేది స్థిరత్వం. ఈ గందరగోళం ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో కూడా ప్రజల నుంచి సానుకూల స్పందన రావడం కష్టమే. ఇప్పటికైనా విమర్శల కోసం విమర్శలు మానేసి, నిర్మాణాత్మకమైన వైఖరిని అవలంబించడమే ఆ పార్టీకి శ్రేయస్కరం అనేది ఎక్కువ మంది భావన.

# చివరి దశకు కల్తీ నెయ్యి కేసు

తిరుమల, జనవరి 12, (భారత శక్తి)

తిరుమల లడ్డూ వివాదానికి సంబంధించిన కేసు విచారణ తుది దశకు చేరుకుంది. సిబిఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేపడుతున్న సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా తిరుపతిని కేంద్రంగా చేసుకొని ఈ ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కొనసాగుతోంది. దీనిని సిబిఐ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కేసు విచారణ ఒక కొలిక్కి వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడికి కోర్టు బెయిల్ నిరాకరించడం.. తుది దశకు చేరుకున్నట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం సంకేతాలు పంపించింది. అయితే ఈ కేసు విచారణలో భాగంగా సంచలనాలు నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తిరుమల లడ్డు తయారీలో వాడే నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందన్న ఆరోపణలు వచ్చాయి. అయితే జంతు కొవ్వుకు సంబంధించిన అంశం బయటకు రాలేదు కానీ.. నెయ్యి మాత్రం కల్తీ అయిందని స్పష్టమైన ఆధారాలు దొరికాయి. అయితే ఈ కేసు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీగా డ్యామేజ్ చేసింది.వైసీపీ హయాంలో టీటీడీ ప్రతిష్టకు మంటగలిపే చాలా రకాల చర్యలు జరిగాయన్నది ప్రధాన ఆరోపణ. అన్యమత ప్రచారం తో పాటు టీటీడీలో చాలా రకాల అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. ఇటువంటి నేపథ్యంలో ఏపీ సీఎం చంద్రబాబు వైసీపీ హయాంలో జరిగిన వ్యవహారం పై మాట్లాడారు. తిరుమల లడ్డు తయారీకి సంబంధించిన నెయ్యిలో జంతు కొవ్వు వాడారని ఆరోపణలు చేశారు. అప్పట్లో ప్రకంపనలకు దారితీసాయి ఆ వ్యాఖ్యలు. అయితే ఈ ఆరోపణలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అలర్ట్ అయింది. ఏకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. కానీ సిబిఐ నేతృత్వంలోని దర్యాప్తు కావాలని వైసిపి కోరింది. దీంతో కోర్టు సిబిఐ నేతృత్వంలోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. గత కొన్ని నెలలుగా సిట్ విచారణ చేపడుతోంది. అయితే ఇది తుది దశకు విచారణ వచ్చినట్లు తెలుస్తోంది.




అప్పట్లో టిటిడిలో పనిచేసిన ఓ అధికారి నెయ్యి సరఫరా చేసిన సంస్థల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడినట్లు విచారణలో తేలినట్లు సమాచారం. అయితే దాదాపు 80 లక్షల రూపాయలకు పైగా లావాదేవీలకు సంబంధించి ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే అప్పన్న అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించారు. తెర వెనుక పెద్ద వ్యక్తుల ప్రమేయాన్ని కూడా గుర్తించినట్లు సమాచారం. మరోవైపు సిబిఐ ఉన్నతాధికారులు ఢిల్లీ నుంచి తరచూ వస్తున్నారు. ఇంకోవైపు కోర్టు ప్రధాన నిందితుడికి సంబంధించి బెయిల్ తిరస్కరించింది. ఇటువంటి పరిస్థితుల్లో కేసు విచారణ తుది దశకు చేరినట్లు స్పష్టమవుతోంది. అయితే ఈ కేసులో సంచలనాలు నమోదయ్యే ఛాన్స్ ఉందని అధికార వర్గాల్లో ప్రచారం నడుస్తోంది.



# ఉత్తరాంధ్రపై వైసీపీ గురి....

విశాఖపట్టణం, జనవరి 12 (భారత శక్తి)

ఉత్తరాంధ్రపై వైసీపీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన, అతిపెద్ద నగరంగా ఉన్న విశాఖ పార్లమెంట్ సీటుపై అయితే అంతకు మించి కాన్సన్‌ట్రేషన్ పెట్టింది. వైసీపీ ఆవిర్భావం నుంచి..అక్కడ పూర్తి స్థాయి పట్టు సాధించలేకపోవడం ఫ్యాన్ పార్టీని కలవరపెడుతోందట. రాష్ట్రంలో అన్ని చోట్లా జెండా రెపరెపలాడినా, సాగర నగరం విశాఖలో మాత్రం పాతుకుపోవడం కుదరట్లేదట. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభంజనంలో ట్రయాంగిల్ ఫైట్‌లో విశాఖ ఎంపీ సీటును వైసీపీ గెలిచినా సరే, అసెంబ్లీ స్థానాల్లో ఒక్కటి కూడా గెలవలేకపోయింది.ఇటీవల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విశాఖలో స్టేట్ లెవల్ రికార్డు స్థాయి మెజార్టీలు సాధించగా, వైసీపీ అభ్యర్థులు కనీస పోటీని ఇవ్వలేక చేతులెత్తేశారు. పరిస్థితి ఇలానే కొనసాగితే ఫ్యూచర్‌లో ఇక కోలుకునే పరిస్థితి ఉండదని వైసీపీ పెద్దలు ఆలోచనలో పడ్డారట. అందుకే విశాఖపై వైసీపీ ఫుల్ ఫోకస్ పెట్టిందని టాక్.పార్టీకి సవాల్‌గా మారిన విశాఖ ఎంపీ స్థానంలో ఇంచార్జ్‌గా బలమైన నేతను బరిలోకి దింపాలని వైసీపీ పకడ్బందీగా పావులు కదుపుతోందట. గత ఎన్నికల్లో వైసీపీ నుంచి విశాఖ ఎంపీ అభ్యర్థిగా..సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీ పోటీ చేశారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలమైన నాయకురాలిగా ఉన్న ఆమెను పార్టీ బరిలో నిలిపితే గౌరవ ప్రదమైన ఓట్లను కూడా సాధించలేకపోయారు. కనీసం 30 శాతం ఓట్లను కూడా సాధించలేక చితికిలపడ్డారు.గత ఎన్నికల ఫలితాల తర్వాత బొత్స ఝాన్సీ సొంతూరు విజయనగరం జిల్లాకు మాత్రమే పరిమితమై, విశాఖ వైపు కన్నెత్తి చూడటం మానేశారు. గత కొన్నాళ్లుగా విశాఖకు చెందిన అంశాలపై రాజకీయంగా రచ్చ రచ్చ జరుగుతున్నా సరే ఆమె ఎక్కడా కనపడట్లేదు. పోనీ విజయనగరంలోనైనా సరే పార్టీ యాక్టివిటీలో ఆమె వాయిస్ ఎక్కడా వినిపించడం లేదు. అయితే బొత్స ఝాన్సీ ఇప్పుడు విశాఖ ఎంపీ స్థానంలో బాధ్యతలు చేపట్టడానికి సముఖంగా లేరని తెలుస్తోంది. పార్టీ అధిష్టానం కూడా ఇదే అంశాన్ని గ్రహించిందట. దీంతో విశాఖ పార్లమెంట్ పరిధిలో పార్టీని బలోపేతం చేసేలా బలమైన నాయకుడి కోసం టార్చ్ ఆన్ చేసి సెర్చ్ చేస్తోందని టాక్.స్టీల్ సిటీ విశాఖలో పార్టీకి ఉక్కు లాంటి నేత కోసం వైసీపీ పెద్దలు వెతుకాలట మొదలుపెట్టారట. ఎంత సెర్చ్ సరే సరైన ఆప్షన్ కనబడట్లేదంటున్నారు. దీంతో సరికొత్త ప్లాన్ దిశగా పార్టీ పెద్దలు అడుగులు వేస్తున్నట్లు రాజకీయవర్గాల్లో ప్రచారంలో ఉంది. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను రాబోయే ఎన్నికల్లో విశాఖ ఎంపీగా పోటీ చేయించే ప్లాన్ చేశారట. కానీ గుడివాడ అమర్‌నాథ్ ఎట్టి పరిస్థితుల్లో ఎంపీగా పోటీ చేయనని..తనకు స్టేట్ పాలిటిక్స్ అంటేనే ఇష్టమంటున్నారట. మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి క్యాబినెట్‌లో అడుగు పెట్టాలనేది ఆయన కల అంటున్నారు. దీంతో గతంలో విశాఖ పార్లమెంట్‌కు వైసీపీ నుంచి ఎన్నికైన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎంవీవీ సత్యనారాయణనే ప్రస్తుతానికి బెస్ట్ ఆప్షన్‌గా భావిస్తున్నారట.గత ఎన్నికల్లో విశాఖ ఈస్ట్ నుంచి అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయిన ఆయన్ను తిరిగి రీయాక్టివేట్ చేయడం ద్వారా క్యాడర్‌కు మంచి సంకేతాలు పంపాలన్నది వైసీపీ ప్లాన్ అంటున్నారు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత ఎంవీవీ కూడా ఎక్కడా యాక్టీవ్‌గా కనిపించడం లేదు. పొలిటికల్‌గా పూర్తిగా సైలెంట్ అయిపోయారు. తన వ్యాపార, వ్యవహారాలను మాత్రమే చక్కబెట్టుకుంటున్నారు. వైసీపీకి అంటీముట్టనట్లుగా ఉంటూ..పార్టీని గాలికి వదిలేశారు. అయినా ఆయనపై అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పైగా పార్టీ అధినేత జగన్‌తో జరిగే ప్రతీ సమావేశానికి ఎంవీవీకి ఇప్పటికీ ఆహ్వానం పంపుతూనే ఉన్నారట.ఆయన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకున్నా..వైసీపీ పెద్దలు మాత్రం ఆయన్ను దూరం పెట్టినట్లు కనిపించడం లేదు. దీంతో ఇప్పుడు ఎంవీవీని యాక్టివేట్ చేస్తే విశాఖ ఎంపీ సీటుతో పాటుగా ఈ పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లోని క్యాడర్‌కు ఊపు వస్తుందని పార్టీ అగ్రనేతలు భావిస్తున్నారట. కూటమి అధికారంలోకి రాగానే ఎంవీవీకి చెందిన హయగ్రీవ ప్రాజెక్ట్, సిరిపురంలోని ఎంవీవీ పీక్ వంటి భారీ నిర్మాణాలపై కన్నెర్ర చేసింది. దీంతో ఎంవీవీ పొలిటికల్‌గా అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిపోయారు. ఇప్పుడు వైసీపీ పెద్దలు ఆయన్ను రియాక్టివేట్ చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలకు ఎంవీవీ గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా..లేక కూటమి పవర్‌లో ఉందని మొహం చాటేస్తారా..అన్నది క్లారిటీ రావాలంటే మరికొన్నాళ్లు ఆగాల్సిందే.

# సమ్ థింగ్ స్పెషల్‌గా పవన్

కాకినాడ, జనవరి 12, (భారత శక్తి)

పొత్తు కుదుర్చడంలో ఆయనదే కీరోల్. ఇంకో పది, పదిహేనేళు కలిసే ఉంటామని చెప్తున్నది కూడా ఆయనే. ఎవరెన్ని కుట్రలు చేసినా కూటమి ఒకటిగానే ఉంటుందని.. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పదే పదే చెప్తున్నారు. కూటమి లాంగ్ లీవ్ అంటూ పవన్ స్టేట్‌మెంట్ ఇవ్వడం ఇదే మొదటి సారి కాదు. అయినా ఈసారి పిఠాపురం వేదికగా పవన్ చేసిన వ్యాఖ్యలు అయితే సమ్‌థింగ్ స్పెషల్‌గా మారాయి. ఇంటా, బయటా అందరికీ ఓ సంకేతం పంపించేలా ఆయన చేసిన ప్రకటన ఇప్పుడు పెద్ద చర్చకు దారితీస్తోంది. నిజానికి కూటమి విషయంలో చంద్రబాబు కంటే ముందే పవన్ ఓపెన్ స్టేట్‌మెంట్లు ఇస్తూ వస్తున్నారు. తాము కలిసే ఉంటామని.. ఇంకో 15ఏళ్లు చంద్రబాబే సీఎంగా ఉండాలని చెప్తూ వస్తున్నారు. అయితే ఈ సారి పవన్ చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీ నేతలను ఉద్దేశించే అన్న చర్చ జరుగుతోంది. జనసేనలో కొందరు నేతలు.. టీడీపీ, బీజేపీ నేతలతో కలిసి ముందుకు సాగకపోవడంతో పాటు.. అలయన్స్‌కు భంగం కలిగించేలా బిహేవ్ చేస్తున్నారట. అక్కడక్కడ సమస్యలు ఉన్నాయని..వాటిని పెద్దగా చేసి చూపించే ప్రయత్నం జరుగుతోందనేది పవన్ దృష్టికి వచ్చిందట. దీంతో సమయం సందర్భంగా చూసి మరీ.. పిఠాపురం వేదికగా.. అటు రాజకీయ ప్రత్యర్థులకు.. ఇటు సొంత పార్టీ జనసేన నేతలకు పవన్ క్లియర్ కట్ ఇండికేషన్ ఇచ్చారని టాక్ నడుస్తోంది. చంద్రబాబుకు, తనకు మధ్య మంచి సయోధ్య ఉందని కూడా పవన్ స్పష్టం చేశారు. ఇద్దరి మధ్య ఎలాంటి విభేదాలు, గ్యాప్‌లు లేవని చెప్పుకొచ్చారు పవన్. సేమ్‌టైమ్ పిఠాపురంలో కొందరు చేస్తున్న కుట్రలు ఫలించవంటూ.. తమ రాజకీయ ప్రత్యర్థులను గట్టిగానే టార్గెట్ చేశారు పవన్. గత ప్రభుత్వం కేవలం బూతులు తిట్టడం, అక్రమ కేసులు పెట్టడంపైనే దృష్టి పెట్టిందని, ఇప్పుడు పిఠాపురంలో మళ్లీ అదే పద్ధతులను అమలు చేయాలని చూస్తున్నారని ఫైరయ్యారు. పులివెందులలో సొంత బాబాయిని చంపినా అది వార్త కాదు, కానీ పిఠాపురంలో చిన్న పిల్లల గొడవ పడితే దానికి కులమతాల రంగు పులిమి రచ్చ చేస్తారా అంటూ విమర్శించారు. పిఠాపురంలో అశాంతి సృష్టించాలని చూస్తే, ఇక్కడే కూర్చునే అరాచక శక్తులను ఏరివేస్తానంటూ గర్జించారు సేనాని. తనను మెత్తని మనిషిగా భావించి నెత్తికెక్కాలని చూడొద్దన్న పవన్.. గొడవ పెట్టుకోవాలంటే తాను కూడా సిద్ధమేనంటూ సవాల్ చేసి మరింత ఇంట్రెస్టింగ్ చర్చకు దారి తీశారు. కూటమిని వీక్ చేసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని, అలాంటి ప్రయత్నాలు చేసేవారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఏపీలో టీడీపీ, బీజేపీ.. కూటమి ఏర్పాటులో జనసేన అధినేత పవన్ కీరోల్ ప్లే చేశారనేది ఓపెన్ సీక్రెట్. ఈ విషయంపై పవన్ కూడా పలుసార్లు క్లారిటీ ఇచ్చారు. అదే పవన్ కల్యాణ్ ఇప్పుడు కూటమి లాంగ్ లీవ్ అని పదేపదే చెప్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెక్స్ట్ డే నుంచే పవన్ ఈ స్లోగన్‌ను బలంగా వినిపిస్తున్నారు. చాలాకాలం పాటు కూటమి అధికారంలో కొనసాగాలని, అనుభవం ఉన్న చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షిస్తున్నారు. లేటెస్ట్‌గా పిఠాపురంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో కూడా ఆయన ఇదే అంశాన్ని మరోసారి గుర్తు చేయడం ఆసక్తికరంగా మారింది.రాజకీయ ప్రత్యర్థులు అధికార పక్షాన్ని బలహీనపర్చాలని కోరుకోవడం, ప్రయత్నించడం కామనే. ఈ క్రమంలో గతంలోనే వైసీపీకి తేల్చి చెప్పారు పవన్. మీరెన్ని ప్రయత్నాలు, కుట్రలు చేసినా కూటమిని విడదీయలేదరని గతంలోనే పలుసార్లు ఓపెన్ స్టేట్‌మెంట్లు ఇచ్చారు. అయితే ఈ సారి పవన్ వార్నింగ్‌లు మాత్రం బయటి వాళ్లకంటే..సొంత పార్టీ నేతలకే ఎక్కువ తాకుతున్నాయట. కూటమిలో ఉన్న మూడు పార్టీల మధ్య పైస్థాయిలో సఖ్యత ఉన్నా, గ్రౌండ్ లెవెల్‌లో సమన్వయం లోపించిందన్న ప్రచారం ఉంది. అక్కడక్కడ లీడర్ల ఆధిపత్య పోరు, హవా చూపించాలన్న ప్రయత్నాలతో ఐక్యతకు ముప్పుగా మారొచ్చన్న ఆందోళన ఉంది. ఈ క్రమంలోనే కిందిస్థాయి కార్యకర్తలు, నేతలకు క్లియర్ కట్ ఇండికేషన్ పంపించేందుకే పవన్ ఇలాంటి స్టేట్‌మెంట్ ఇచ్చారంటున్నారు.

ఆ రెండు జిల్లాలు...

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కూటమి నేతల మధ్య విభేదాలున్నాయి. టీడీపీ అత్యధిక స్థానాల్లో గెలిచింది. జనసేన కేవలం 21 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. 175 నియోజకవర్గాల్లో 21 నియోజకవర్గాలంటే లెక్కలో పెద్ద అంకె కాదన్నది అందరికీ తెలుసు. కానీ పవన్ కల్యాణ్ మాత్రం ఆ ఇరవై ఒక్క నియోజకవర్గాలు మాత్రమే కాకుండా మిగిలిన నియోజకవర్గాల్లో కూటమి నేతల మధ్య నెలకొన్న విభేదాలను గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. ఒకరకంగా చెప్పాలంటే పవన్ కల్యాణ్ ఎప్పటిలాగానే ఆ రెండు జిల్లాలకే పరిమితమయి తన రాజకీయాలు చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పవన్ కల్యాణ్ తరచూ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు అప్పుడప్పుడు గిరిజన ప్రాంతాలకు వెళ్లి వస్తున్నారు.కూటమి నేతల మధ్య విభేదాలను పరిష్కరించుకోవడానికి ఎన్నికల ముందు నుంచే అన్ని పార్టీలతో కలసి సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకున్నాయి. రాష్ట్ర స్థాయిలో ఒకటి, జిల్లా స్థాయిలో మరొక సమన్వయ కమిటీలు ఏర్పడ్డాయి. కానీ రెండేళ్లవుతున్నప్పటికీ ఈ జిల్లా సమన్వయ కమిటీ కానీ, రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ కానీ కలసి కూర్చుని చర్చించలేదు. విభేదాలపై దృష్టి పెట్టలేదు. ఎన్నికలకు ఇంకా సమయం ఉందని పవన్ కల్యాణ్ అనుకుంటూ ఉండవచ్చు. కానీ అప్పటికి నేతల మధ్య గ్యాప్ పెరిగి పూడ్చలేనంతగా తయారవుతుందని, మొగ్గలోనే విభేదాలను తుంచేస్తే కూటమి పదికాలాల పాటు పదిలంగా ఉంటుందన్న సూచనలు వెలువడుతున్నాయి. గ్యాప్ పెరిగే కొద్దీ పార్టీని వీడే వారి సంఖ్య కూడా ఎక్కువవుతుందన్న విషయాన్ని గ్రహిస్తే మంచిది.



# జాతీయస్థాయిలో వైసీపీకి తగ్గిన బలం!

గుంటూరు, జనవరి 12, ( (భారత శక్తి)

జాతీయ స్థాయిలో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభావం తగ్గుతోంది. మొన్నటి ఎన్నికల్లో ఆ పార్టీకి ఘోర పరాజయం ఎదురైంది. కేవలం నలుగురు ఎంపీలు మాత్రమే గెలిచారు ఆ పార్టీ నుంచి. 175 అసెంబ్లీ స్థానాలకు గాను 11 చోట్ల మాత్రమే ఆ పార్టీ గెలిచింది. అయితే రాష్ట్రంలో శాసనమండలిలో, కేంద్రంలో రాజ్యసభలో ఆ పార్టీకి బలం ఉండేది. ఏపీలో అధికార పార్టీ కంటే ఎక్కువగా ఆ రెండు చోట్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం ఎక్కువ. 2024 ఎన్నికల ఫలితాలు వచ్చేసరికి ఏపీ శాసనమండలిలో ఆ పార్టీ బలం 38. రాజ్యసభలో 11 మంది ఎంపీలు ఉండేవారు. అయితే రాజ్యసభలో టిడిపికి కనీస ప్రాతినిధ్యం లేకపోయేది. మండలిలో సైతం ఓ పదిమంది ఎమ్మెల్సీలు మాత్రమే ఉండేవారు. అయితే ఇప్పుడు ఆ రెండు చోట్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం తగ్గిపోవడం విశేషంశాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 38 మంది ఎమ్మెల్సీలు ఉండేవారు. అయితే క్రమేపి ఆ సంఖ్య తగ్గుతోంది. ఓ ఆరుగురు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. కూటమి పార్టీలో చేరారు. అయితే మండలి చైర్మన్ గా ఉన్న మోసేన్ రాజు వారి రాజీనామాలను ఆమోదించలేదు. పెండింగ్ లో పెట్టారు. లేకుంటే ఓ పదిమంది ఎమ్మెల్యేల సంఖ్య తగ్గేది. కూటమి పార్టీల ప్రాతినిధ్యం పెరిగేది. ఉపాధ్యాయులతో పాటు స్థానిక సంస్థల కు సంబంధించి ఎమ్మెల్సీలతో సమాన బలం వచ్చేది. అదే జరిగితే మండలి చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టి పదవి నుంచి దించేసేది టిడిపి. అందుకే శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంకా బలం చాటుతోంది.మరోవైపు రాజ్యసభలో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం నాలుగుకు పడిపోనుంది. 2024 ఎన్నికల ఫలితాలు నాటికి రాజ్యసభలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం 11. కానీ ఆ పార్టీ నుంచి మోపిదేవి వెంకటరమణ, బీదా మస్తాన్రావు, ఆర్ కృష్ణయ్య బయటకు వచ్చేసారు. రాజ్యసభ పదవులకు రాజీనామా చేశారు. దీంతో వైసిపి బలం 8 కి పడిపోయింది. మరోవైపు విజయసాయి రెడ్డి సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు.

ఆ పార్టీ ద్వారా వచ్చిన రాజ్యసభ పదవిని వదులుకున్నారు. దీంతో వారి బలం ఏడుపు పడిపోయింది. మరోవైపు ఈ జూన్ నాటికి వైసీపీకి చెందిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమల్ నత్వాని పదవీ విరమణ చేస్తారు. వారితో పాటు టిడిపికి చెందిన సానా సతీష్ సైతం పదవీ విరమణ చేస్తారు. అయితే వైసీపీకి ఎప్పటి వరకు ఉన్న ఏడుగురు ఎంపీలు.. నలుగురు గా మిగలనన్నారు. దీంతో ఆ పార్టీ బలం పూర్తిగా తగ్గిపోయినట్టు అవుతుంది. రాష్ట్రంలో ఎమ్మెల్సీల తో పాటు కేంద్రంలో రాజ్యసభ సభ్యులు తగ్గడం మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా లోటు.

# చిత్తూరు జిల్లా గుడిపాల మండలం బట్వాలూరు గ్రామంలో ఏనుగుల విధ్వంసం

## ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యం, బీట్ ఆఫీసర్పై తీవ్రమైన ఆరోపణలు

చిత్తూరు జనవరి 12, ( (భారత శక్తి)

చిత్తూరు జిల్లా గుడిపాల మండలం బట్వాలూరు గ్రామ పరిధిలో ఏనుగులు రైతు పొలాల్లోకి చొరబడి తీవ్ర విధ్వంసం సృష్టించాయి. ఫారెస్ట్ ప్రాంతంలో దాదాపు 15 ఏనుగులు దాక్కుని ఉన్నప్పటికీ, అటవీ శాఖ అధికారులు ముందస్తు హెచ్చరికలు ఇవ్వకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఏనుగుల దాడితో మామిడి తోటలు పూర్తిగా ధ్వంసం కాగా, రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఈ ఘటనపై స్పందించాల్సిన ఫారెస్ట్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీసింది.ఇదిలా ఉండగా, కుసుమ కుమారి అనే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్పై తీవ్ర అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఏనుగుల వల్ల మామిడి తోట నష్టపోయిన రైతు శంకర్ నాయుడు ఆరోపణకట్లలోడు ఇటికలు బట్టి ఆవేదన వ్యక్తం చేశారు వాళ్ళ వద్ద వద్ద నుంచి రూ.10,000 లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అదేవిధంగా, ఇంట్లో వంట చేసుకునేందుకు అటవీ ప్రాంతంలో ఎండిపోయిన పుల్లలు ఏరుకుంటున్న మేస్త్రి సీతాలు పనిచేస్తున్న పేద కుటుంబాన్ని బెదిరించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తొలుత రూ.10,000 డిమాండ్ చేసి, చివరికి రూ.5,000 ఇవ్వకపోతే కేసు పెడతానని బెదిరించినట్లు బాధితులు చెబుతున్నారు.

ఇంకా, కలెక్టర్ కార్యాలయం సమీపంలో ముష్టికాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న అనుపు.ఎస్టీ కాలనీకి చెందిన ముసలవ్వమహిళ వద్ద నుంచి కూడా రూ.5,000 డిమాండ్ చేసి, చివరకు రూ.2,500 వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. లంచం ఇవ్వకపోతే కేసు పెడతానని బెదిరించడమే కాకుండా, ఆమె వద్ద ఉన్న ముష్టికాయలను కూడా తీసుకెళ్లినట్లు బాధితులు వాపోతున్నారు.ఈ ఘటనలపై చుట్టుపక్కల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సంబంధిత ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కుసుమ కుమారి పై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# యూపీలో ఎస్ ఐ ఆర్ టెన్షన్

న్యూఢిల్లీ, జనవరి 12, (భారత శక్తి)

ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల సంఘం జనవరి 6న ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ తర్వాత ముసాయిదాను విడుదల చేసింది. ఈ ప్రక్రియలో దాదాపు 3 కోట్ల ఓటర్లను తొలగించారు. గతంలో154.4 మిలియన్ల ఉండగా.. ముసాయిదా జాబితాలో సుమారు 125.5 మిలియన్ల ఓటర్ల పేర్లు ఉన్నాయి, 2.9 కోట్ల పేర్లను తొలగించినట్లు ఉత్తరప్రదేశ్ ముఖ్య ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా మొత్తం ఓట్లలో దాదాపు 18.7 శాతం తొలగించగా.. తమిళనాడు (15%), గుజరాత్ (14.5%) కంటే అధికం. ఈ తొలగింపులకు మరణం, శాశ్వత వలస, పలుచోట్ల నమోదు మూడు కారణాలు ఉన్నాయని తెలిపారు.ముసాయిదా తుది జాబితా కాదని ఈసీ స్పష్టం చేసింది. తమ పేర్లు లేని ఓటర్లు, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు ఫిబ్రవరి 6 వరకు అవకాశం ఉంది. ప్రధాన పట్టణ కేంద్రాలలో అత్యధిక తొలగింపులు.. లక్నో అత్యధికంగా 30.05 శాతం




ఓట్లను తొలగించారు. గతంలో 3.99 మిలియన్ల నమోదిత ఓటర్లు ఉండగా, ముసాయిదా జాబితాలో 2.79 మిలియన్లు ఉన్నారు,ఓటర్ల జాబితా ప్రత్యే?క సవరణ ద్వారా భారీ మొత్తంలో ఓటర్ల తొలగింపుపై ప్రతిపక్ష సమాజ్‌వాద్ పార్టీ, కాంగ్రెస్‌లతో పాటు అధికార బీజేపీ కూడా ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం. యూపీ కాంగ్రెస్ చీఫ్ అజయ్ రాయ్ మాట్లాడుతూ.. ూఎఖీ ప్రక్రియ గందరగోళ వాతావరణాన్ని సృష్టించిందని ఆరోపించారు. దాదాపు 2.9 కోట్ల ఓటర్ల తొలగించడంపై ఖచ్చితంగా దర్యాప్తు జరగాలని, 11.3 మిలియన్ల ఫారాలు తిరిగి రాలేదని చెప్పడం ఒక లోతైన కుట్ర, దానిని దర్యాప్తు చేసి చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, బీజేపీ నాయకులు జాబితాలపై ఆందోళనలను వ్యక్తం చేశారు. భారీ సంఖ్యలో పార్టీ మద్దతుదారుల పేర్లు కనిపించకుండా పోయే అవకాశం ఉందని యోగి అన్నారు. ముఖ్యంగా పట్టణ కేంద్రాలలో భారీగా తొలగింపులు ఆందోళనకు గురిచేస్తోందని, నగరాలలో బీజేపీకి ఉన్న ఓటు బ్యాంకు బలహీనపడతుందని భయాలున్నాయని ఆ పార్టీ అన్నారు.ఈ ఆందోళన ముఖ్యంగా ఢిల్లీ, పరిసర నగరాల్లోని పట్టణ ప్రాంతాలలో ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చినవారే ఉన్నారు. వీళ్లంతా తమ స్వస్థలాలలో ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి ఇష్టపడతారు. సవరణ తర్వాత 1.77 లక్షల పోలింగ్ బూత్‌లు ఉన్నాయని సీనియర్ బీజేపీ నాయకుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 'ప్రతి బూత్‌కు 200 మంది ఓటర్లు చొప్పున 3.5 కోట్లకు పైగా నిజమైన ఓటర్లను నమోదు చేయించాలని పార్టీ నాయకులకు ఆదేశాలు వచ్చాయి. యువ ఓటర్ల వద్ద సరైన పత్రాలు లేకపోవడం లేదా ఓటర్ల జాబితాలోని లోపాల కారణంగా జాబితా నుంచి తొలగించినవారిని చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నాం' అన్నారు. ప్రస్తుతం యూపీలో సుమారు 15.5 కోట్ల మంది అర్హత కలిగిన ఓటర్లు ఉంటారనే అంచనా ప్రకారం ఈ లక్ష్యాన్ని నిర్దేశించినట్లు ఆ నాయకుడు తెలిపారు.ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులపై అభ్యంతరాలను జనవరి 6 నుంచి ఫిబ్రవరి 6 వరకు స్వీకరిస్తామని, తుది ఓటర్ల జాబితాను మార్చి 6న ప్రచురిస్తామని ఎన్నికల సంఘం పేర్కొంది.

# మటన్ కేజీ రూ.800..
# నాటు కోడి కేజీ ధర రూ.2,500..

హైదరాబాద్, జనవరి 12, (భారత శక్తి)

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగ వేళ నాటుకోడి ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. పండుగ రోజుల్లో నాటుకోడి మాంసం వండుకోవడం సంప్రదాయంగా వస్తుండటంతో వీటికి భారీ గిరాకీ ఏర్పడింది. ఏపీకి ఆనుకొని ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలతో పాటు.. ఏపీలోని గోదావరి జిల్లాల్లో నాటుకోడి ధర రికార్డు స్థాయిలో రూ. 2 వేల నుండి రూ. 2,500 వరకు పలుకుతున్నాయి. మటన్ ధర రూ. 800 ఉండగా.. నాటుకోడి ధర దాన్ని మించిపోవడం గమనార్హం. ఉత్పత్తి తగ్గడం, పెంపకం చేసే రైతుల సంఖ్య పరిమితంగా ఉండటమే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం.తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగ సందడి మొదలవ్వకముందే నాటుకోడి మాంసానికి గిరాకీ అమాంతం పెరిగింది. పండుగ రోజుల్లో నాటుకోడి వండుకోవడం ఒక సంప్రదాయంగా వస్తున్నందున.. మార్కెట్‌లో వీటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ ఏడాది ఉత్పత్తి తగ్గడం, పెంపకం చేసే రైతుల సంఖ్య పరిమితంగా ఉండటంతో నాటుకోడి ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరాయి.అందుతున్న సమాచారం ప్రకారం.. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం చుట్టుపక్కల ప్రాంతాల్లో.. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో నాటుకోడి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. పందెం పుంజులు, మేలు రకం నాటుకోళ్ల ధర కేజీ రూ. 2,000 నుండి రూ. 2,500 వరకు పలుకుతోంది. కొన్ని ప్రాంతాల్లో పందాలకు ఉపయోగించే కోళ్లకు ఇంకా ఎక్కువ ధర లభిస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో పందెం కోళ్లను పెంచుతూ ఉంటారు. వీటి ధరలు రూ.లక్షల్లో ఉండటం గమనార్హం.ఇక హైదరాబాద్ వంటి నగరాల్లోనూ కేజీ నాటుకోడి ధర రూ. 600 నుండి రూ. 1,000 వరకు విక్రయిస్తున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే..



ప్రస్తుతం మటన్ ధర కేజీ రూ. 800 నుండి రూ. 900 ఉండగా.. నాటుకోడి ధర దానిని కూడా దాటేసింది. ప్రస్తుతం గ్రామాల్లో నాటుకోళ్లు దొరకడమే కష్టంగా మారింది. పండుగ అవసరాల కోసం ప్రజలు నెల రోజుల ముందే గ్రామాల్లో ఆరా తీసి వీటిని బుక్ చేసుకుంటున్నారు. పందెం పుంజుల కంటే రుచి పరంగా పిట్టలకే ఎక్కువ గిరాకీ ఉంటోంది. అందుకే చాలా చోట్ల కోడి పిట్టల కొనుగోలుకు వినియోగదారులు పోటీ పడుతున్నారు. నాటుకోడి ధరలు చుక్కలు చూపిస్తున్నప్పటికీ.. సాధారణ బ్రాయిలర్ చికెన్ ధరలు మాత్రం కొంతవరకు స్థిరంగా ఉన్నాయి.ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, వరంగల్ వంటి నగరాల్లో స్కిన్‌లెస్ చికెన్ ధర కేజీ రూ. 300 నుండి రూ. 320 మధ్య కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో రూ. 260 నుండి రూ. 280 వరకు లభిస్తోంది. గతంలో ప్రతి ఇంట్లో నాటుకోళ్లు పెంచేవారు.. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కేవలం కొన్ని పౌల్ట్రీ ఫారాల్లో మాత్రమే నాటుకోళ్లను పెంచడం వల్ల సరఫరాలో తీవ్ర కొరత ఏర్పడింది. పండుగ రోజున బ్రాయిలర్ చికెన్ కంటే నాటుకోడి తినడానికే జనం ఆసక్తి చూపడం వల్ల ముమ్ముందు ఈ ధరలు మరికొంత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

# అక్కడి నుంచి కవిత పోటీ..
## అజారుద్దీన్ కి కష్టమే!

నిజామాబాద్, జనవరి 12,

తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో భాగంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత మహ్మద్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. అయితే ప్రస్తుతం అజారుద్దీన్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కాదు. మంత్రి పదవి చేపట్టిన ఆరు నెలల్లో ఎమ్మెల్యే గానీ, ఎమ్మెల్సీ గానీ కావాలి. లేదంటే మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ఇటీవల ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన కవిత కూడా పోటీకి సిద్ధమవుతోంది. కవిత



రాజీనామాను గుత్తాసుఖేందర్‌రెడ్డి ఆమోదించారు. కవిత స్థానం ఖాళీ కావడంతో, త్వరలోనే భర్తీ ప్రక్రియ ప్రారంభం కానుంది. అధికార కాంగ్రెస్ పార్టీ ఇక్కడ తమ అభ్యర్థిని ఎంపిక చేసుకునేందుకు సంస్థాగత చర్యలు పూర్తి చేసినట్లు సమాచారం.ఖాళీ అయిన కవిత స్థానాన్ని మాజీ క్రికెటర్ అజరుద్దీన్‌కు ఈ స్థానం ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నప్పటికీ, పరిస్థితుల వల్ల మంత్రి పదవి ఇచ్చి మచ్చిక చేసుకున్నారు. రెండు సభల్లో ప్రాతినిధ్యం లేకపోవడంతో, నిబంధనల ప్రకారం ఆరు నెలల్లో ఏ సభలోనైనా సీటు సాధించాల్సి ఉంది.కవిత 2022లో నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా ద్వారా ఎమ్మెల్సీగా ఎన్నికైంది, ఇది ప్రత్యక్ష ఎన్నికే. ఇప్పుడు కూడా అదే విధానం పాటించాల్సి వచ్చింది. కానీ, నిజామాబాద్ ఎంపీ స్థానం బీజేపీ వద్ద ఉండటం, స్థానికంగా బీఆర్ఎస్ బలోపేతం కారణంగా కాంగ్రెస్‌కు సవాలు. అజరుద్దీన్ మండలిలోకి ప్రవేశించి విజయం సాధించగలరా అనేది ఆసక్తికరంగా చూడాలి.

================

# టాలీవుడ్ ఓవర్సీస్ రికార్డు

హైదరాబాద్, జనవరి 12(భారత శక్తి)

మన తెలుగు చలన చిత్ర పరిశ్రమకు ఓవర్సీస్ లో మార్కెట్ సృష్టించింది మెగాస్టార్ చిరంజీవి. రెండు దశాబ్దాల క్రితమే ఆయన సినిమాలు ఓవర్సీస్ లో విడుదలై సంచలనాలను నమోదు చేశాయి. ఆ తర్వాత పవన్ కళ్యాణ్, మహేష్ బాబు వంటి వారు ఆ ఓవర్సీస్ మార్కెట్ ని తార స్థాయికి తీసుకెళ్లారు. అయితే ఈమధ్య కాలం లో చిరంజీవి సినిమాలకు ఓవర్సీస్ లో కాస్త క్రేజ్ తగ్గింది. ఆయన రేంజ్ కి తగ్గ కలెక్షన్స్ ని రాబట్టలేకపోయాడు. కానీ రీ ఎంట్రీ లో 'ఖైదీ నెంబర్ 150' చిత్రం తో చిరంజీవి జూం లో 1.3 మిలియన్ డాలర్ల గ్రాస్ వసూళ్లను రాబట్టి సెన్సేషన్ సృష్టించాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు ని మరోసారి మెగాస్టార్ అందుకోలేకపోయాడు. అయితే ఈ నెల 12 న విడుదల కాబోతున్న 'మన శంకర వరప్రసాద్ గారుచిత్రం తో 'ఖైదీ నెంబర్ 150' రికార్డుని అందుకోబోతున్నాడు మెగాస్టార్ చిరంజీవి.అంతే కాదు, ఈ చిత్రం రీసెంట్ గా విడుదలైన రెబల్ స్టార్ ప్రభాస్ 'రాజా సాబ్' ప్రీమియర్స్ గ్రాస్ ని కూడా దాటేయబోతుంది. 'రాజా సాబ్' చిత్రానికి ప్రీమియర్స్ ద్వారా దాదాపుగా 1.3 మిలియన్ డాలర్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. ఇప్పుడు ఈ రికార్డు ని 'మన శంకర వరప్రసాద్ గారు' దాటేయబోతుంది. ఈ చిత్రానికి జూం ప్రీ సేల్స్ ద్వారా దాదాపుగా వి850ఐ డాలర్లు వచ్చాయి. ఓవరాల్ నార్త్ అమెరికా కలిపి ఈ చిత్రానికి వి920ని డాలర్లు వచ్చాయి. ప్రీమియర్స్ మొదలయ్యాక పాజిటివ్ టాక్ ని సొంతం చేసుకున్న తర్వాత ఈ చిత్రానికి 1.4 మిలియన్ డాలర్ల గ్రాస్ వసూళ్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. అదే కనుక జరిగితే 'రాజా సాబ్' కంటే ఎక్కువ గ్రాస్ చేసినట్టు.

కేవలం నార్త్ అమెరికా లో మాత్రమే కాదు, ఆస్ట్రేలియా, యునైటెడ్ కింగ్డమ్, మిడిల్ ఈస్ట్ లో కూడా ఇదే రేంజ్ ట్రెండ్ కొనసాగుతుంది. చూస్తుంటే కేవలం ఓవర్సీస్ నుండే మెగాస్టార్ 30 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టేలా ఉన్నాడు. సైరా నరసింహా రెడ్డి చిత్రం తర్వాత మెగా ఫ్యాన్స్ మెగాస్టార్ నుండి సరైన ఓపెనింగ్స్ చూడలేకపోయారు. ఇప్పుడు కొంత గ్యాప్ తర్వాత 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం తో మరోసారి తన ఓపెనింగ్స్ స్టామినా ని చూపించబోతున్నాడు మెగాస్టార్. చూడాలి మరి ఈ సినిమాకు ఎలాంటి టాక్ రాబోతుంది అనేది. ప్రస్తుతానికి ఉన్న ట్రెండ్ ప్రకారం చూస్తే ఈ చిత్రానికి మొదటి రోజు 60 నుండి 70 కోట్ల గ్రాస్

## గులాబీ చిక్కముళ్లు..

# కవిత తప్పేంత? కేటీఆర్ చేసిన ద్రోహం ఏంటి?



హైదరాబాద్, జనవరి 12, (భారత శక్తి)

రాజకీయాలలో ముఖ్యంగా కుటుంబాలు నడిపే పార్టీలలో అంతర్గతంగా కుమ్ములాటలు చోటు చేసుకోవడం మనదేశంలో కొత్తేమీ కాదు. గతంలో కాంగ్రెస్ పార్టీ లో సంజయ్ గాంధీ వ్యవహార శైలి ఈ దేశ ప్రజలకు సుపరిచితమే. తమిళనాడులో డీఎంకే, ఉత్తర్ ప్రదేశ్ లో సమాజ్ వాదీ పార్టీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదాహరణలు.. అంతిమంగా అధికారం కోసం, అలవిమాలిన సంపాదన కోసం జరిగే పోరాటాలు ప్రాంతీయ కుటుంబ పార్టీల అసలు బాగోతాన్ని బయటపెడతాయి. ఇప్పుడు ఈ జాబితాలోకి భారత రాష్ట్ర సమితి కూడా చేరింది. 2014లో అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి.. తెలంగాణలో వ్యవస్థలను ఎంత నాశనం చేయాలో అంత చేసింది. ప్రత్యర్థి పార్టీల ఎమ్మెల్యేలను అడ్డగోలుగా కొనేసింది. ప్రతిపక్షం అనేది లేకుండా చూసుకుంది. కాళేశ్వరం నుంచి మొదలు పెడితే గొర్రెల పంపిణీ వరకు ఇలా ప్రతి పథకంలోనూ అవినీతి జరిగిందని, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వినిపించాయి. వాస్తవానికి ఇటువంటి కుంభకోణాలు పార్టీకి డ్యామేజ్ చేయడం ఒక ఎత్తు అయితే.. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు కలిగించే డ్యామేజ్ మరొక ఎత్తు. వాస్తవానికి గులాబీ పార్టీలో ఈ స్థాయిలో అంతర్గతంగా కుమ్ములాటలు జరుగుతాయని ఎవరూ ఊహించలేదు. సాక్షాత్తు కెసిఆర్ కుమార్తె వ్యతిరేక స్వరాన్ని వినిపిస్తారని.. తన తండ్రి పరిపాలనను ఉదాహరణలతో వివరిస్తూ విమర్శిస్తారని ఎవరూ అంచనా వేయలేదు. కాళేశ్వరం ప్రయోజనం నెరవేరలేదని, పాలమూరు రంగారెడ్డి పథకాన్ని పండబెట్టారని, సామాజిక తెలంగాణ సహకారం కాలేదని ఇలా ప్రతి విషయంలోనూ కవిత విమర్శలు చేసుకుంటూ పోయారు. కొన్ని సందర్భాలలో లెక్కలతో సహా వివరించారు. ఒక రకంగా ఈ పనిని కాంగ్రెస్ చేయాల్సి ఉండేది. ఒక రకంగా బలమైన స్వరాన్ని వినిపించే ప్రయత్నం చేశారు కవిత. కవిత చేస్తున్న ఆరోపణల్లో నిజం లేకపోలేదు. కానీ 10 సంవత్సరాల కాలంలో అధికారంలో ఉన్నప్పుడు ఆమె ఏం చేశారు అనేది ఇక్కడ అసలైన ప్రశ్న. భారత రాష్ట్ర సమితి ఏర్పాటును వ్యతిరేకించానని చెప్పిన ఆమె.. పార్టీ ప్రారంభత్సవానికి ఢిల్లీ ఎందుకు వెళ్లినట్టు? 10 సంవత్సరాల కాలంలో తెలంగాణలో విధ్వంసం జరిగిందని చెబుతున్న ఆమె.. గతంలో బంగారు తెలంగాణ సాకారం అయిందని ఎందుకు చెబుతున్నట్టు.. లిక్కర్ కేసులో అడ్డంగా ఇరుక్కుపోయారు కాబట్టి.. కేసుల నుంచి తప్పించుకోవాలంటే ఆమె కెసిఆర్ కు వ్యతిరేకంగా వ్యవహరించాలి కాబట్టి.. అలానే చేస్తున్నారని గులాబీ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్, బిజెపి రాజకీయాల లక్ష్యాలకు అనుగుణంగా ఆమె నడుచుకుంటున్నారని గులాబీ నేతలు మండిపడుతున్నారు. వాస్తవానికి తన పార్టీలో ఉన్నప్పుడు ప్రాధాన్యం దక్కలేదని పదేపదే ఆరోపిస్తున్న కవిత.. ఒకసారి ఎంపీ ఎలా అయ్యారు? మరోసారి ఎమ్మెల్సీ ఎలా అయ్యారు? సింగరేణిలో అధ్యక్షురాలిగా ఎలా ఉన్నారు? ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయని గులాబి పార్టీ నేతలు అంటున్నారు. అధికారం దూరంగానే కెసిఆర్ కు వ్యతిరేకంగా మాట్లాడటం సమంజసం కాదని ఆమెకు గుర్తుచేస్తున్నారు. మరోవైపు జాగృతి నేతలు స్పందిస్తున్న తీరు వేరే విధంగా ఉంది. కేటీఆర్ కూడా ఆమెకు ద్రోహం చేశారని.. కనీసం ఒక పని కూడా చేసుకునే అవకాశం కల్పించలేదని.. ఆమె భర్త ఫోన్ కూడా టాప్ చేశారని.. అలాంటప్పుడు ఆమె పార్టీలో ఎలా ఉంటారంటూ జాగృతి నేతలు చెబుతున్నారు. గడిచిన 10 సంవత్సరాల కాలంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో హరీష్ రావు అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డారని.. అందువల్లే కవిత ఆయన టార్గెట్ చేస్తూ ఆరోపణలు చేస్తున్నారని జాగృతి నేతలు చెబుతున్నారు.. కవిత రాజకీయ ఎదుగుదలను తట్టుకోలేక ఆమెకు అడుగడుగునా అడ్డు పుల్లలు



వేస్తున్నారని.. అందువల్లే కవిత ఈ స్థాయిలో స్పందిస్తున్నారని జాగృతి నేతలు అంటున్నారు. కవితకు, కెసిఆర్ కు మధ్యలో గ్యాప్ రావడానికి ప్రధాన కారణం హరీష్, సంతోష్ రావు అని జాగృతి నేతలు చెబుతున్నారు. అందువల్లే ఆమె ఆధారాలతో సహా విమర్శలు చేస్తున్నారని.. ఇందులో వ్యక్తిగత లక్ష్యాలు అంటూ ఏమీ లేవని జాగృతి నేతలు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ అంతపురంలో జరిగే కుమ్ములాటలు రాజ్యానికి అసలు మంచివి కావు. ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చోటు చేసుకుంటున్న పరిణామాలు కూడా ఆ పార్టీకి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ఇప్పటికే పార్లమెంటు ఎన్నికల్లో 0 ఫలితాలు వచ్చాయి. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలలో అధికార పార్టీకి సానుకూలమైన ఫలితాలు వచ్చాయి. స్థానిక ఎన్నికల్లో చెప్పుకోదగ్గ స్థానాలు కూడా గులాబీ పార్టీకి రాలేదు. అలాంటప్పుడు ఈ అంతర్గత కుమ్ములాటను ఏ స్థాయిలో కేసీఆర్ పరిష్కరిస్తారో చూడాల్సి ఉంది.

## కేసీఆర్ ట్రాప్‌లో రేవంత్

హైదరాబాద్, జనవరి 12 (భారత శక్తి)



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ట్రాప్ లో పడుతున్నట్లే కనిపిస్తుంది. కేసీఆర్ పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం గురించి మీడియా సమావేశంలో మాట్లాడిన తర్వాత వరసగా జరిగిన పరిణామాలు చూస్తుంటే కేసీఆర్ మరోసారి విసురుతున్న సెంటిమెంట్ వలలో రేవంత్ రెడ్డి చిక్కుకుంటున్నట్లే కనిపిస్తుంది. తెలంగాణ ఎన్నికలు మరో మూడేళ్లు ముందుగానే జలవివాదాలు ఒక రకంగా అధికార పార్టీని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయని చెప్పాలి. కేసీఆర్ ఓటమి పాలయిన తర్వాత ప్రధానంగా నీటి విషయంలోనూ అందులోనూ పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విషయంలో సెంటిమెంట్ లేపి కాంగ్రెస్ ను డ్యామేజీ చేయాలని చూస్తున్నారు. అందులో భాగంగానే కేసీఆర్ పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయలేదని ప్రస్తావిస్తూనే ఇరు రాష్ట్రాలకు సంబంధించి కృష్ణా నీటి పంపకాల తేనెతుట్టెను కదిపారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ వేసిన ట్రాప్ లో చిక్కుకున్నారు. కేసీఆర్ తాము పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్లగొండలలో భారీ బహిరంగ సభలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అందుకు ముందుగానే శాసనసభ సమావేశాలను పెట్టి జలవివాదాలపై సుదీర్ఘంగా చర్చించారు. అయితే ఇక్కడే తాను చెప్పినందునే చంద్రబాబు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపేశారని వ్యాఖ్యానించడంతో అటు ఏపీలోనూ నీటి యుద్ధం మొదలయింది. అయితే చంద్రబాబుకు, రేవంత్ రెడ్డికి మధ్య ఉన్న స్నేహాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్ కూడా బయటపెట్టారు. ఇద్దరి మధ్య రహస్య ఒప్పందం ఏంటని ఆయన ప్రశ్నించారు. తాజాగా రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య జలవివాదాలను పరిష్కరించుకోవడం కోసం చర్చలు జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని అన్నారు. న్యాయస్థానాలు, ట్రైబ్యునల్ లో కాకుండా మనమే పరిష్కరించుకుందామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ వ్యాఖ్యలు కూడా ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రిని రాజకీయంగా ఇబ్బంది పెట్టేలా ఉన్నాయి. కేసీఆర్ అన్న ఒక్క మాటతో రేవంత్ రెడ్డి కెలుక్కుని లేని పోని వివాదాలను కొని తెచ్చుకున్నట్లయిందన్న కామెంట్స్ సొంత పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి ఎంత కేసీఆర్ పై నీటి విషయంలో విమర్శలు చేసినా మరోసారి సెంటిమెంట్ ను రేకిత్తించడంలో గులాబీ బాస్ సక్సెస్ అయ్యారు.

## రెచ్చిపోతున్న సైబర్ నేరగాళు

హైదరాబాద్, జనవరి 12, ((భారత శక్తి)

సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. చదువు రాని వారిని, అమాయకులనే కాదు.. బాగా చదువుకున్న వారిని కూడా ఇట్టే మోసం చేస్తున్నారు. ఏ మాత్రం డౌట్ రాకుండా పని కానిస్తున్నారు. మాయ మాటలతో నమ్మించి కోట్ల రూపాయలు కొట్టేస్తున్నారు. తాజాగా మాజీ ఐపీఎస్ అధికారి భార్యకే సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. ఏకంగా 2 కోట్ల రూపాయలు కొట్టేశారు. సైబర్ క్రిమినల్స్ చేతిలో మాజీ ఐపీఎస్ భార్య మోసపోయిన వైనం హైదరాబాద్ లో వెలుగుచూసింది. ఇది ఇన్వెస్ట్ మెంట్ ఫ్రాడ్ కేసు. మాజీ ఐపీఎస్ అధికారి భార్య రూ. 2.58 కోట్లు మోసపోయింది. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ చిట్కాలు ఇస్తామని వాట్సాప్ నుంచి ఆమెకు సందేశం వచ్చింది. అయితే, దాని గురించి ఆమెకు అవగాహన లేదు. దాంతో ఆమె తన భర్తను వాట్సాప్ గ్రూప్ లో యాడ్ చేయించింది. ఇక సైబర్ నేరగాళ్లు తమ పని మొదలు పెట్టారు. 500 శాతం లాభాలు వస్తాయని ఆమెకు మాయమాటలు చెప్పి నమ్మించారు. ఒక లింక్ పంపిన సైబర్ మోసగాళ్లు.. సెబీ సర్టిఫైడ్ వెబ్‌సైట్ అని ఆమెను నమ్మించారు. వాట్సాప్ లో సెబీ నకిలీ సర్టిఫికెట్లు కూడా పంపారు. అది చూసి ఆమె పూర్తిగా నమ్మేసింది. 500శాతం లాభాలు అనగానే టెంప్ట్ అయ్యింది. ఆ తర్వాత డబ్బులు ఇన్వెస్ట్ మెంట్ చేయడం ప్రారంభించింది. అలా డిసెంబర్ 24 నుంచి ఈ నెల 5 వరకు 19 లావాదేవీలు చేసింది. మొత్తం 2.58 కోట్లు పంపింది. ఆ తర్వాత డబ్బులు పంపడం ఆపేసింది. అయితే, మరింత డబ్బు పెట్టుబడి పెట్టాలని సైబర్ క్రిమినల్స్ ఆమెపై ఒత్తిడి పెంచారు. ఇన్వెస్ట్‌మెంట్ చేయకపోతే ఇప్పటివరకు పెట్టిన డబ్బు పోతుందని భయపెట్టారు. దాంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు లబోదిబోమంది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. సైబర్ క్రైమ్స్ గురించి పోలీసులు నిత్యం అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. లాభాల పేరుతో జరిగే మోసాల గురించి హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు.

## మున్సిపోల్స్ కు గులాబీ దళం సన్నద్ధం

హైదరాబాద్, జనవరి 12 (భారత శక్తి)


మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో పార్టీ గుర్తులతో జరిగే ఎన్నికలను గులాబీ బాస్ కేసీఆర్ ప్రస్తావించడంతో..బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీరియస్‌గా తీసుకుంటున్నారట. మున్సిపాలిటీ ఎన్నికల్లో మెజార్టీ మున్సిపాలిటీలను కైవసం చేసుకునేలా పక్కా ప్లాన్‌తో ముందుకు వెళ్తున్నారట. వచ్చే నెలలో మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయ్. పదవీకాలం ముగిసిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. అయితే ఈ మధ్యే జరిగిన పంచాయితీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సర్పంచులను గెలుచుకున్నా..4 వేలకు పైగా స్థానాలను గెలిచి బలమైన పోటీ ఇచ్చామని ప్రతిపక్ష బీఆర్ఎస్ చెబుతూ వస్తోంది. అయినా పంచాయతీ ఎన్నికల ఫలితాలపై గులాబీ బాస్ కేసీఆర్ సంతృప్తి వ్యక్తం చేయలేదని పార్టీ వర్గాలు చెప్తున్నాయ్. కాంగ్రెస్ పార్టీ కంటే ఎక్కువ సర్పంచ్ స్థానాలను గెలిచి ఉండాల్సిందని పార్టీ నేతలతో జరిగిన అంతర్గత సమావేశాల్లో కేసీఆర్ అభిప్రాయపడినట్లు తెలంగాణ భవన్ వర్గాల టాక్. పంచాయితీ ఎన్నికలు కనుక పార్టీ గుర్తుపై జరిగి ఉంటే..బీఆర్ఎస్ సత్తా ఏంటో కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలిసేదని కేసీఆర్ అన్నారట. గుర్తు లేకుండా జరిగిన ఎన్నికల్లోనే ప్రజలు అధికార పార్టీకి బుద్ధి చెప్పారని కేసీఆర్ ఇంటర్నల్ మీటింగ్‌లో కామెంట్ చేశారట. పార్టీ గుర్తులతో ఎన్నికలు జరిగి ఉంటే ఫలితాలు మరోలా ఉండేదని ఓ రకంగా ఛాలెంజ్ చేసిన కేసీఆర్..ఇప్పుడు పార్టీ గుర్తులతో జరుగబోతున్న మున్సిపల్ ఎన్నికలపై స్పెషల్ కాన్సన్‌ట్రేషన్ పెట్టారట. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మించి కాకపోయినా ఆ పార్టీతో సరిసమానంగానైనా స్థానాలను గెలవాలన్న పట్టుదలతో ముందుకు వెళ్తోందట బీఆర్ఎస్. కేటీఆర్ మున్సిపల్ ఎన్నికలపై సీరియస్‌గా దృష్టి పెట్టారట. అందుకే ఉమ్మడి జిల్లాల వారిగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ నేతలకు మున్సిపల్ ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తున్నారట. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ వచ్చాక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహిస్తారని తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ గుర్తులతో ఎన్నికలు జరిగితే సత్తా చాటేవాళ్లమన్న తమ అధినేత నమ్మకాన్ని నిలబెట్టేలా మున్సిపల్ ఎన్నికల్లో గౌరవప్రదమైన స్థానాలను గెలుచుకునేలా కేటీఆర్ గ్రౌండ్ వర్క్ స్టార్ట్ చేశారట. రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై తెలంగాణ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రేవంత్ రెడ్డి సర్కార్‌పై ఆగ్రహంగా ఉన్నారని బీఆర్ఎస్ భావిస్తోందట. మరి మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ వర్సెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ పోటీలో ఎవరిది పైచేయి అవుతుందో.? కారు పార్టీ ఎక్స్‌పెక్టేషన్స్‌ను రీచ్ అవుతుందో లేదో చూడాలి మరి.

## నరసింహ నగర్ కాలనీలో తీరిన నీటి కొరత

### –స్వర్గీయ పద్మావతి జ్ఞాపకార్థం చేతిపంపు ఏర్పాటు గంగాప్రసాద్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 12 (భారతశక్తి): భైంసా పట్టణంలోని వార్డ్ నెంబర్--8 నరసింహ నగర్ కాలనీలో నెలకొన్న తీవ్రమైన త్రాగునీటి సమస్యకు గంగాప్రసాద్ అనే సేవాభిలాషి పరిష్కారం చూపించారు. భైంసా గర్ల్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా సేవలందిస్తున్న గంగాప్రసాద్ తన స్వర్గీయ భార్య పద్మావతి జ్ఞాపకార్థం, తన ఇంటి ముందర కాలనీ వాసుల అవసరాలను గుర్తించి స్వంత ఖర్చుతో బోరు త్రవ్వించి చేతిపంపును ఏర్పాటు చేయించారు.





కాలనీలో దీర్ఘకాలంగా నీటి కొరత తీవ్రంగా ఉండటంతో, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గమనించిన గంగాప్రసాద్ సార్, ఎలాంటి ప్రభుత్వ సహాయం లేకుండానే తన వ్యక్తిగత ఖర్చుతో నీటి వసతిని కల్పించి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, "భైంసా పట్టణంలో చాలా చోట్ల నీటి సమస్య ఉన్నా, నరసింహ నగర్ కాలనీలో మా కష్టాన్ని గుర్తించి గంగాప్రసాద్ చేసిన సేవ మరువలేనిది. ఇది నిజమైన ప్రజాసేవకు నిదర్శనం" అని కొనియాడారు. స్వర్గీయ పద్మావతి జ్ఞాపకార్థం చేపట్టిన ఈ కార్యక్రమం, ప్రజల హృదయాలను హత్తుకుందని వారు తెలిపారు.

## రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలి: తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 12: రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించి కలెక్టర్ కు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మోతీ రామ్ నాయక్, జిల్లా అధ్యక్షులు దొడ్లేమోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి దశరథ్ వారు మాట్లాడుతూ, రైతు భరోసా డిసెంబర్ నెలలోనే విడుదల కావాల్సింది ఉండే కానీ జనవరి పూర్తి వరకు కాలయాపన చేస్తా ఉన్నారు. రైతులు అధిక వడ్డీతో అప్పులు తెచ్చుకొని అనేక అవస్తలు పడతా ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సంక్రాంతి రెండు రోజుల ముందే రైతుబరోస విడుదల చేయాలని మనస్ఫూర్తిగా రైతులు కోరుతున్నారు. లేనిచో జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని దిగుతామని రైతు సంఘం కమిటీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో మధుసూదన్ గణేష్, నన్యా నాయక్, దేవి సింగ్ నరాన్ నాయక్, బాల వీరయ్య, పోశయ్య, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు



మణుగూరు, జనవరి 12 (భారతశక్తి): ఇందిరా గాంధీ మనవరాలు ఏఐసిసి ప్రధాన కార్యదర్శి, వయనాడ్ పార్లమెంట్ సభ్యురాలు ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలను రేణుక అక్షర మహిళ మండలి సభ్యులు ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ లో గల రేణుక చౌదరి క్యాంప్ కార్యాలయంలో రేణుక అక్షర మహిళ మండలి సభ్యులు కేక్ కట్టింగ్ చేసి ఎంపీ ప్రియాంక గాంధీ కి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, రాజకీయాలల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తూ ఎల్లప్పుడూ ప్రజలకు సేవ చేయాలని వారు ఆకాంక్షించారు. నానమ్మ ఇందిరా గాంధీ తెగువా ను గుర్తు చేసుకుని రాజకీయంగా కఠినమైన సవాళ్ళను ఎదుర్కోవాలని ఆమెకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ, మహిళా సీనియర్ నాయకులు ఎండి షబానా, కోరి శ్యామల, దేరంగుల సుజాత, కన్నాపురం వసంత, రెడ్డి బోయిన రేణుక, డాకురి సౌజన్య, బాడిస పార్వతి, సీనియర్ నాయకులు ఎండీ షరీఫ్, సత్యనారాయణ, సోషల్ మీడియా తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 12:




తెలంగాణ యువజన సర్వీసుల శాఖ ఆదేశాలతో కలెక్టర్ అనుమతితో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం కామారెడ్డి పట్టణంలో గల మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్నటువంటి స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ ఈరాలాల్, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ జైపాల్ రెడ్డి, ఆర్ శ్రీనివాస్, పి.టి. ఎస్. జనరల్ సెక్రెటరీ మధుసూదన్ రెడ్డి, నాగరాజు, నరేష్, నవీన్ కుమార్,అనిల్ , సిపిఎస్ అధ్యక్షులు ఎల్లారెడ్డి యువకులు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు మార్గదర్శి వివేకానంద

వివేకానంద అంటే ఒక వెలుగు
స్వామి వివేకానంద ఒక మార్గదర్శి
భరతావనిలో యువతకు మాట వివేకనంద
ఆధ్యాత్మికకు ఆచరణ వివేకానంద !!!
భారతదేశ గొప్పతనాన్ని చాటిన గొప్ప వక్త
భారతదేశ ఖ్యాతి ఎలుగెత్తి చాటిన వివేకనంద
వివేకానంద ఒక అంటే వివేకవంతుడు
భారతదేశానికి ఆణిముత్యం స్వామి వివేకానంద!!!
యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద
ఆయన మాటలే ఒకతుట
తన మాటలు ధైర్యాన్ని నింపుతాయి
భారతదేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన గొప్ప వ్యక్తి!!!
భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు చాటి చెప్పిన వివేకానంద
దేశానికి యువతే పట్టుకొమ్మలు అని చాటి చెప్పిన వివేకానంద
వివేకానంద జన్మదినం జాతీయ యువజన దినోత్సవం!!!



రచన :-
దేవులపల్లి రమేశ్,(కవి ఽరచయిత )
నంగునూర్, సిద్దిపేట జిల్లా
చరవాణి :-9963701294

# వయోవృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది: సీఎం

## - వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను వర్చువల్ గా ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 12:

దేశంలో ఎక్కడా లేనివిధంగా వయోవృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కుటుంబంలా అండగా నిలిచి మానసిక ఉత్సాహాన్ని అందించే లక్ష్యంతో ప్రణామ్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం హైదరాబాద్ నుండి వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసిన వయోవృద్ధుల డే కేర్ సెంటర్లను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లాలో పట్టణంలోని మహిళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మహిళా ప్రాంగణంలోని డే కేర్ సెంటర్ నుండి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, స్థానిక శాసనసభ్యులు చింతా ప్రభాకర్, టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి తో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం డే కేర్ సెంటర్లను ప్రారంభించిందని తెలిపారు. వృద్ధులు మానసికంగా ఉల్లాసంగా, ఆరోగ్యంగా గడపడానికి ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను జిల్లా సంక్షేమ అధికారి,మహిళా,శిశు,

దివ్యాంగుల,వయోవృద్ధుల శాఖ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఈ డే కేర్ సెంటర్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రభుత్వ పని దినాల్లో పనిచేస్తుందని తెలిపారు. వయోవృద్ధుల విజ్ఞానం, వినోదం కోసం లైబ్రరీ, టీవీ సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. మానసిక ఉల్లాసం కోసం క్యారం, చెస్, టేబుల్ టెన్నిస్ వంటి ఇండోర్ గేమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రముఖ వైద్యులచే ఆరోగ్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా డే కేర్ సెంటర్‌లో ప్రతిరోజూ ఉచితంగా టీ, స్నాక్స్ అందించడం జరుగుతుందని వెల్లడించారు. కేంద్రంలో ఇంకా ఏవైనా అవసరాలు ఉంటే వృద్ధులు తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వయోవృద్ధుల కోసం ఇంత మంచి సదుపాయాన్ని కల్పించడం వారి పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని




అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని, తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. జిల్లాలోని వయోవృద్ధులందరూ ఈ డే కేర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా మహిళా సంక్షేమ అధికారి లలిత కుమారి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సెక్రెటరీ వనజా రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, సిడిపిఓ, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యా సంస్థల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి:రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 12 (భారత శక్తి): యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. సోమవారం సాయంత్రం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థల నిర్మాణంపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్ లతో కలిసి సిఎస్ రామకృష్ణారావు హైదరాబాదు నుంచి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.





ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని విద్యార్థులను ప్రపంచ స్థాయిలో పోటీలో ముందు వరుసలో ఉంచేందుకు ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పుతుందని అన్నారు. జిల్లాల వారీగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి సంబంధించి స్థల సేకరణ, నిర్మాణ పనులు, తదితర అంశాలపై జిల్లాల వారీగా కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ఈ నిర్మాణాలపై సమీక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో నిర్మాణ ప్రదేశాలకు వెళ్లి పర్యవేక్షించాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణ పనుల్లో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు.

అంతకుముందు సిఎస్ రామకృష్ణారావు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు తగు ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధులలో పాల్గొనబోయే అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. తగినంత మంది సిబ్బంది అందుబాటులో ఉన్నారో లేరో పరిశీలన చేసుకోవాలని సూచించారు. తగినంత సిబ్బంది, సామగ్రి సమకూర్చుకోవాలని పేర్కొన్నారు. ఎఫ్ఎస్టి, ఎస్ ఎస్ టి బృందాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడగానే ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిడ్డంగా అమలయ్యేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై జిల్లాల వారీగా కలెక్టర్లను పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఫోటో ఎలక్టరోల్స్ జాబితా, డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాలు, తదితర అంశాల వివరాలను సిఎస్ కు జిల్లాల వారీగా కలెక్టర్లు వివరించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్లోని సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. విసి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హోదాలవారీగా ఎన్నికల సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. మున్సిపల్, రెవెన్యూ, తదితర శాఖలన్ని సమన్వయంతో పనిచేసి ఎన్నికల నిర్వహణలో లోటుపాట్లు లేకుండా చూడాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డీఈవో భోజన్న, నిర్మల్, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ స్టాళ్లు చాలా శుచిగా, రుచిగా ఉన్నాయి..!!

కడప, భారత శక్తి ప్రతినిధి, జనవరి 12:



గండికోట ఉత్సవాల్లో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్ల అత్యంత రుచికరంగా, రుచికరంగా నిర్వహించడం జరుగుతోంది. కడపకు చెందిన తిరులమలేష్ మాట్లాడుతూ గండికోట ఉత్సవాల్లో జిల్లా యంత్రాంగం అన్ని వసతులను చాలా చక్కగా ఏర్పాటు చేశారు. అన్ని భద్రతా ఏర్పాట్లను, శానిటేషన్ కార్యక్రమాలను చాలా బాగా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ మెప్మా ఎస్. హెచ్.జి. మహిళలు, ఇతర గ్రామీణ వంట నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లు శుచిగా ఉన్నాయి. అత సరసమైన ధరలకు ఆరోగ్యకరమైన రుచికరమైన వివిధ రకాల వంటకాలను అందిస్తున్నారు. నిన్నటి నుండి చాలా మంది సందర్శకులు వంటకాలను మెచ్చుకుంటున్నారు. వ్యాపారులు కూడా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలుపుతున్నారు.

# గ్రేస్ సర్వీస్ సొసైటీ పేదలకు నిత్యవసరాలు వితరణ

మణుగూరు, జనవరి 12 (భారతశక్తి): మండల పరిధిలోని వాగుమల్లారంలో గల గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పేద వృద్ధులు, వితంతువులు, నిరాశ్రయులు 500 మందికిపైగా నిత్యావసరాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రేస్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు రేవా ఎం. జాకబ్ సేవలు అభినందనీయమని కొనియాడారు. సమాజంలో పేదలు, వితంతువులు, వృద్ధులకు అండగా నిలిచే గ్రేస్ సర్వీస్ సొసైటీ వంటి సంస్థలు నిజమైన సామాజిక బాధ్యతకు ప్రతీకలన్నారు. ప్రతి సంవత్సరం నిరంతర సేవలు అందిస్తూ ఈ ఏడాది సుమారు 500 మంది వితంతువులు, వృద్ధులకు, నిత్యవసర వస్తువులు పంపిణీ చేయడం అత్యంత అభినందనీయమని ప్రశంసించారు. గ్రేస్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు జాకబ్ తో 34 సంవత్సరాల అనుబంధం ఉందన్నారు. నిరంతరాయ సేవలను గుర్తించి మన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా గౌరవప్రదమైన విశిష్ట సేవ అవార్డు నిచ్చి సత్కరించిందని తెలియజేశారు. మీ సేవలు ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా భగవంతుని కోరుకుంటున్నానని తెలియజేశారు.

బిషప్ ఎం జాకబ్ మాట్లాడుతూ గ్రేస్ సర్వీస్ సొసైటీ ద్వారా పేద ప్రజలకి, అనాధ బిడ్డలకి చేయూతనిస్తూ, మంచి నాణ్యమైన



విద్యను అందిస్తూ సమాజ అభివృద్ధిలో మా సంస్థ ఎప్పుడు భాగస్వామిగా ఉంటుందని మీలాంటి నాయకుల యొక్క సహాయ సహకారాలు ఎల్లప్పుడూ సంస్థకు ఉండాలని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా పేద వృద్ధులు, వితంతువులు, నిరాశ్రయులకు దుప్పట్లు, చీరలు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్.ఎల్ ప్రసాద్, మణుగూరు బ్రాంచ్ ఇంచార్జ్ కె మాథ్యూ పుల్లారావు, సిబ్బంది, సర్పంచ్ లు కలబోయిన మాధవరావు, పాల్వంచ రాములు, పూనెం రమేష్, కారం పూజిత, ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, కొమరం మధు కిరణ్, కొరగట్ల లాలయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు శివసైదులు, కూచిపూడి బాబు, రహీం పాషా, సామా శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి సిపిఐ సిద్ధం: సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోద శ్రీరాములు

భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి) జనవరి 12:రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి సిపిఐ పార్టీ సిద్ధంగా ఉందని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గోద శ్రీరాములు తెలిపారు. సోమవారం మాటూరి మల్లయ్య అధ్యక్షతన జరిగిన యాదగిరిగుట్ట మున్సిపల్ శాఖ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోద శ్రీరాములు మాట్లాడుతూ యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలో సిపిఐ పార్టీ అనేక ఉద్యమాలు చేసి సాధించిన ఘనత పార్టీకి ఉందని, గ్రామపంచాయతీ ఏర్పడిన నాటి నుండి నేటి మున్సిపల్ వరకు జరిగిన ఎన్నికలలో ప్రాతినిధ్యం వహిస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించి ప్రజలకు సేవ చేసిన చరిత్ర సిపిఐ పార్టీదని రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలతో కలిసి 5 స్థానాలు పోటీ చేస్తామని పొత్తు లేనట్లయితే 12 వార్డులలో పోటీ చేయడానికి సిపిఐ పార్టీ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరి





రాజయ్య, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, పట్టణ సహాయ కార్యదర్శి పేరబోయిన బంగారు, కార్యవర్గ సభ్యులు మునుకుంట్ల నరసమ్మ, ముక్కెర్ల పెంటయ్య, అనంతుల నరసింహ, పాకలపాటి రాజు, పొన్నబోయిన వెంకటేష్, తుమ్మల ఇస్తారీ, యాదగిరి, మద్దూరు భాగ్యమ్మ, సత్తిబాబు, సాయినాథ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్- తేజస్ నంద్ లాల్ పవార్- ఎస్పి కే నరసింహ

సూర్యాపేట(భారతశక్తి జిల్లా ప్రతినిధి)జనవరి 12:ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యులు,అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని జిల్లా ఎస్పి కే నరసింహ తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా సూర్యాపేట జిల్లాలోని జాతీయ రహదారి 65 మీదుగా ఎక్కువ వాహనాలు ప్రయాణం చేస్తున్నాయని అనుకోని సంఘటనలు ఏమైనా జరిగితే తక్షణమే వైద్య సేవలు అందించేలా అన్ని రకాల వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, తగ్గిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఫార్మసీ స్టోర్ పరిశీలించి అన్ని రకాల మెడిసిన్స్ అందుబాటులో ఉంచుకోవాలని, మెడిసిన్స్ అయిపోకముందే తెప్పించుకోవాలని సూచించారు. ఏరకమైన జబ్బుతో ఇబ్బంది పడుతున్న వారు ఓపి సేవలు తీసుకుంటున్నారని కలెక్టర్ వైద్యులను అడగగా సాధారణ జ్వరం, జలుబు తో ఇబ్బంది పడుతున్న వారు వస్తున్నారని వైద్యులు వివరించారు. హాస్పిటల్ కు వచ్చిన సందర్శకులను వైద్య సేవలు మంచిగా అందిస్తున్నారా?, మందులు ఇస్తున్నారా? అని అడగగా మంచిగా వైద్య సేవలు అందిస్తున్నారని అలాగే మందులు ఇస్తున్నారని కలెక్టర్ కు తెలిపారు. కలెక్టర్ వెంట సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ లు గీత వాణి, వినయ్, వైద్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



# కబ్జాలపై ప్రశ్నిస్తే దాడులా..?

- మితిమీరుతున్న కాంగ్రెస్ నాయకుల అరాచకాలు
- ఏసిపిని కలిసిన బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం, జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్
- దాడి చేసిన కఠినంగా శిక్షించాలని డిమాండ్

భారతశక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి) జనవరి 12: ఆధ్యాత్మిక క్షేత్రమైన యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల కాంగ్రెస్ నాయకులు చేస్తున్న కబ్జాలు, అవినీతిపై బిజెపి పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ నిరంతరం పోరాటాలు చేస్తున్నారు. అదే క్రమంలో ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకుడు గుండ్లపల్లి భరత్ గౌడ్ బాధితుడు భూ తగాదా విషయంలో కర్రె ప్రవీణ్ ను కలవగా ఇరువురు కలిసి భరత్ గౌడ్ పై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది. అదే సమయంలో భరత్ గౌడ్ అనుచరులతో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని వారితో గొడవకు దిగగా పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఆ తరువాత మరికొంత మంది కాంగ్రెస్ నాయకులు కలిసి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న కర్రె ప్రవీణ్ కు చెందిన ఫోటో స్టూడియోపై దాడికి పాల్పడి అక్కడే ఉన్న కర్రె ప్రవీణ్ సోదరుడు కర్రె శ్యామ్ కుమార్ ను రక్తం వచ్చేలా దాడి చేశారు. అనంతరం బిజెపి శ్రేణులు కూడా పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. పోలీసులు సర్ది చెప్పి పంపించేశారు. ఈ ఘటన తెలిసి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ స్థానిక ఏసిపిని కలిసి ఘటన గురించి మాట్లాడి దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతల యొక్క అవినీతి పెరిగిపోయిందని, రౌడీయిజంతో మా యొక్క కార్యకర్తలను భయపెట్టాలని చూస్తే అదే స్థాయిలో మేము కూడా బదులివ్వాల్సి వస్తుందని అన్నారు. కానీ మా కార్యకర్తలు చట్టాన్ని గౌరవించి ఆచితూచి అడిగేస్తున్నారని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ రాజకీయంగా ఎదగడాన్ని ఓర్వలేక స్థానిక ఎమ్మెల్యే అండతో మాజీ కౌన్సిలర్ అయినటువంటి గుండ్లపల్లి భరత్ గౌడ్ బిజెపి నాయకులపై దాడి చేశారని ఇంత జరుగుతున్నా కూడా పోలీసు వ్యవస్థ వారిపై కఠినమైన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు చేస్తున్నటువంటి కబ్జాలు ప్రజలంతా చూస్తున్నారని తప్పును తప్పని చెబితే కూడా ఈ విధంగా దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. ఇకమీదట ఇలాంటి దాడులు జరిగితే పోలీస్ స్టేషన్ కు రావడం ఫిర్యాదు చేయడం ఉండవని ఇదే చివరిసారి అని, ఇక ముందు మా పని మేము చేసి చూపిస్తామని గట్టిగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య, జగన్మోహన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చ శీనివాస్, మండల మాజీ అధ్యక్షులు గుంటుపల్లి సత్యం, ఆకుల చంద్రమౌళి, బందారపు మల్లేష్, మందోజు నరేష్, లెంకలపల్లి శ్రీను, బిఆర్ఎస్ నాయకులు పాపట్ల నరహరి, లింగం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# లేవండి! మేల్కొనండి! గమ్యం చేరే వరకూ విశ్రమించకండి!"

## అని చెప్పిన వివేకానందుడు ప్రపంచానికి ఆదర్శం"

ఓ ధీరహృదయుడా!..పట్టు సడలనివ్వకు!
"చిరుమబ్బు మరుగులో సూర్యుడే దాగిన
కారు చీకట్లలో స్వర్గమే మునిగిన
ఓ ధీర హృదయుడా!సడలనివ్వకు పట్టు
వరియించుగా నిన్ను విజయమే తప్పక..."

అని యువతకు ఉద్బోధన చేసి , ప్రపంచ చరిత్రలో భారత దేశ గొప్పతనాన్ని, హిందూ ధర్మ విశిష్టతను తెలియచేసిన ఉదయభాస్కరుడు స్వామి వివేకానంద.

"నరేను గా ముద్దుగా పిలువబడే "నరేంద్రనాథ్ దత్త" తరువాత కాలంలో విశ్వ విఖ్యాత గాంచిన,సింహసదృశ్యమైన మనో బలానికి ప్రతిరూపమై భారతదేశ యువ జనులందరికి ఆదర్శమై నిలిచిన "స్వామి వివేకానంద" గా పేరుగాంచారు. వీరి జన్మదినమైన "జనవరి 12 వ" తేదీని మనదేశ ప్రజలంతా "జాతీయ యువజన దినోత్సవంగా "జరుపుకుంటారు.1985 వ సంవత్సరం నుండి జాతీయయువజన దినోత్సవం మన దేశంలో ఘనంగా నిర్వహించుకుంటు యువత యొక్క ప్రాధాన్యతను స్వామీజీ ఆనాడే ఎలా చెప్పారో మరో మారుగుర్తు చేసుకుందాం.

కలకత్త నగరంలో విశ్వనాథ్ దత్త ,భువనేశ్వరి దేవి దంపతుల గారాల పుత్రుడుగా జనవరి 12,1863 న జన్మించారు.చిన్న నాటి నుండి దైవభక్తి,ఏకాగ్రత కలిగి ప్రతి ఒక్కరిమన్ననలు పొందారు.ఆటలలో,చదువులలో ఏరంగాల్లో అయినని సులభంగా, ఉత్సాహంగా పాల్గొని అందరిలో ముందుండేవాడు. మహాగురువు రామకృష్ణ పరమహంస వద్ద చేరి వారికి ప్రియశిష్యుడుగా మారి,వేదాంత, యోగా ,తత్వశాస్త్రం లలోని అంశాలను ప్రజలకు విడమరిచి చెపుతూ వారిని మానసికంగా సిద్ధం చేసిన మహనీయుడు స్వామీజీ.

1893 వ సంవత్సరం, సెప్టెంబర్ 11 వ తేదీ సోమవారం రోజు విశ్వమత మహాసభలు ప్రారంభం అయ్యాయి.ఆ సమావేశాల్లో మాట్లాడేటప్పుడు హృదయాంతరాలలో నుంచి వచ్చిన విశ్వమానవ సౌభ్రాతృత్వ భావనతో,"నా అమెరికా దేశ సోదర సోదరీమణులారా..."అని మొదలుపెట్టగానే ఆ విశాల సమావేశములో ఉన్న అందరూ లేచి నిలబడి,కరతాళ ధ్వనుల వర్షం కురిపించారు.అప్పటి నుండి ప్రపంచానికి భారత్ యొక్క గొప్పతనం తెలియ వచ్చింది.

భారతదేశంలో స్వామి వివేకానంద పేరు తెలియని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు. ఆధునిక యుగపు గొప్ప ఆధ్యాత్మిక వేత్తలలో ఆయనొకరు. 1893లో జరిగిన చికాగో సర్వమత సభలలో చేసిన ప్రసంగాలు మరియు తర్వాత నాలుగున్నర సంవత్సరాల పాటు అమెరికా, ఇంగ్లాండులో చేసిన ఉపన్యాసాల ద్వారా ఆయన భారతదేశానికి సంబంధించి అప్పటి వరకూ పాశ్చాత్యులకు ఉన్న భావనను మార్చడంలో చాలా వరకూ విజయం సాధించారు. ఆధ్యాత్మికతకు, సామరస్యానికి, గొప్ప సంస్కృతికి భారతభూమి నిలయమని వారు గ్రహించేలా చేశారు. భారతదేశంపై వారికి గల అభిప్రాయాన్ని మార్చి వారి మనస్సులో భారతదేశాన్ని గొప్పగా భావించేలా చేసి ఉన్నత స్థానాన్ని కల్పించారు.

భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత తన అద్భుతమైన వాగ్ధాటితో, ప్రసంగ పరంపరలతో భారతావని ఉత్కృష్ట సంస్కృతి, వారసత్వ సంపద గురించి ప్రజలకు తెలియజేసి వారిలో చైతన్యాన్ని నింపారు. ఆత్మ విశ్వాసాన్ని ఆశావహ దృక్పథాన్ని పెంపొందించి అణగారిన జనులను ఉద్ధరించాల్సిన తక్షణ అవసరాన్ని తెలియజేశారు. ఆధునిక భారతదేశంలో పేదల అభ్యున్నతికై పాటుపడమని బోధించి వివిధ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ప్రప్రథమ యతివరేణ్యుడు వివేకానంద. రామకృష్ణ మఠం స్థాపించి అందరి అవసరాలకు బాసటగా నిలిచిన గొప్ప వ్యక్తి స్వామీజీ.

అమెరికా మరియు విదేశాల్లో తన ప్రసంగాలద్వారా ఎందరినో ఆకట్టుకొని భారతదేశమునకు తిరిగి వచ్చిన తర్వాత ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ,నా ప్రియాతిప్రియమైన ప్రజలారా....భారతదేశ ముద్దు బిడ్డలారా....అమృత పుత్రులారా... ఋషి బిడ్డలారా... నేడు జరుగుతున్న సన్మానము,మర్యాద, ఏ రాజకీయ నాయకుడికో, ఏ వ్యాపారవేత్తకో, ఏ కళాకారుడికో, ధనవంతుడికో జరుగుతున్నది కాదు. రేపటి రోజు భోజనం ఉంటుందో లేదో తెలియని, భగవంతుడినే హృదయంలో నింపుకుని జీవించే ఒక దేశ దిమ్మరియైన సన్యాసికి జరుగుతున్నది. భారతదేశం యొక్క ఆయువు పట్టు దాని ఆధ్యాత్మికత, భగవన్మయ జీవనంలోనే ఉన్నదని అనడానికి ఇంతకంటే గొప్ప నిదర్శనం మరొకటి ఉండదు.లేవండి! మేల్కొండి! మనుష్యులవ్వండి! మనం బానిసలమనీ, ఎందుకూ పనికిరాని వారమనీ, మన పూర్వీకులు చెప్పినదంతా హాస్యాస్పదమనీ, ఎవడో బయటివాడు వచ్చి చెప్పగానే నిజమేనని నమ్మి వాడి బూట్లు తుడవడం ఎంత హేయం! ఎంత దయనీయం!....

నా భారతదేశ యువ కిశోరాల్లారా, నా ఆశలన్నీ మీ పైనే ఉన్నాయి. మీరు అనంత శక్తి సంపన్నులు.దేన్నైనాసరే సాధించే శక్తి యుక్తులు మీలో ఉన్నాయి. మీరు గొర్రె లని అనుకోవద్దు. సింహాలు మీరు.మీరు లేచి జూలు విదిలించి ఒక్కసారి గాండ్రిస్తే కుయుక్తులతో నక్కలవలె చుట్టు ముట్టిన బలహీనతలన్నీ, దుష్టశక్తులన్నీ మిమ్మల్ని చూసి, మీ సింహ నినాదం విని, గుండెలు జారి పారిపోతాయి. లేవండి! మేల్కోండి! గమ్యం చేరేవరకూ విశ్రమించకండి! అని పిలుపునిచ్చారు.

"అపార విశ్వాసం, అనంత శక్తి ఇవే విజయసాధనకు మార్గాలని,సేవకుడిగా ఉండడం నేర్చుకుంటే ,నాయకుడయ్యే యోగ్యత" లభిస్తుందని ఆనాడే స్వామి వివేకానంద గారు వలు మార్లు చెప్పారు. అఖండమైన ఉత్సాహం,అపరిమితమైన ధైర్యం,అప్రతిహతమైన శక్తి,అన్నింటిని మించి పరిపూర్ణమైధేయత,ఈ లక్షణాలు ఒక వ్యక్తిలోగాని,ఒకదేశాన్ని గాని పునరుజ్జీవింప చేయగలవని ఎన్నో మార్లు తెలియచేసిన యువసన్యాసి,యోగిపుంగవుడు స్వామి వివేకానంద.

లక్ష్యంపై ఉన్నంత శ్రద్ధాశక్తులను, లక్ష్య సాధనలో సైతం చూపించడమే విజయరహస్యం అని,మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆలోచన్ని స్వీకరించండి.బలహీన పరిచే ప్రతి ఆలోచనను తిరస్కరించండని ఎన్నోమార్లు యువతకు చెప్పుకొచ్చిన యువ నేత స్వామి వివేకానంద.మీరెలా ఆలోచిస్తే అలాగే తయారవుతారని, బలహీనులమని భావిస్తే , బలహీనులే అవుతారని,శక్తిని స్మరిస్తే శక్తిమంతులు అవుతారని యువతకు సందేశమిచ్చిన హిందు కర్మయోగి స్వామి వివేకానంద.సమస్త శక్తి మీలోనే ఉంది. అసమర్థులమని భావించకండి.మీరు ఏమైనా చేయగలరు,అన్నింటిని సాధించ గలరని ప్రతి రంగంలో ముందు ఉండాల్సింది యువతేనని ప్రోత్సహిస్తూ వారిని కార్యోన్ముఖులను చేసాడు స్వామి వివేకానంద.

"లేచి నిలబడు, ధైర్యం వహించు,బలవంతుడివికా, భాధ్యతనంతా నీ భుజాలపైనే వేసుకొని,నీ విధికి నీవే కర్తవని తెలుసుకో.నీకు కావాల్సిన బలం,సహాయం అంతా నీలోనే ఉంది.అందుకే నీ భవితవ్యాన్ని నీవే నిర్మించుకో" అని యువత శక్తి సామర్థ్యాలను గుర్తించేశాడు స్వామి వివేకానంద.బలమే జీవనం,బలహీనతే మరణం.బలం సంక్షేమాన్ని,అంతులేని జీవితాన్ని,అమరత్వాన్ని ప్రసాదిస్తుందని,బలహీనత అంతులేని శ్రమను,దుఃఖాన్ని కలిగిస్తుందని అదే బలహీనత మరణమని ఎన్నో మార్లు తన ప్రసంగాల్లో తెలియ చేసిన యోగిపుంగవుడు స్వామి వివేకానంద. మొదట మన లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలి. తర్వాత దాన్ని ఆచరణలో పెట్టే మార్గాలను అన్వేషించాలని యువకులకు ఉద్భోద చేసిన గొప్ప వక్త స్వామి వివేకానంద.

దృఢ సంకల్పం, పవిత్ర ఆశయం తప్పక సత్ఫలితాలను ఇస్తాయని,వీటిని ఆయుధాలుగా గ్రహించిన వారు కొద్దిమందే అయినా, అన్ని విఘ్నాలను ఎదుర్కొని నిలువగలిగారని ఎల్ల వేళలా నిలువ గలుగుతారని తెలియచేసిన విద్యావేత్త స్వామి వివేకానంద.ఆధునిక యువతరానికి స్వామీజీ మాత్రమే ఆదర్శం.ఆయన జీవిత కాలం ముప్పై తొమ్మిది సంవత్సరాల ఆరునెలలు. ఇంతటి స్వల్ప జీవితంలోనే ఆయన ఎంతో సాధించారు. మానవాళి సంక్షేమానికి, అభ్యున్నతికి, ఆధ్యాత్మికోన్నతికి తన యౌవన జీవితంతోనే ఇంతగా కృషిచేసినవారు చరిత్రలో కొద్దిమంది మాత్రమే ఉన్నారు.అందులో ప్రథముడు స్వామి వివేకానంద.

భారత మాత దాస్యశృంఖలాలు తెంచడానికి మా దేశపౌరులు సిద్ధంగా ఉన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశవిదృత కోసమే తన తపన అని ఎన్నోమార్లు తెలియ చేసిన గొప్ప వక్త మన స్వామీజీ.స్వామీజీ తన జీవితాంతం ఎంతో శ్రమపడి కష్టపడి పని చేశారు. తుదకు స్వామీజీ భౌతిక జీవితం ముగిసింది. కానీ ఆయన పని కొనసాగుతూనే ఉంది. "లేవండి! మేల్కోండి! గమ్యం చేరే వరకు విశ్రమించకండి!" అని తన దేశ ప్రజలకి పిలుపునిచ్చారు. ఆయన ప్రసంగాలలో ఉన్న జ్ఞానాన్ని ,ఇచ్చిన ధైర్యాన్ని ఉపయోగించుకొని మొదలైన నవ భారత నిర్మాణం, దేశానికి స్వాతంత్ర్యం రావడంతోనే కాక ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

ఎందరికో జ్ఞానోదయం కలిగించి ,ఆధ్యాత్మిక ప్రపంచాన్ని పరిచయం చేసి,భారత దేశం అంటే ఒక సంస్కృతి కలిగిన గొప్పదేశం అని విశ్వానికి తెలియ చేసి జులై 4, 1902 న విశ్వాంతరాల్లోకి వెళ్లిన దివ్యజ్ఞాని స్వామీజీ."నేను నా శరీరాన్ని వదిలిపెట్టినా,నేను పూర్తిచేయవలసిన కార్యాలను పూర్తి చేసే విదంగా రాబోవు తరాల వారిని కార్యనిర్వహణ కొరకు ప్రేరేపిస్తుంటాను." అని చాలా సందర్భాల్లో ఆశాభావం వ్యక్తం చేసిన మాటలనిజం చేసి ,దేశఅభివృద్ధికి బాటలు వేయుటకు యువత నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



గడప రఘుపతిరావు
రాష్ట్ర ఉత్తమఉపాధ్యాయఅవార్డు గ్రహీత.
9963499282

## వివేకానందుని మాటలు యువతకు స్ఫూర్తిదాయకం

-స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్- తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి) జనవరి 12:

భారతీయ సంస్కృతిని, ఆధ్యాత్మికతను ప్రపంచ నలుమూలల చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కొనియాడారు.

సూర్యాపేట పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో జిల్లా యువజన సర్వీసులు ఉ క్రీడా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొని వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ"లేవండి, మేల్కొనండి, గమ్యం చేరే వరకు విశ్రమించకండి" అన్న వివేకానందుని పిలుపు నేటి తరం యువతకు దిక్సూచి అని కొనియాడారు. విదేశాల్లో సైతం భారత దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పిన ఆయన ధైర్యం, ఆత్మవిశ్వాసం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.తక్కువ వయస్సు లోనే ఎక్కువ విజయాలు సాధించి ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన స్వామి వివేకానంద ఆలోచనలకు అనుగుణంగా యువ చూపిన మార్గాలలో నడుస్తూ యువత చదువు, క్రీడలు, ఐ టి, సైన్స్ ఉ టెక్నాలజీ,



ఏ ఐ లాంటి ఆసక్తి ఉన్న రంగాలలో వినూత్నంగా ఆలోచించి దృఢ సంకల్పం తో ముందుకు వెళ్తు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.నీది, నాది అని కాకుండా సమాజం గురించి ఆలోచించి సమస్యలను పరిష్కరించే ప్రతి ఒక్కరూ స్వామి వివేకానంద స్ఫూర్తి గా తీసుకున్న వారందరు యువతే అని అన్నారు.భారత దేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కల్గిన దేశం అని, ఆర్థిక వ్యవస్థ లో 4వ స్థానంకు చేరుకుందని నైపుణ్యాలను పెంపొందించుకుంటూ సామర్థ్యలను పెంచుకొని, మంచి ఆలోచనలతో ముందుకు వెళ్లే సమాజంలో గుర్తింపు దక్కుటంతో పాటు మన ఊరు, మండలం, జిల్లా, రాష్ట్రము, దేశం లను అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు.జిల్లా ఎస్పీ కె నరసింహ మాట్లాడుతూ స్వామి వివేకానంద జన్మ దినోత్సవంను జాతీయ యువజన దినోత్సవ గా జరపటం సంతోషమని, అతి చిన్న వయసులోనే భారతదేశ ఔన్నత్యాన్ని విదేశాలకు తెలియజేసిన మహోన్నతమైన వ్యక్తి అని, భారతదేశంలో 60 శాతం నికి పైగా యువతే ఉన్నారని,యువత భారతదేశానికి గొప్ప వనరులు అని వారిని ఉన్నతంగా తీర్చిదిద్దితే భారతదేశం ప్రపంచ దేశాల్లో మొదటి స్థానానికి చేరుకుంటుందని అన్నారు.యువత మత్తు కోసం మాదకద్రవ్యాల వైపు ,ఈజీ మనీ కోసం సైబర్ క్రైమ్ వైపు వెళ్లకుండా యువత స్వామి వివేకానంద ను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, నేర రహిత సూర్యాపేట గా తీర్చిదిద్దేందుకు యువత అందరూ కలిసి రావాలని కోరారు.అనంతరం స్వామి వివేకానంద దినోత్సవం సందర్బంగా కళాశాలలో నిర్వహించిన వ్యాస రచన,వక్తృత్వం, క్విజ్ పోటీలలో ప్రతిభ చూపెట్టిన వారికి కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి వై ఎస్ ఓ వెంకట్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య,మాజీ మున్సిపల్ చైర్మన్ గుజ్జకొండ సత్యనారాయణ, అన్నపూర్ణ, వివేకానంద ఉత్సవ కమిటీ చైర్మన్ నాగార్జున, కార్యదర్శి ప్రభాకర్, సభ్యులు, పుర ప్రముఖులు, యువత,తదితరులు పాల్గొన్నారు.

# నవ నైపుణ్యాలతో యువతకు ఉపాధి

## "భారత దేశ భవిష్యత్తును మార్చ గలిగేది యువత"... స్వామి వివేకానంద

యువత దేశ భవిత, దేశ పురోగతి యువత పై ఆధారపడి ఉంటుంది. యువ శక్తిని మించిన శక్తి ఈ భూమండలం మీద ఏదీ లేదనేది వాస్తవం. దేశాభివృద్ధి పురోగతిలో యువత కీలక పాత్ర పోషిస్తుంది.

యువత దేశం యొక్క కలిమి 'బలిమి.దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న యువతలో నైపుణ్యాలు కొరవడి కోటి ఆశలతో ఉపాధి వేటకు సిద్ధమవుతున్న యువ శక్తి తీవ్ర భంగ పాటుకు గురై నిరాశ నిస్పృహల్లో కూరుకు పోతున్నారని' ఉపాధి రహిత వృద్ధిని.ఆక్షేపిస్తూ ఐ ఎల్ 'ఓ తన తాజా నివేదికలో వెల్లడించడం గమనార్హం. దేశంలో యువశక్తి ఉపాది వేటలో అలసి పోయి ఆందోళన పథంలో వయ నిస్సా తమ శక్తిని సద్వినియోగం చేసుకోలేక నిర్లక్ష్యానికి గురౌతున్నారు.

పెరిగిన నిరుద్యోగిత.

7 దశబ్దాల ప్రణాళిక ప్రగతి(78సం"రాల స్వాతంత్ర్య భారత్ లో) ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన ప్రగతి సాధించి ప్రపంచంలో 5వ' అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించి నప్పటికి దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగాన్ని నిర్మూలించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది.

నిరుద్యో

పారిశ్రామిక విధానముబి నిరుద్యోగం.

దేశంలో అమలైన పారిశ్రామిక విధానం' 'పెట్టుబడి విధానం' ఆర్థిక విధానం' ఉపాధి రహిత అభివృద్ధినిపెంచింది .నిరుద్యోగిత పెరిగింది .దేశంలో 2000 సంవత్సరంలో యువతలో 5.7 శాతం వున్న నిరుద్యోగిత 2022 నాటికి 12'1శాతానికి పెరిగింది. 83 శాతం యువత నిరుద్యోగ 'శ్రామిక శ్రేణిలో వుండడం శోచనీయం.

దక్షిణాది రాష్ట్రాల్లో తగ్గనున్న యువ జనాభా.

మరో వైపు దేశంలోనిదక్షిణాది రాష్ట్రాల్లో రానున్న రోజుల్లో జనాభాలో యువత శాతం తగ్గుతుందని తాజా అంతర్జాతీయ నివేదిక తెలిపింది. విద్యావంతులు చదువుకున్న యువతతో మెరుగైన ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్న దక్షిణాది రాష్ట్రాల్లో భవిష్యత్తులో శ్రామిక మార్కెట్లో 'డిమాండ్ పెరిగే సూచనలున్నాయి.మార్కెట్లో డిమాండుకుఅనుకూలంగా యువకార్మిక బలం అందుబాటులో ఉండదని ప్రపంచ కార్మిక సమాఖ్య 'ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్మెంట్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో' భారత ఉపాధి నివేదిక2024 "లో తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.

తెలంగాణ బినిరుద్యోగం

నీళ్ళు 'నిధులు 'నియామకాలే ధ్యేయంగా ఏర్పడిన తెలంగాణలో ప్రభుత్వం నియామకాలను నిర్లక్ష్యం చేయడం వల్ల నిరుద్యోగిత పెరిగింది.

తెలంగాణలో 15-29య

ఏళ్ల వయసులో వున్న చదువుకున్న యువత77.7 శాతం ఉన్నపటికీ వారికి సరిపడే ఉద్యోగాలు లేవు. చాలా మంది యువత ఉపాధికి దూరంగా ఉన్నట్టు నివేదిక తెలిపింది. తెలంగాణలో 15-29 ఏళ్ల వయసులో 30 శాతం' యువతులు 18 శాతం' యువకులు నిరుద్యోగంలో మగ్గిపోతున్నట్లు వెల్లడించింది.

పెరిగిన నిరుద్యోగిత రేటు.

రాష్ట్రంలోని యువతలో నిరుద్యోగి రేటు 14.19 శాతం నుండి21.71 శాతానికి పెరిగింది. మహిళా కార్మిక బలం వాటా తక్కువగా ఉన్నట్లు అంచనా వేశారు.

యువకుల్లో నిరుద్యోగి రేటు 12.96 శాతం నుండి18.34 శాతానికి చేరితే యువతుల్లో ఏకంగా 17.65 శాతం నుండి 30.35 శాతానికి పెరిగిందని అని నివేదిక తెలిపింది.

లితెలంగాణలో తగనున్న యువ జనాభా 2039' నాటికి తెలంగాణలో15-29 నం" రాల వయసు ఉన్న జనాభా తగ్గనున్నది. దక్షిణ భారత దేశంలోని రాష్ట్రాల్లో తగ్గదలఎక్కువ వుంటుంది.తమిళనాడు' కేరళ' ఆంధ్రప్రదేశ్ కర్ణాటక రాష్ట్రాల్లో యువ జనాభాలో స్వల్ప తగ్గదల నమోదైంది. భవిష్యత్తులో వృద్ధుల జనాభా పెరుగనున్నది. ఉత్తర భారత దేశంలో కూడా యువ జనాభా తగ్గుముఖం పట్టే పరిస్థితిలో వుందని అధ్యయనంలో తేలింది.

తెలంగాణలో యువ జనాభా.

2021 రాష్ట్ర జనాభాలో వాటా 26.4 దేశ జనాభాలో వాటా2.7 శాతం 2030 నాటికి రాష్ట్ర జనాభాలో వాటా21.7 శాతం దేశ జనాభాలో వాటా2.4 శాతంఅబట్రీ' 2036 నాటికి రాష్ట్ర జనాభాలో వాటా 20.2 శాతం

దేశ జనాభాలో వాటా2.3 శాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని అంచనాలు తెలుపుతున్నాయి.

పురుషుల ఉపాధి లో మెరుగు.

2005లో పురుషుల ఉపాధి కల్పనలో 11 వ' స్థానంలో వున్న తెలంగాణ 2022 నాటికి 2 వ' స్థానానికి చేరింది.మహిళా ఉపాధి సూచిలో 4 వ' స్థానం నుండి 7 వ 'స్థానానికి పడిపోయింది.

ఉపాధి 'విద్య' శిక్షణకు దూరంగా ఉంటున్న యువత సంఖ్య పెరుగుతుంది.2005 లో 17.9 శాతం వుంటే ప్రస్తుతం27.54 శాతానికి పెరిగింది.

నైపుణ్యాలు తక్కువ.

యువతలో కంప్యూటర్ నైపుణ్యాలు తక్కువ ఉన్నాయి. బేసిక్ కాన్సెప్ట్ మీద అవగాహన లేదు.పనిచేస్తూ చదువుకోవడం కోర్స్ పూర్తి అయ్యే నాటికి నూతన నైపుణ్యాలను ఒంటపట్టించుకొని ఉద్యోగ అర్హత సంపాదించడం అభివృద్ధి చెందిన దేశాలలో సహజం .భారత దేశంలో సొంత కాళ్ళ మీద నిలబెట్టే నైపుణ్యాలు మన దేశ విద్యార్థులకు అబ్బడం లేదు. ఏటా కోటి,20' లక్షల మంది పట్టభద్రులు ఉత్పత్తి అవుతున్నారు. ఇందులో మూడో వంతు మందికే ఉద్యోగ అర్హతలు వుంటున్నాయని నివేదిక తెలిపింది.

రంగాల వారిగా అవసరాలు ప్రణాళికలు ఉపాధి అవకాశాలు మదింపు.

దేశంలో రాబోయే 30 సంవత్సరాల్లో రంగాల వారీగా దేశ అవసరాలను ప్రణాళికలు రూపొందించి 'ఉపాధి అవకాశాలను మదింపు చేసి అందుకు తగ్గట్టు చదువులను ' వృత్తి విద్యలను ' ఉపాధి దోహక కోర్స్ లను సంస్కరించాలి.

స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాల ఏర్పాటు.

కృత్రిమ మేధ రోబోటిక్స్ 'వర్చువల్ 'డేటా సైన్స్ సాంకేతిక కోర్సులకు పటిష్టమైన పునాది వేయాలి. మార్కెట్ అవసరాలకు అనుకూలంగా పాఠ్య ప్రణాళిక రూపొందించాలి. ప్రకృతి 'పర్యావరణ రక్షణ' వ్యవసాయం 'వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి పరచాలి. ప్రకృతి సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను విస్తరించాలి.

గ్రామీణ చేతి వృత్తుల ఆధునీకీకరణ అభివృద్ధి.

గ్రామీణ చేతి వృత్తులు ఆధునీకీకరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలి.నూతన పాఠ్యాంశాలు ప్రవేశ పెట్టాలి. విద్యా సంస్థల్లో స్కిల్ డెవలప్మెంట్ విభాగాలను ఏర్పాటు చేయాలి. విద్యార్థుల. ఆసక్తిని గుర్తించి వారికి ఇష్టమున్న కోర్సు అభ్యసించే విధంగా పాఠ్య ప్రణాళిక రూపొందించాలి. బోధన అధ్యయన అభ్యసన పరిశోధన ప్రక్రియలను బలోపేతం చేయాలి. విశ్వవిద్యాలయాల్లో బోధనా సిబ్బంది కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలి.మానవ వనరుల అభివృద్ధి కి దోహదపడే విద్య' 'వైద్య రంగాలకు 'మౌలిక సదుపాయాల కల్పన కు ప్రభుత్వం పెట్టుబడులు పెంచాలి. యువతలో నవ నైపుణ్యాలు పెంచుకొని ప్రపంచంలో ఎక్కడైనా ఉపాధి అవకాశాలను ఒడిసి పట్టే విద్యా ప్రణాళికలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చే శాసనసభ సమావేశాల్లో తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ బిల్లును ప్రవేశపెట్టడం హర్షించదగ్గ అంశం.

నేదునూరి కనకయ్యఅధ్యక్షులు
తెలంగాణ ఎకనమిక్ ఫోరమ్ కరీంనగర్
9440245771

## ములుగులో వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ఏర్పాటు

ములుగు జిల్లా ప్రతినిధి, జనవరి 12 (భారత శక్తి) : ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనం లో వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వయోవృద్ధుల కొరకు ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ల ను ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం వర్చువల్ గా ప్రారంభించారు. ములుగు జిల్లా సంక్షేమ భవనంలో ఏర్పాటుచేసిన సెంటర్ ను జిల్లా సంక్షేమ శాఖ అధికారి తుల రవి, రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ ములుగు జిల్లా నుండి వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, ట్రెజరర్ ఎస్ సతీష్, కార్యదర్శి చుంచు రమేష్, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు రామ్మూర్తి ఉపాధ్యక్షులు ఐలయ్య లు ఈ కార్యక్రమంలో ఉన్నారు. డే కేర్ సెంటర్ ని దివ్యాంగులు వయోవృద్ధులు, ట్రాన్జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. డే కేర్ సెంటర్ వయోవృద్ధుల ఉల్లాసం కొరకు,క్రీడా కార్యక్రమాలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రభుత్వ సెలవులు మినహా అన్నివేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ



కార్యక్రమం దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఇన్చార్జ్ నాగేంద్ర సీనియర్ సహాయకులు ఎఫ్ఆర్ఓ గణేష్, వయోవృద్ధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సినిమా

## ఎన్టీఆర్ డైలాగ్.. బాలయ్య చప్పట్లు

నందమూరి కుటుంబం అనగానే తెలుగు ప్రేక్షకులకు ముందుగా గుర్తొచ్చే పేరు సీనియర్ ఎన్టీఆర్. ఆయన తర్వాత బాలకృష్ణ. ఇక ఆ కుటుంబం నుంచి ఎంతోమంది హీరోలుగా వచ్చినా బాలయ్య తర్వాత అంతటి స్థాయిలో గుర్తింపు సంపాదించుకున్న నటుడు జూనియర్ ఎన్టీఆర్ మాత్రమేనని అభిమానులు భావిస్తారు. అందుకే బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ ఇద్దరూ కలిసి కనిపిస్తే చూడాలని ఎదురు చూస్తుంటారు. వారిని సంతోషపెట్టే వీడియో ఒకటి ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. కొన్నేళ్ల క్రితం సినీ ఇండస్ట్రీకి సంబంధించిన ఓ గ్రాండ్ ఈవెంట్ జరగ్గా.. ఆ కార్యక్రమానికి బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ సహా అనేక మంది ప్రముఖులు హాజరయ్యారు. ఆ సమయంలో జూనియర్ ఎన్టీఆర్ తన బ్లాక్ బస్టర్ సినిమా యమదొంగలోని యముడి గెటప్ తో స్టేజ్ పైకి వచ్చి తన ట్రేడ్ మార్క్ 'ఏమంటివి ఏమంటివి..' డైలాగ్ చెప్పడంతో హాల్ మొత్తం చప్పట్లు, ఈలలతో మార్మోగిపోయింది. ఆ సమయంలో బాలకృష్ణ, ఎన్టీఆర్ ప్రదర్శనను ఎంతో ఎంజాయ్ చేసినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. తారక్ డైలాగ్ చెబుతున్నంతసేపు బాలయ్య చిరునవ్వుతో చూస్తూ, చివర్లో చప్పట్లు కొడుతూ ఆయనను ప్రోత్సహించాడు. ప్రస్తుతం వైరల్‌గా మారిన ఈ వీడియోను ఫ్యాన్స్ సోషల్ మీడియాలో ఫుల్ గా ట్రెండ్ చేస్తున్నారు.




## పర్పుల్ శారీలో..



కన్నడ బ్యూటీ శ్రీ లీల గురించి పరిచయం ప్రత్యేకంగా అవసరం లేదు. తన అద్భుతమైన నటన, అందంతో అలరిస్తూ భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. ఆమె కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికీ3 చిత్రంలో నటిస్తోంది. తమిళ్ లో తొలిసారి శివ కార్తికేయన్ సరసన నటించిన పరాశక్తి ఈ నెల 10న రిలీజైంది. దీని తెలుగు డబ్బింగ్ వెర్షన్ విడుదల కావాల్సి ఉంది. తమ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మొన్నటి వరకు పలు ఈవెంట్లలో పాల్గొంటూ సందడి చేసిన ఈ భామ.. తాజాగా మరో కొన్ని ఫోటోలను ఇన్ స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. ఆ ఫోటోలలో బీచ్ సైడ్ కోమలమైన మోముతో ప్రశాంత వాతావరణంలో ఆనందంగా విహరిస్తోంది. పర్పుల్ కలర్ శారీ అందుకు కాంబినేషన్లో పర్ఫెక్ట్ బ్లౌజ్ ధరించి తన అద్భుతమైన స్మైల్ తో ఆకట్టుకుంటుంది. చాలా రోజుల తర్వాత ఇలాంటి ఫోటోలు షేర్ చేయడంతో అభిమానులు ఆమె అందానికి ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

## థ్రిల్లింగ్ యాక్షన్




యంగ్‌హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ'స్వయంభు'. ఇప్పటికే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. భరత్ కృష్ణమాచారి తెరకెక్కిస్తున్న ఈ మూవీలో సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఠాగూర్ మధు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. . కాగా ఈ చిత్రం ఫిబ్రవరి 13, 2026న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. అయితే తాజాగా ఈ మూవీ గురించి ఇంట్రెస్టింగ్ న్యూస్ వైరల్ అవుతుంది. పూర్తి పీరియాడికల్ మైథలాజికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఇంటర్వల్ సీక్వెన్స్ హైలైట్ కాబోతోందట. ఈ సీన్‌లో నిఖిల్ ఇతర ప్రధాన పాత్రల మధ్య వచ్చే యాక్షన్ విజువల్స్ చాలా వైల్డ్ గా ఉంటాయని సమాచారం. ముఖ్యంగా నిఖిల్ గెటప్, యుద్ధ సన్నివేశాల సెటప్ ప్రేక్షకులను థ్రిల్ కి గురిచేస్తాయని ఇన్సైడ్ టాక్. 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ మ్యూజిక్, సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ ఈ సీన్స్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్లనున్నాయట. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేయగా, ఈ లేటెస్ట్ యాక్షన్ అప్‌డేట్ నిఖిల్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది.



## ఆ సినిమా వెంకటేష్‌కైతే బాగుండేదన్న చిరంజీవి



హీరో ఇమేజ్‌ను బట్టి సినిమా కథ, యాక్షన్, భావోద్వేగాలు ఉండాలి. అలా లేనప్పుడు ఎంత పెద్ద హీరో సినిమా అయినా సరే ప్రేక్షకులు అక్కున చేర్చుకోరు. తన సినిమా కథల విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు అగ్ర కథానాయకుడు చిరంజీవి . కొన్నిసార్లు ఫలితం వేరేలా ఉన్నా, ఎక్కువశాతం అభిమానులను అలరించేందుకే ప్రయత్నిస్తారు. కొన్ని కథలు తనకన్నా తోటి హీరోలకు బాగుంటుందని సలహాలు కూడా ఇస్తారు. అలాంటి చిత్రాల్లో 'డాడీ' ఒకటి. సురేశ్‌కృష్ణ దర్శకత్వంలో 2001లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పర్వాలేదనిపించింది. అయితే, చిరంజీవి మార్కు సూపర్‌హిట్‌ను మాత్రం సొంతం చేసుకోలేకపోయింది. ఈ సినిమా కథ చెప్పగానే మరొక ఆలోచన లేకుండా వెంకటేష్ కైతే బాగుంటుందని చిరంజీవి సలహా ఇచ్చారట. ఆనాటి సంగతులను ఓ సందర్భంలో చిరు పంచుకున్నారిలా..! ''డాడీ' కథను నాకు వినిపించారు. వినగానే ఇది నాకంటే వెంకటేష్‌కు బాగుంటుందనిపించింది. ఈ కథకు తను న్యాయం చేయగలడనుకున్నా. రచయిత భూపతి రాజాకు ఇదే విషయం చెప్పా. 'ఇది ఆయనకు మామూలుగా ఉంటుంది. మీకైతే ఫ్యామిలీమ్యాన్‌గా కాస్త వెరైటీగా ఉంటుంది' అని భూపతిరాజా నన్ను ఒప్పించే ప్రయత్నం చేశారు. అయినా నేను కాస్త తటపటాయించా. ఈ కథ విన్న వారందరూ 'చిన్న పిల్లతో ఈ సినిమా మీకు బాగుంటుంది' అని సలహా ఇచ్చారు. చివరకు నేను కూడా బలవంతంగా ఒప్పుకొన్నా. రిజల్ట్ కూడా అలాగే ఉంది. కథ విన్నప్పుడు ఏమనుకున్నానో అదే జరిగింది. సినిమా విడుదలైన తర్వాత వెంకటేష్ నాకు ఫోన్ చేసి 'భలే సినిమా అండీ. నా మీద అయితే ఇంకా బాగా ఆడేదండీ' అనేశాడు. 'నీకైతే బాగుండేదని నేను చెప్పాను వెంకటేష్. కానీ వినలేదు' అని అన్నాను. అలాంటి కొన్ని ఫెయిల్యూర్స్ నా సినీ జీవితంలో ఉన్నాయి'' అని చిరంజీవి చెప్పుకొన్నారు.



## రిమోట్ కంట్రోల్ మా ఆయనదే

**: ప్రియాంకా చోప్రా**

అంతర్జాతీయ వేదికపై ప్రియాంక అందరి దృష్టిని ఆకర్షించారు. గోల్డెన్ గ్లోబ్స్ అవార్డుల వేడుకకు ఆమె వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ వేడుక ప్రారంభానికి ముందు తన భర్త నిక్ జొనాస్‌తో కలిసి రెడ్ కార్పెట్‌పై ఫొటోలకు పోజులిచ్చారు. ఇక వేదికపై ఒక ఆసక్తికర ప్రశ్నకు ఆమె సరదాగా బదులిచ్చారు. ఇంట్లో రిమోట్ ఎవరి చేతిలో ఉంటుందని అడగ్గా.. నిక్ చేతిలోనే ఉంటుందని చెప్పారు. ''గతేడాది మాకు చాలా గొప్పగా గడిచింది. టీవీలో ఏం చూడాలి అనే విషయంలో మా ఇంట్లో ఒకరితో ఒకరం గొడవపడం. ఎవరికి నచ్చింది వాళ్లు చూస్తాం'' అని నిక్ తెలిపారు. దీనికి ప్రియాంక స్పందిస్తూ.. 'నిక్‌కు నచ్చిన సినిమానే చూడమని చెబుతాను. నేను నా ఐప్యాడ్‌లో చూస్తాను' అని చెప్పారు. 2018లో పెళ్లి చేసుకున్న ప్రియాంక నిక్ జొనాస్‌లు 2022లో తల్లిదండ్రులయ్యారు. వారి కుమార్తెకు మాల్తీ మారీ చోప్రా జోనాస్ అనే పేరు పెట్టిన విషయం తెలిసిందే. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రియాంక వరుస ప్రాజెక్టులతో అలరిస్తున్నారు. ప్రస్తుతం రాజమౌళి మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న 'వారణాసి'లో నటిస్తున్నారు. ఇందులో ఆమె మందాకిని పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల జరిగిన ఈ సినిమా ఈవెంట్‌లోనూ ఆమె తళుక్కున మెరిశారు. దీంతో పాటు 'ది బ్లఫ్'లోనూ నటిస్తున్నారు. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా ఫిబ్రవరి 25 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది.

## గోల్డెన్ గ్లోబ్స్ 2026.. 'అడాల్ సెన్స్'కు అవార్డు

ఇప్పటికే పలు అవార్డులు సొంతం చేసుకున్న 'అడాల్‌సెన్స్' మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది.




'గోల్డెన్ గ్లోబ్స్ 2026' అవార్డుల్లో ఉత్తమ నటుడు, సహాయనటుడి జాబితాల్లో అవార్డును తన ఖాతాలో వేసుకుంది. ఈ సిరీస్‌లో తన నటనతో మెప్పించిన ఓవెన్ కూపర్ ఉత్తమ సహాయనటుడిగా అతి చిన్న వయసులోనే ఈ అవార్డును సొంతం చేసుకొని రికార్డు సృష్టించాడు. అలాగే ఉత్తమ నటుడి కేటగిరీలో స్టీఫెన్ గ్రాహం అవార్డు అందుకున్నారు. వేదిక పైకి వచ్చిన ఓవెన్ కూపర్ ఆనందం వ్యక్తంచేశాడు. తనను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపాడు. తన చుట్టూ ఉన్న గొప్ప నటీనటుల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు చెప్పాడు. ఇక ఈ అవార్డు వేడుకలకు నిక్కీ గ్లేజర్‌తో పాటు ప్రియాంక చోప్రా కూడా వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

**విజేతలు వీరే..**

>> ఉత్తమ నటుడు (టీవీ సిరీస్) : స్టీఫెన్ గ్రాహం (అడాల్‌సెన్స్)
>> ఉత్తమ నటి : రోజీ బేర్నీ (ఇఫ్ ఐ హేడ్ లెగ్స్ ఐడిడ్ కిక్ యూ)
>> ఉత్తమ స్క్రీన్‌ప్లే: పాల్ థామస్ (వన్ బ్యాటిల్ ఆనథర్)
>> ఉత్తమ సహాయనటుడు (టీవీ సిరీస్): ఓవెన్ కూపర్ (అడాల్‌సెన్స్)
>> ఉత్తమ సహాయ నటుడు (సినిమా): స్టెలన్ (సెంటిమెంట్ వాల్యూ)
>> ఉత్తమ సహాయ నటి (సినిమా): టెయానా టేలర్ (వన్ బ్యాటిల్ ఆనథర్)

## రేటింగ్స్ నిలిపివేతతో ఉపశమనం

**: విజయ్ దేవరకొండ**

న్యాయస్థానం ఆదేశాల మేరకు 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాకి ఆన్‌లైన్ టికెటింగ్ వేదిక బుక్ మై షో తన వెబ్‌సైట్‌లో సమీక్షల్ని, రేటింగ్స్‌ని నిలిపివేయడంపై యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ స్పందించారు. ఈ చర్యతో ఎంతోమంది కష్టాన్ని, కలల్ని, డబ్బుని కాపాడుకునేందుకు దారి చూపించినట్లయిందని తన అభిప్రాయాన్ని ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఈ వేదికల్లో ఇదివరకు ఉన్న సమీక్షలు రాసే వెసులుబాటుని ఉపయోగించుకుంటూ, కొంతమంది పనిగట్టుకుని సినిమాలకి వ్యతిరేక సమీక్షలు, రేటింగ్స్ ఇస్తూ వాటిని సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్ చేస్తుండడంపై సినీ పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 'మన శంకరవరప్రసాద్‌గారు' బృందం ఇటీవల న్యాయస్థానాన్ని ఆశ్రయించి సమీక్షల్ని నిలిపివేయాలని కోరడంతో, అనుకూలంగా తీర్పు వచ్చింది.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు విడుదల

హైదరాబాద్, జనవరి 12 (భారతశక్తి): ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇంటి నిర్మాణ పనులు చేపట్టిన తరువాత వివిధ కారణాల వల్ల బిల్లులు ఆగిపోయిన ఎల్ 3 కేటగిరీ లబ్ధిదారుల బిల్లులను విడుదల చేసినట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం తెలిపారు. కలెక్టర్ల నుంచి నివేదికలు తెప్పించుకున్న అనంతరం అర్హులైన సుమారు 1,072 మంది లబ్ధిదారులకు రూ.12.17 కోట్ల బిల్లులను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వరంగల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎల్ 3 కేటగిరీలోని లబ్ధిదారుల బిల్లుల చెల్లింపు అంశాన్ని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. బిల్లు చెల్లింపుల ప్రక్రియలో నిశిత పరిశీలనలో లబ్ధిదారులు ఆర్సీసీ అద్దె ఇండ్లలో నివస్తుండటం, గతంలోని ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిపొంది ఉండటం తదితర కారణాల వల్ల బిల్లులను విడుదల చేయలేదు. ఈ అంశాన్ని పరిశీలించాలని పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో సొంతింటి వసతి లేక ఆర్సీసీ ఇండ్లలో అద్దెకు ఉంటూ ప్రస్తుతం ఇండ్లు కట్టుకుంటున్న వారితోపాటు పాత ఇందిరమ్మ పథకంలో బేస్‌మెంట్ పనుల వరకే లబ్ధి పొందిన వారికి బిల్లులను విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ కేటగిరీలో అర్హులైన వారికి బిల్లులను విడుదల చేసినట్లు ఎండీ తెలిపారు.



## ప్రజాసేవే జీవితం

: **భైంసా ఐదవ వార్డుకు అంకితమైన యువ నాయకుడు సయ్యద్ ఇర్ఫాన్**


ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 12 (భారతశక్తి): ప్రజాసేవే లక్ష్యంగా సాగిన ప్రయాణం భైంసా ఐదవ వార్డు మాజీ కౌన్సిలర్ సయ్యద్ ఇర్ఫాన్ సేవలు మరువలేనివి. భైంసా పట్టణంలోని ఐదవ వార్డుకు ఎంఐఎం పార్టీ తరపున కౌన్సిలర్‌గా గెలుపొందిన మాజీ కౌన్సిలర్ సయ్యద్ ఇర్ఫాన్ ప్రజాసేవలో తనదైన ముద్ర వేశారు. అతి పిన్న వయసులోనే ప్రజల్లోకి దూసుకెళ్లిన ఆయన, నాయకత్వ లక్షణాలతో స్థానికుల మన్ననలు పొందారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వెంటనే పరిష్కారానికి కృషి చేయడం ఆయన ప్రత్యేకత. వార్డులో తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అభివృద్ధికి బాటలు వేశారు. ప్రత్యేకంగా పేదవర్గాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సాయం అందిస్తూ మానవీయతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. ప్రజల మంచి-చెడులను తెలుసుకుంటూ, ప్రతి కుటుంబానికి అండగా ఉండేలా వ్యవహరించారు.




"ప్రజాసేవే నా జీవితం" అనే నినాదంతో ముందుకు సాగుతున్న యువ నాయకుడు సయ్యద్ ఇర్ఫాన్, పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యే ఉంటూ సేవా కార్యక్రమాలు కొనసాగించడం విశేషం. ఆయన సేవలను భైంసా ప్రజలు ఎప్పటికీ మరువలేరనడంలో ఎలాంటి సందేహం లేదు. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో మరో అవకాశం ఇచ్చి మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సమక్షంలో చేరిన బీజేపీ, బీఆర్ఎస్ నేతలు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 12: కామారెడ్డి పట్టణంలోని పలు వార్డులకు చెందిన ఇతర పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పాత రాజంపేట, సరంపల్లి, టెక్రియల్, అడ్లూరు ప్రాంతాలకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు ఆయా పార్టీలకు రాజీనామా చేసి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన వారికి షబ్బీర్ అలీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధిని చూసి ఇతర పార్టీల నుండి నేతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. కామారెడ్డి పట్టణ అభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే



సాధ్యమని, కొత్తగా చేరిన వారందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ భారీ చేరికలతో కామారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని షబ్బీర్ అలీ అన్నారు.



## బాసుతండాలోనే గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలి

మహబూబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి 12 (భారత శక్తి ): నూతన గ్రామపంచాయతీ నిర్మాణాన్ని బాసు తండలోనే నిర్మించాలని తండా ప్రజలు జిల్లా అడిషనల్ ఇంచార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాసు తండా ప్రజలు మాట్లాడుతూ జిల్లాలోని నర్సింహుల పేట మండలం బాసు తండ గ్రామపంచాయతీ పరిధిలో దాసు తండా రాములు తండా రాములు తండా మంగళ్ తండాలు ఉన్నాయి. బాసుకొండలో గ్రామపంచాయతుండగా ప్రస్తుత సర్పంచ్ తన స్వలాభం కోసం కొత్తగా నిర్మాణం చేపట్టాలనుకున్న నూతన గ్రామపంచాయతీని దాసు తండాలో ఏర్పాటు సిద్ధమయరు. నూతన గ్రామపంచాయతీని బాసు తండా గ్రామపంచాయతీ పరిధిలో నిర్మాణం చేపట్టాలని తండా వాసులుకోరారు. ఈ కార్యక్రమంలో సిరి నాయక్ వార్డు మెంబర్లు పంతులు నాయక్, జ్యోతి, మంజుల, లచ్చిరాం, రామ సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువ న్యాయవాదులు తమ వృత్తిలో అంకితభావం కలిగి ఉండాలి..

- **వివేకానందుని బోధనలు యువతకు మార్గదర్శం**
- **అదనపు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ అర్వపల్లి కృష్ణతేజ్**
- **స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువశక్తి లీగల్ ఎక్సెలెన్సీ అవార్డుల ప్రధానం**
- **న్యాయవాది పరిషత్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు.. పరిషద్ జిల్లా అధ్యక్షుడు నలుసాని ప్రభాకర్ రెడ్డి**




మహబూబాబాద్ జిల్లా ప్రతి నిది, జనవరి 12, భారత శక్తి: న్యాయవాది పరిషత్ మహబూబాబాద్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు నలుసాని ప్రభాకరెడ్డి అధ్యక్షతన శ్రీ స్వామి వివేకానంద 163 వ జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని మహబూబాబాద్ బార్ అసోసియేషన్ హాలులో ఘనంగా నిర్వహించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా యువతను ప్రోత్సహించడం, వారిలో స్ఫూర్తి నింపడం కోసం యువ న్యాయవాదులు వాసం ఆనంద్ కుమార్,దర్శనం రామకృష్ణ ,బస్కే మధు, కాసాని మౌనిక,మణికొండ ప్రవీణ,గుగులోత్ సునీత లకు "*యువ శక్తి-లీగల్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026* అవార్డ్స్ ముఖ్య అతిథి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏ. కృష్ణ తేజ, అతిథులు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ. ప్రేమచందర్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపెల్లి వెంకటయ్య, కేంద్రప్రభుత్వ న్యాయవాది తుంపిల్ల శ్రీనివాస్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఆరెల్లి శ్రీనివాస్ లు ప్రధాన చేసి ఘనముగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏ. కృష్ణ తేజ మాట్లాడుతూ దేశ నిర్మాణం, అభివృద్ధి , దేశపురోగతి యువత సహకారంపై ఆధారపడి ఉంటుంది. దేశాభివృద్ధిలో యువశక్తి చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అటువంటి యువజన సమూహం యొక్క శక్తి ,సామర్థ్యాన్ని ప్రపంచానికి మొదటిసారిగా తెలియజేసినది స్వామి వివేకానంద అని అన్నారు. గొప్ప వ్యక్తి యొక్క జన్మదినాన్ని , యువతకు స్ఫూర్తి. యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని భావించిన వివేకానంద ఆలోచనలతో యువతను ఏకం చేయాలన్నారు. ఈ కార్యక్రమములో న్యాయవాది పరిషత్ ఉపాధ్యక్షుడు గాదె కమల్ కుమార్,ప్రధాన కార్యదర్శి పుల్లఖండం శ్రీనివాస స్వామి,కోశాధికారి పిన్ని రాము,న్యాయవాదులు దేగల సత్యనారాయణ, దూదిమట్ల మహేందర్, ఉడుగుల హరికృష్ణ, కొర్ర మున్నా, తొణుకునూరి సైదులు, బి.లాలూ, టి.సునీత, ఉడుగుల రాజ్ కృష్ణ, బి.శ్రీనివాస్, కట్కూరి శ్రీనివాస్, సునీత, బొద్దుల దేవి, బి. బాలాజీ , సుమన్, భూక్యా సురేష్ , పి.ఉమామహేశ్వర్ రావు, చిట్యాల నరేష్, చల్లా అశోక్, జరుపుల సురేష్, ఉగ్గుల అశోక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 12: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి 90 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీలను అర్జీదారుల నుండి స్వీకరించి సంబంధిత అధికారులకు ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు.

ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించి ఆయా దరఖాస్తులు అధికారులకు ఇస్తూ పెండింగ్ లో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్ మదన్ మోహన్, సీఈఓ చందర్, ఆర్డీఓ వీణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా ప్రజావాణికి 76 ఫిర్యాదులు.. చెరువుల పునరుద్ధరణపై వినతులు

హైదరాబాద్, జనవరి 12 (భారతశక్తి): నగరంలో అభివృద్ధి చెందిన చెరువులను చూసి.. తమ ప్రాంతాల్లో ఉన్న వాటిని కూడా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. చెరువులు కబ్జా అవ్వకుండా కాపాడాలంటున్నారు. చెరువులను అనుసంధానం చేసిన వరద కాలువలను పునరుద్ధరించమని అడుగుతున్నారు. ఒకప్పటి చెరువుల వైభవాన్ని చెబుతూ.. మంచనీటి సరస్సులగా మార్చమని కోరుతున్నారు. జీడిమెట్లలోని ఫాక్స్ సాగర్, ప్రగతినగర్ చెరువు, కాటేదాన్‌లోని నూరమహ్మద్‌కుంట, ఫిల్మ్‌నగర్ చెరువు ఇలా నగరం నలుమూలల నుంచి చెరువులను అభివృద్ధి చేయాలని డిమాండ్లు ఊపందుకున్నాయి. అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, పాతబస్తీలోని బమ్‌రుక్న్ ఉద్ దౌలా చెరువు పర్యాటక ప్రాంతాలుగా మారాయని.. తమ ప్రాంతంలో ఉన్న చెరువుల దుర్గంధాన్ని వదిలించాలని ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు. అలాగే రహదారులు, పార్కుల ఆక్రమణలకు సంబంధించినఫిర్యాదులూ అందాయి. లేఔట్‌లోని




రహదారులను, పార్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి 76 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు దారల ముందే పరిష్కార బాధ్యతలను అప్పగించారు. కొన్ని ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి వస్తామని హైడ్రా కమిషనర్‌కి చెప్పారు.

**ఫిర్యాదులు ఇలా..**

జీడిమెట్ల పారిశ్రామిక వాడను ఆనుకుని ఉన్న ఫాక్స్ సాగర్ కబ్జాలను తొలగించి.. మరో ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలని అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణిలో కోరారు. వెయ్యికి పైగా ఆక్రమణలున్నాయని వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఫాక్స్ సాగర్ నుంచి నేరుగా హుస్సేన్ సాగర్‌కు ఉండే వరద కాలువ కూడా పలుచోట్ల కబ్జాలకు గురైందని.. పునరుద్ధరించాలని కోరారు. తాగునీటితో పాటు.. సాగునీటిని అందించిన ఈ చెరువును పునరుద్ధరిస్తే అనేక మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందని.. అక్కడ నివాసిత ప్రాంతాలకు ఆహ్లాదకరంగా మారుతుందన్నారు.

# ఉద్యమకారుల సంక్షేమమే ధ్యేయం



* 'తెలంగాణ ఆత్మగౌరవ ప్రస్థానం'పై సమగ్ర నివేదిక సిద్ధం..

హైదరాబాద్, జనవరి 12: భారతశక్తి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ కమిటీ కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారుల ప్రస్తుత జీవన స్థితిగతులపై ఒక 'సమగ్ర నివేదిక' రూపొందిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లో వివిధ ఉద్యమ సంఘాల ప్రతినిధులు, కీలక నేతలతో సమావేశమైన అనంతరం కప్పాటి పాండురంగారెడ్డి, నంగావత్ రాజేష్ నాయక్, బండారు శ్రీనివాస్ గౌడ్, శీలం విజయేందర్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

**ముఖ్యాంశాలు:**

క్షేత్రస్థాయి అధ్యయనం: స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులు పొందిన గుర్తింపుతో పాటు, వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులపై క్షేత్రస్థాయిలో లోతైన అధ్యయనం చేపడుతున్నారు. పక్కా బ్లూ ప్రింట్: ఉద్యమకారుల కుటుంబాలకు భవిష్యత్తులో భరోసా కల్పించేలా, వారి సంక్షేమానికి అవసరమైన కార్యాచరణతో కూడిన పక్కా నివేదికను కమిటీ సిద్ధం చేస్తోంది. కవితక్క ఆశయ సాధన: తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, ఉద్యమకారులందరికీ తగిన న్యాయం జరగాలన్నదే తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితక్క ప్రధాన ఆశయమని ప్రతినిధులు స్పష్టం చేశారు. స్టీరింగ్ కమిటీకి నివేదిక: త్వరలోనే ఈ సమగ్ర నివేదికను కవితక్క ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టీరింగ్ కమిటీకి అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఉద్యమకారులే ప్రాధాన్యం: "అలుపెరగని పోరాటం వల్లే స్వరాష్ట్రం సిద్ధించింది, అందుకే ఉద్యమకారుల సంక్షేమమే తమ మొదటి ప్రాధాన్యత" అని కమిటీ ఉద్ఘాటించింది. ఈ సమావేశంలో ఉండెల్లి బాబూరావు, రమేశ్ నాయక్ తదితర ముఖ్య నేతలు పాల్గొని, ఉద్యమకారుల ప్రస్తుత పరిస్థితులపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. తెలంగాణ ఆత్మగౌరవ ప్రస్థానాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ఈ నివేదిక ఒక మైలురాయిగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.



## వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

మహేశ్వరం, జనవరి 12, భారత శక్తి : మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో సోమవారం నిర్వహించిన పలు సామాజిక, ప్రైవేటు కార్యక్రమాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**ఉత్సాహంగా ముగ్గుల పోటీలు:"**

బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని గ్రీన్ రిచ్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు హాజరైన పారిజాత నర్సింహారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు సంక్రాంతి పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. కాలనీ వాసులందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

**చిన్నారికి ఆశీర్వచనం:**

కందుకూరు మండల కేంద్రంలోని కేఏఆర్ శుభం కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ నాయకులు గుర్రం రజినీకాంత్ కుమార్తె మొదటి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు పారిజాత నర్సింహారెడ్డి విచ్చేసి చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆకుల మైలారం గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు 'ఈ-వేస్ట్'ను అప్పగించండి

* స్వచ్ఛందంగా ముందుకు రావాలి: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్.
* బాగ్‌లింగంపల్లిలో మెగా సేకరణ డ్రైవ్ పరిశీలన

హైదరాబాద్ భారత శక్తి: నగర పౌరులు తమ ఇళ్లలో పేరుకుపోయిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను (ఈవేస్ట్) బాధ్యతగా జీ.హెచ్.ఎం.సీ సిబ్బందికి అప్పగించాలని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన 'మెగా ఈవేస్ట్ సేకరణ డ్రైవ్'ను ఆయన స్వయంగా సందర్శించి, క్షేత్రస్థాయి ఏర్పాట్లను సమీక్షించారు. నేటితో ముగియనున్న డ్రైవ్ నగరవ్యాప్తంగా సాగుతున్న ఈ ప్రత్యేక డ్రైవ్ మంగళవారంతో ముగియనుంది. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు, వాహనాల పనితీరును కమిషనర్ పరిశీలించారు. పాత సెల్ ఫోన్లు, వైర్లు, కంప్యూటర్ విడిభాగాలు, పాడైపోయిన టీవీలు వంటి వస్తువులను ఇష్టారీతిన పారవేయకుండా, శాస్త్రీయంగా నిర్వీర్యం చేసేందుకు వీలుగా మున్సిపల్ యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.




**అశాస్త్రీయ పద్ధతులతో ముప్పు**

"వాడేసిన ఎలక్ట్రానిక్ పరికరాలను సాధారణ చెత్తతో కలిపి పారవేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇది భూగర్భ జలాల కాలుష్యానికే కాకుండా, ప్రజారోగ్యానికి కూడా పెను ముప్పుగా మారుతుంది" అని కమిషనర్ హెచ్చరించారు. ఈ ముప్పును నివారించేందుకే ప్రజల భాగస్వామ్యంతో ఈ భారీ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన స్పష్టం చేశారు.

**ఐటీ కారిడార్‌పై ప్రత్యేక దృష్టి**

ఈ డ్రైవ్‌లో భాగంగా ఐటీ కార్యాలయాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, ఎలక్ట్రానిక్ విడిభాగాల విక్రయ కేంద్రాలపై జీహెచ్ఎంసీ ప్రత్యేక నిఘా పెట్టింది. ప్రచారం: ఇప్పటికే జోనల్, డిప్యూటీ కమిషనర్లు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఏర్పాట్లు: ప్రతి సర్కిల్ పరిధిలో ప్రత్యేక వాహనాలు, కౌంటర్లను అందుబాటులో ఉంచారు. లక్ష్యం: రేపటిలోగా గరిష్ట స్థాయిలో ఈవేస్ట్‌ను సేకరించి, సురక్షితంగా రీసైక్లింగ్ కేంద్రాలకు తరలించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు తమ ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను వెంటనే అప్పగించి, ఈ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని కమిషనర్ కోరారు.



జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలతో సరూర్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ బోనగిరి శ్రీనివాస్ సారధ్యంలో డాక్టర్స్ కాలనీలో మాస్ ఎలక్ట్రానిక్ వేస్ట్ కలెక్షన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు విఎస్ఎన్ శ్రీనివాస్, వన్నాడీ శ్రీనివాస్, శానిటేషన్ డిఈ చందన, ఎస్ఎస్ బుచ్చయ్య, ఎస్ఎఫ్ఏ శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, జనవరి 12 (భారత శక్తి ):

## యువతే దేశానికి దిక్సూచి.. వివేకానందుని బాటలో పయనించాలి..

* ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు

: 3K రన్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, కుండే గణేష్.




బి.ఎన్. రెడ్డి నగర్, జనవరి 12 (భారతశక్తి) : "ఒకే లక్ష్యం.. ఒకే ఆలోచన.. అదే మీ జీవితం కావాలి" అన్న స్వామి వివేకానందుని పిలుపు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జయంతి (జాతీయ యువజన దినోత్సవం) పురస్కరించుకొని సోమవారం NGO'S కాలనీలోని వివేకానంద విగ్రహం వద్ద 'వివేకానంద క్రాంతి సంఘ్' ఆధ్వర్యంలో 'యువత కోసం పరుగు దేశం కోసం పరుగు' పేరిట 3K రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావులతో కలిసి కార్పొరేటర్ వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జెండా ఊపి పరుగును ప్రారంభించారు.

* ప్రపంచ యవనికపై భారత కీర్తిని చాటిన మహనీయుడు

ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చి రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశ ఆధ్యాత్మిక సంపదను, సంస్కృతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన గొప్ప తత్వవేత్త వివేకానందుడని కొనియాడారు. చికాగో ప్రసంగం ద్వారా భారతీయుల మేధాశక్తిని ప్రపంచానికి పరిచయం చేశారని, ఆయన ఒక కేవలం సాధువు మాత్రమే కాక, గొప్ప మానవతావాది అని పేర్కొన్నారు.

* ఉక్కు నరాలు.. ఇనుప కండరాలు కావాలి

"యువతపై వివేకానందుడికి అపారమైన నమ్మకం ఉండేది. దేశ భవిష్యత్తును మార్చగలిగే శక్తి యువతకే ఉందని ఆయన విశ్వసించేవారు. 'ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, పిడుగు వంటి మనస్సు' కలిగిన యువత దేశానికి అవసరమని ఆయన ఇచ్చిన సందేశం నేటికీ అక్షర సత్యం" అని లచ్చి రెడ్డి ఉద్ఘాటించారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా, ఆధ్యాత్మిక బలంతో, క్రమశిక్షణతో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**కార్యక్రమ విశేషాలు:**

పాల్గొన్న ప్రముఖులు: కుండే గణేష్, వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రావు మరియు స్థానిక బిజెపి నాయకులు.

ముఖ్య ఉద్దేశ్యం: యువతలో శారీరక దృఢత్వం, దేశభక్తిని పెంపొందించడం, 3K రన్‌లో పెద్ద సంఖ్యలో యువకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు తక్షణ పరిష్కారం చూపాలి


: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 12 (భారతశక్తి): నిర్మల్ ప్రజల నుండి వచ్చే ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అర్జీలను ఆమె స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని సూచించారు. ముఖ్యంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో సంబంధిత శాఖలన్నీ పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ప్రధానంగా విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన వినతులను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

* ముఖ్యమంత్రి పర్యటన - అధికారులకు దిశానిర్దేశం:

త్వరలో జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారం, నివేదికలతో అధికారులు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. అలాగే, జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన 'అటల్ పెన్షన్ యోజన' (APY) అమలులో జిల్లా 107 శాతం నమోదు సాధించినందుకు గాను, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్‌ను కలెక్టర్ ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం, జిల్లా అధికారుల సంఘం నూతన క్యాలెండర్‌ను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కొత్త కార్యాలయానికి ప్రధాని మోదీ... మారనున్న పీఎంవో చిరునామా

ఢిల్లీ, జనవరి 12, భారత శక్తి : భారత ప్రధాని కార్యాలయం (పీఎంవో) చిరునామా త్వరలో మారనుంది. సెంట్రల్ విస్టా రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అత్యాధునిక కార్యాలయ భవన సముదాయంలోకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెలలోనే మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. జనవరి 14 తర్వాత, మకర సంక్రాంతి అనంతరం ఆయన కొత్త కార్యాలయంలోకి ప్రవేశించవచ్చని ప్రభుత్వ వర్గాల సమాచారం మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఢిల్లీలోని సౌత్ బ్లాక్ నుంచే పీఎంవో కార్యకలాపాలు సాగుతుండగా, 78 ఏళ్ల తర్వాత తొలిసారి ఈ కార్యాలయం వేరే చోటుకు మారుతుండటం చారిత్రక ప్రాధాన్యం సంతరించుకుంది. రాయ్‌సీనా హిల్స్‌కు సమీపంలో, దారా షికో రోడ్డులో నిర్మించిన ఈ కొత్త భవన సముదాయానికి 'సేవా తీర్థ్' అని ప్రభుత్వం నామకరణం చేసింది. ఇందులో మొత్తం మూడు భవనాలు ఉన్నాయి. 'సేవా తీర్థ్ 1'ను పీఎంవో కోసం, 'సేవా తీర్థ్ 2'ను కేబినెట్ సెక్రటేరియట్ కోసం, 'సేవా తీర్థ్ 3'ను జాతీయ భద్రతా మండలి (NSCS) కోసం కేటాయించారు. ఇప్పటికే కేబినెట్ సెక్రటేరియట్ గత ఏడాది సెప్టెంబర్‌లోనే కొత్త భవనంలోకి మారింది. ఇప్పుడు పీఎంవో కూడా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (CPWD) పర్యవేక్షణలో లార్సెన్ అండ్ టూబ్రో (L&T) సంస్థ రూ.1,189 కోట్ల వ్యయంతో 24 నెలల్లో ఈ నిర్మాణం పూర్తి చేసింది. పాలనలో అధికారం ('సత్తా') కాకుండా సేవకే ('సేవ') ప్రాధాన్యత



ఇస్తున్నామని చెప్పేందుకే ఈ భవనానికి 'సేవా తీర్థ్' అని పేరు పెట్టినట్లు గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ప్రధాని కార్యాలయం, కేబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి వంటి కీలక కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండటం వల్ల సమన్వయం మెరుగవుతుందని, భద్రత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. పీఎంవో పూర్తిగా ఖాళీ అయిన తర్వాత చారిత్రక నార్త్, సౌత్ బ్లాక్‌లను 'యుగ యుగీన్ భారత్ సంగ్రహాలయ' పేరుతో జాతీయ మ్యూజియంగా మార్చనున్నారు.

## భారత క్రీడా రంగంలో భారీ సంస్కరణలు

ఢిల్లీ, జనవరి 12, భారత శక్తి : భారత క్రీడా రంగ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ క్రీడా సమాఖ్యల పాలకవర్గాల్లో మాజీ క్రీడాకారులకు, మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ 'జాతీయ క్రీడా పాలన (జాతీయ క్రీడా సంస్థలు) నిబంధనలు, 2026'ను నోటిఫై చేసింది. జాతీయ క్రీడా పాలన చట్టం, 2025 కింద ఈ కొత్త నియమాలను సోమవారం జారీ చేసినట్లు కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిబంధనల ప్రకారం, ప్రతి జాతీయ క్రీడా సమాఖ్య జనరల్ బాడీలో 'అత్యుత్తమ ప్రతిభావంతులైన క్రీడాకారులు' (SOMs) కోటాలో కనీసం నలుగురికి చోటు కల్పించాలి. వీరిలో 50 శాతం, అంటే ఇద్దరు మహిళలు ఉండటం తప్పనిసరి. అదేవిధంగా, ఎగ్జిక్యూటివ్ కమిటీలోనూ కనీసం నలుగురు మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని స్పష్టం చేశారు. క్రీడాకారుల ఎంపిక కోసం వారి విజయాల ఆధారంగా ఒలింపిక్స్ పతక విజేతల నుంచి జాతీయ స్థాయి విజేతల వరకు 10 అంచెల ప్రమాణాలను నిర్దేశించారు. ఈ కోటాలో స్థానం పొందాలంటే క్రీడాకారులకు కనీసం 25 ఏళ్ల వయసు ఉండాలి, వారు క్రీడల నుంచి రిటైర్ అయి కనీసం ఏడాది గడిచి ఉండాలి. క్రీడా సమాఖ్యల ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు 'జాతీయ క్రీడా ఎన్నికల ప్యానెల్'ను ఏర్పాటు చేయనున్నారు. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలి జైలు శిక్ష పడిన వారు ఎన్నికల్లో పోటీ చేయడానికి, కమిటీలలో సభ్యులుగా ఉండటానికి అనర్హులుగా ప్రకటించారు. ఈ నిబంధనలు అమల్లోకి వచ్చిన ఆరు నెలల్లోగా అన్ని జాతీయ క్రీడా సమాఖ్యలు తమ నియమావళి (బైలాస్) సవరించుకోవాల్సి ఉంటుంది. ప్రత్యేక పరిస్థితుల్లో ఏదైనా సమాఖ్య దరఖాస్తు చేసుకుంటే, 12 నెలల పాటు నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కల్పించారు.

## వాహనాల చలాన్లకు డిస్కౌంట్ ఇవ్వొద్దు...
# ఖాతా నుంచి వెంటనే డబ్బులు కట్ కావాలి

హైదరాబాద్, జనవరి 12, భారత శక్తి : వాహనాలకు చలాన్లు విధిస్తున్నప్పటికీ, డిస్కౌంట్ ఇచ్చి తగ్గిస్తారనే భావన ఒక పెద్ద సమస్యగా మారిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇకపై ట్రాఫిక్ చలాన్లకు ఎలాంటి డిస్కౌంట్ ఇవ్వరాదని ఆయన సూచించారు. ఏ వాహనమైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే, యజమాని బ్యాంకు ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా డబ్బులు కట్ అయ్యే విధానం రావాలని ఆయన అభిప్రాయపడ్డారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే లక్ష్యంతో యూసఫ్‌గూడ స్టేడియంలో ఏర్పాటు చేసిన 'అర్రైవ్ అలైవ్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుంటే, ప్రతి మూడు నిమిషాలకు ఒకరు మరణిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే వెంటనే బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యేలా, వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలోనే యజమాని బ్యాంకు ఖాతాను లింక్ చేయాలని స్పష్టం చేశారు. ఈ విషయంపై బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మైనర్లు ప్రమాదాలకు గురైతే వారి తల్లిదండ్రులపై కేసులు పెట్టాలని ఆయన ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల విషయంలో రవాణా శాఖ, పోలీసు శాఖ సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. చాలా సందర్భాల్లో మన ప్రమేయం లేకున్నా, ఎదుటివారి తప్పుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. హైడ్రా, ఈగల్, సైబర్ క్రైమ్ విభాగాలను బలోపేతం చేసినట్లే, ట్రాఫిక్ నియంత్రణలోనూ పోలీస్ వ్యవస్థను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ శుభవార్త

హైదరాబాద్, జనవరి 12, భారత శక్తి : సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్తను అందించింది. ప్రభుత్వ ఉద్యోగులకు 3.64 శాతం కరవు భత్యాన్ని (డీఏ) పెంచుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పెరిగిన డీఏ 2024 జులై 1వ తేదీ నుంచి వర్తిస్తుంది. జనవరి నెల జీతంతో పాటు పెరిగిన డీఏను ప్రభుత్వం ఫిబ్రవరి 1న చెల్లించనుంది. 2023 జులై 1వ తేదీ నుంచి గత ఏడాది డిసెంబర్ 31 వరకు ఉన్న డీఏ బకాయిలను జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనుంది.

**రైతులకు గుడ్ న్యూస్**

సంక్రాంతి వేళ తెలంగాణ ప్రభుత్వం రైతులకు కూడా శుభవార్తను అందించింది. సన్న వరిధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ నిధులను పౌరసరఫరాల శాఖ విడుదల చేసింది. వానాకాలం సీజన్‌లో సన్నరకం వడ్లు పండించిన రైతులకు కనీస మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని తెలంగాణ ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. తాజాగా విడుదల చేసిన నిధులతో కలిపి ఈ సీజన్‌లో ప్రభుత్వం మొత్తం రూ.1,429 కోట్ల బోనస్ నిధులను విడుదల చేసింది. రైతులు ధాన్యం విక్రయించిన తర్వాత వారి వివరాలను నమోదు చేసుకుని, మద్దతు ధరతో పాటు బోనస్ మొత్తాన్ని నేరుగా వారి ఖాతాలో జమ చేస్తున్నారు.

## సంక్రాంతి సంబరాల కోసం నారావారిపల్లె చేరుకున్న సీఎం

నావావారిపల్లె, జనవరి 12, భారత శక్తి : సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన స్వగ్రామం నారావారిపల్లెకు చేరుకున్నారు. ప్రతి ఏటా కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి సంక్రాంతి పండుగ జరుపుకునే సీఎం చంద్రబాబు... ఆ ఆనవాయతీని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా స్వగ్రామానికి తరలివెళ్లారు. సోమవారం నాడు మంత్రులు, సెక్రటరీలు, కలెక్టర్లతో సచివాలయంలో సమీక్షా సమావేశం అనంతరం సాయంత్రం నారావారిపల్లెకు హెలికాప్టర్ లో పయనమయ్యారు. స్వగ్రామంలో ఆయనకు ఘనస్వాగతం లభించింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, నేతలతో కలిసి రేపు సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటారు. మంగళవారం నాడు నారావారిపల్లెతో పాటు తిరుపతిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేస్తారు.

*** ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు...**

**శంకుస్థాపనలు**

మంగళవారం ఉదయం 8 గంటలకు గ్రామంలోని టీటీడీ కళ్యాణ మండపం ప్రాంగణంలో నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో సీఎం పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం శేషాచల లింగేశ్వర స్వామి దేవస్థానం వద్దకు వెళ్లనున్నారు. రూ.70 లక్షలతో రంగంపేట-భీమవరం రోడ్డు నుంచి శేషాచల లింగేశ్వర స్వామి ఆలయం వరకు నిర్మించిన రహదారిని ప్రారంభిస్తారు. నారావారిపల్లెలో 33/11 కేవీ సెమీ ఇండోర్ సబ్ స్టేషన్, రూ.1.4 కోట్లతో పరిశ్రమల అవసరాలకు తగినట్టుగా యువతకు శిక్షణ ఇచ్చేలా నిర్మించిన స్కిల్ బిల్డింగ్ సెంటర్, సంజీవని ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. ఇక తిరుపతిలో రూ.45 లక్షలతో నిర్మించిన శ్రీ వెంకటేశ్వర రామ్‌నారాయణ్ రుయా ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్ అటెండెంట్ అమీనిటీస్ కాంప్లెక్స్, ఎస్వీ యూనివర్సిటీలో రూ.7.5 కోట్లతో నిర్మించిన బాయ్స్ హాస్టల్, రూ.5 కోట్లతో నిర్మించిన గర్ల్స్ హాస్టల్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. మూలపల్లిలో నీటి సరఫరాకు సంబంధించి నీవా బ్రాంచ్ కెనాల్ నుంచి కల్యాణి డ్యామ్‌కు, మూలపల్లి చెరువుతో పాటు మరో 4 చెరువులకు నీటిని తరలించేలా రూ.126 కోట్లతో చేపట్టే ప్రాజెక్టుకు, రూ.10 లక్షలతో పశువుల వసతి సముదాయానికి శంకుస్థాపన చేస్తారు. ఎస్వీ యూనివర్సిటీలో పరిశోధన, ఆవిష్కరణలకు ఊతం ఇచ్చేలా రూ.6 కోట్లతో సెంట్రలైజ్డ్ అడ్వాన్స్డ్ పరిశోధన ల్యాబ్స్, విద్యా మౌలిక వసతుల్లో భాగంగా రూ.5.03 కోట్లతో అకడమిక్ బిల్డింగ్ 2వ అంతస్తుకు, రూ.2.91 కోట్లతో చేపట్టే కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు.

**నాగాలమ్మకు ప్రత్యేక పూజలు**


15వ తేదీన తమ గ్రామ దేవతైన నాగాలమ్మ గుడికి కుటుంబ సమేతంగా సీఎం చంద్రబాబు వెళతారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదే రోజున నారావారిపల్లె నుంచి అమరావతికి చేరుకుంటారు.

## మిత్రుల మధ్య విభేదాలు సహజమే..
# అందుకే ట్రంప్-మోదీ మధ్య దూరం!

అమెరికా, జనవరి 12 : తమ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధ్య స్నేహబంధం నిజమైందేనని భారత్‌కు నూతన అమెరికా రాయబారిగా బాధ్యతలు చేపట్టిన సెర్గియో గోర్ పేర్కొన్నారు. నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమని, ట్రంప్, మోదీల మధ్య విభేదాలు కూడా అలాంటివేనని అన్నారు. వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగడానికి వారు ప్రయత్నిస్తారని తెలిపారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ప్రపంచంలోనే భారతదేశం అతిపెద్ద దేశమని, రెండు దేశాల మధ్య సత్సంబంధాలకు వాణిజ్యం చాలా కీలకమని గోర్ అభిప్రాయపడ్డారు. వీలైనంత త్వరగా వాణిజ్యం ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరు దేశాల ప్రతినిధులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని ఆయన తెలిపారు. భద్రత, సాంకేతికత, ఆరోగ్యం, ఇంధనం వంటి రంగాల్లో కూడా రెండు దేశాల మధ్య పరస్పర సహకారం కొనసాగుతుందని అన్నారు. భారతదేశమే తమకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందానికి సంబంధించి జనవరి 13న ఇరు దేశాల ప్రతినిధులు మరోసారి సమావేశం కానున్నట్లు సెర్గియో గోర్ వెల్లడించారు.

# ఇస్రో రాకెట్ ప్రయోగం విఫలం..


శ్రీహరికోట జనవరి 12, భారత శక్తి : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన రాకెట్ ప్రయోగం విఫలమైంది. తొలి రెండు దశల్లో సాఫీగా సాగిన రాకెట్.. మూడో దశలో గతి తప్పింది. ఈ రోజు ఉదయం 10.18 గంటలకు శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి పీఎస్ఎల్వీ- సీ62 రాకెట్ నింగికెగిరింది. 18 నిమిషాల ప్రయాణం తర్వాత ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చాలి. అయితే, సాంకేతిక సమస్య వల్ల రాకెట్ తో సంబంధాలు తెగిపోయాయని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ వెల్లడించారు. సమస్యకు గల కారణాలను విశ్లేషిస్తున్నామని, త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. దేశ రక్షణ రంగానికి అత్యంత కీలకమైన 'ఈఓఎస్ఎన్1' లేదా 'అన్వేష' ఉపగ్రహంతో పాటు భారత్, యూకే, థాయ్‌లాండ్, బ్రెజిల్, స్పెయిన్, నేపాల్ తదితర దేశాలకు చెందిన మరో 14 చిన్న ఉపగ్రహాలను




కూడా ఈ రాకెట్ మోసుకెళ్లింది. అత్యంత కీలకమైన 'అన్వేష' ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టేందుకు చేపట్టిన రాకెట్ ప్రయోగం విఫలం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో నిరాశ వ్యక్తమవుతోంది. కాగా, 2025 మే 18న ప్రయోగించిన పీఎస్ఎల్వీ - సీ61 రాకెట్ ప్రయోగం కూడా ఇదేవిధంగా మూడో దశలోనే విఫలమైంది. ఈ ప్రయోగంలో జరిగిన తప్పొప్పులను నిశితంగా పరిశీలించి, పొరపాట్లను సరిదిద్దుకున్నాక చేపట్టిన తాజా ప్రయోగం కూడా ఫెయిలైంది.

## అమరావతిలో జోరుగా
# రెండో విడత ల్యాండ్ పూలింగ్..

అమరావతి, జనవరి 12, భారత శక్తి : ఏపీ రాజధాని అమరావతి రెండో దశ ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ ఊపందుకుంటోంది. ఈరోజు పల్నాడు జిల్లాలోని పెదకూరపాడు మండలం కర్లపూడి లేమల్లె గ్రామాల్లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి మంత్రి నారాయణ ఈ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తో కలిసి నారాయణ రైతుల నుంచి అంగీకార పత్రాలు స్వీకరించారు. తమ వద్దకు వచ్చిన మంత్రి, ఎమ్మెల్యేలకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో స్వాగతించారు. తమ గ్రామాలను ఈ ప్రాజెక్టుకు ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి రైతులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ రెండో దశలో మొత్తం 7 గ్రామాల్లో భూసమీకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో పల్నాడు జిల్లా అమరావతి మండలంలో వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి,



కర్లపూడి, లేమల్లె... గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలో వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాలు ఉన్నాయి. ఇప్పటివరకు 4 గ్రామాల్లో ప్రక్రియ ప్రారంభమైంది (కర్లపూడి లేమల్లెతో సహా). ఈ భూములను అంతర్జాతీయ విమానాశ్రయం, క్రీడా నగరం (ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ), స్మార్ట్ పరిశ్రమలు, రైల్వే ట్రాక్, ఇన్నర్ రింగ్ రోడ్ వంటి పెద్ద ప్రాజెక్టుల కోసం ఉపయోగించనున్నట్టు తెలుస్తోంది. మొదటి దశలో 34,000 ఎకరాలు ఇప్పటికే పూల్ అయ్యాయి, ఇప్పుడు ఇంకా విస్తరణతో అమరావతి మరింత పెద్ద నగరంగా మారనుంది.

## కరూర్ తొక్కిసలాట ఘటన...
# ఆరు గంటలకు పైగా నటుడు విజయ్‌ని ప్రశ్నించిన సీబీఐ

జనవరి 12, భారత శక్తి : కరూర్ తొక్కిసలాట ఘటనపై సినీ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ సీబీఐ తొలిరోజు విచారణ ముగిసింది. విజయ్‌ను ఆరు గంటలకు పైగా విచారించిన సీబీఐ అధికారులు, ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. సంక్రాంతి తర్వాత సీబీఐ మరోసారి ఆయనను విచారించనుంది. తొక్కిసలాట ఘటనకు టీవీకేకు ఎలాంటి సంబంధం లేదని ఆయన విచారణ సందర్భంగా అధికారులతో



చెప్పినట్లు సమాచారం. పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకే తాను అక్కడి నుంచి వెళ్లిపోయానని ఆయన తెలిపారు. ఇదే వ్యవహారంపై పార్టీ కార్యకర్తలను సీబీఐ ప్రశ్నించినప్పుడు కూడా వారు ఇదే తరహా సమాధానం చెప్పారని తెలుస్తోంది. విజయ్ నుంచి మరిన్ని ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాల్సి ఉంది. అయితే, పొంగల్ సందర్భంగా తనకు విరామం కావాలని విజయ్ కోరగా, సీబీఐ అందుకు అంగీకరించిందని సమాచారం. విజయ్ విచారణకు వస్తున్నాడని తెలుసుకున్న అభిమానులు పెద్ద సంఖ్యలో సీబీఐ కార్యాలయానికి చేరుకున్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ 27న కరూర్‌లో విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందగా, పలువురు గాయపడిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దీనిపై సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఘటన జరిగిన ప్రాంతాన్ని సందర్శించిన అధికారులు పలు వివరాలు సేకరించారు.

# అక్షయపాత్ర సాక్షిగా.. ఆకలి చావులు..!

* **'ఆరోగ్య మిత్ర'ల బతుకు ఛిద్రం.. వారం వ్యవధిలో ఇద్దరు బలి**
* **వేతనాల ఎగవేత.. ఏజెన్సీల జలగ వేట**
* **అప్పుల కుంపటిలో ఆరోగ్యశ్రీ వారధులు**
* **హన్మకొండలో శ్రీనివాస్, జోగిపేటలో రవీందర్ బలవన్మరణం**

హైదరాబాద్ జనవరి 12 భారతశక్తి: పేదవాడి గుండె చప్పుడు ఆగిపోవద్దని, ప్రాణాపాయంలో ఉన్నవారిని కార్పొరేట్ వైద్యం దరిచేర్చాలని నిరంతరం తపించే 'ఆరోగ్య మిత్ర'ల గుండె ఇవాళ భారమై ఆగిపోతోంది. రోగులకు భరోసా ఇచ్చే ఆ చేతులే.. ఆకలి కేకలు తాళలేక, అప్పుల బాధ భరించలేక ఉరితాడును వెతుక్కుంటున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుడికి, రోగికి మధ్య వారధిగా ఉంటూ లక్షలాది మందికి పునర్జన్మనిస్తున్న ఈ క్షేత్రస్థాయి యోధుల జీవితాలు ఇవాళ దిక్కులేనివయ్యాయి. చాలీచాలని వేతనాలు, అవి కూడా నెలల తరబడి పెండింగ్‌లో పడటంతో.. కన్నబిడ్డల ఆకలి తీర్చలేక వారం వ్యవధిలో ఇద్దరు ఉద్యోగులు తనువు చాలించడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది.

**నిలువునా ముంచుతున్న నిర్లక్ష్యం!**

హన్మకొండ జిల్లా మేడికవర్ ఆసుపత్రిలో పనిచేస్తున్న శ్రీనివాస్ సోమవారం బలవన్మరణానికి పాల్పడ్డారు. 2007 నుంచి అంటే సుమారు 17 ఏళ్లుగా ఆరోగ్యశ్రీ సేవల్లోనే ఉన్న ఆయన, పెరిగిన ధరల భారానికి తోడు, జీతాలు సకాలంలో అందకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. వారం రోజుల క్రితమే సంగారెడ్డి జిల్లా జోగిపేటలో రవీందర్ అనే మరో ఆరోగ్య మిత్ర ఆత్మహత్య చేసుకున్న ఘటన మరవకముందే.. ఇప్పుడు శ్రీనివాస్ బలి కావడం వ్యవస్థలోని వైఫల్యానికి పరాకాష్ట.

* **మధ్యవర్తుల 'దోపిడీ' మేత.. ఉద్యోగుల బతుకు ఈత!**

ఆరోగ్య మిత్రల జీవితాలు అడకత్తెరలో పోకచెక్కలా మారాయి. అటు సర్కారు ఉదాసీనత, ఇటు అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల దౌర్జన్యం వీరిని నిలువునా ముంచుతున్నాయి.

పీఎఫ్, ఈఎస్ఐ గోల్‌మాల్: ఉద్యోగుల వేతనాల నుంచి కోత విధిస్తున్న పీఎఫ్, ఈఎస్ఐ నిధులు వారి ఖాతాల్లో జమ కావడం లేదని క్షేత్రస్థాయిలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

**నీటి మూటలుగానే హామీలు:**



అవుట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి, నేరుగా ప్రభుత్వమే వేతనాలు చెల్లిస్తుందని గద్దెనెక్కిన వారు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఫలితంగా మధ్యవర్తులు బాగుపడుతుంటే, కష్టజీవులు బలిపశువులవుతున్నారు.

**సర్కారు కళ్లు తెరవాలి: గిరి యాదయ్య..**

శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించిన ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య సర్కారు తీరుపై నిరసన వ్యక్తం చేశారు. "వందలాది కుటుంబాలను ఆదుకుంటున్న ఆరోగ్య మిత్రలు ఇవాళ రోడ్డున పడ్డారు. వారం వ్యవధిలో ఇద్దరు ఆత్మహత్య చేసుకోవడం ప్రభుత్వానికే సిగ్గుచేటు. తక్షణమే మృతుల కుటుంబాలను ఆదుకోవాలి. కనీస వేతనం రూ. 21,000 కు పెంచి, ఏజెన్సీల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి" అని డిమాండ్ చేశారు. యూనియన్ తరపున బాధితులకు రూ. 10,000 తక్షణ ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యక్షులు సుమన్, రవీందర్, రాజు, రత్నం, నాగరాజుతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. "ప్రాణాలు పోయాక ఇచ్చే పరామర్శ కంటే.. ప్రాణం ఉండగానే ఇచ్చే భరోసా మిన్న" అని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## చైతన్యపురి పోలీసుల ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా కార్యక్రమాలు



ఎల్బీనగర్, జనవరి 12 (భారత శక్తి): జాతీయ రోడ్డు భద్రతా మాసం కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు, ప్రజలకు, రోడ్డు ప్రమాదాలపై, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించి, సమాజంలో మంచి రోడ్డు అలవాట్లను పెంపొందించేందుకు చైతన్యపురి పోలీస్ స్టేషన్ వారు క్రింది అవగాహన కార్యక్రమాలను ఆయా తేదీల్లో విజయవంతంగా నిర్వహించడం జరిగింది. తేదీ 02.01.2026 సత్యనగర్‌లోని ఓక్‌వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈరోజు జాతీయ రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం ఇట్టి కార్యక్రమానికి ఏసిపి ఎల్‌బీనగర్ ఎ.కృష్ణయ్య, ఓక్‌వుడ్ డైరెక్టర్ శారద, స్కూల్ ప్రిన్సిపల్ శిరీష, చైతన్యపురి పీఎస్ సీఐ కె. సైదులు, సెక్టార్ ఎస్ఐ పి. భద్రయ్య, రోడ్డు భద్రతా ఎస్ఐ జగన్ లు మార్గదర్శకత్వం వహించి ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించడం,హెల్మెట్లు, సీట్ బెల్టులు ధరించడం, పాదచారులు రోడ్డు దాటే నియమాలు, అశాంతిగా డ్రైవింగ్ చేయకుండా ప్రమాదాలను నివారించడం వంటి ముఖ్య రోడ్డు భద్రతా పద్ధతులపై వివరణాత్మక సూచనలు ఇచ్చారు. తేదీ 03.01.2026 నాడు ప్రభాత్ నగర్, సాయి నగర్, చైతన్యపురి పరిసర ప్రాంతాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి రోడ్డు భద్రతా పట్ల అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగింది. తేదీ 05.01.2026 నాడు వివిధ స్కూల్ విద్యార్థుల కు అవగాహన కల్పిస్తూ వారందరితో రోడ్ సేఫ్టీ ప్లేడ్జ్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ట్రాఫిక్ ఏసిపి నవీన్ కుమార్ రెడ్డి హాజరు అవడం జరిగింది.

## నివాసాలకు 'హైడ్రా' భరోసా!

* **శేరిలింగంపల్లి సర్వే నం. 44లో ఆందోళన వద్దు..**
* **ప్రభుత్వ భూమిలో వాణిజ్య కట్టడాలపైనే ఉక్కుపాదం..**
* **ప్రజలను రెచ్చగొడుతున్న ఆక్రమణదారుల పట్ల అప్రమత్తత..**

హైదరాబాద్ భారత శక్తి: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మక్త మహబూబ్‌పేట గ్రామంలోని సర్వే నంబరు 44 నివాసితులకు హైడ్రా (HYDRAA) కీలక భరోసా ఇచ్చింది. ఇప్పటికే నిర్మించుకున్న ఇళ్ల జోలికి వెళ్లబోమని, నివాసితులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూమిని ఆక్రమించి, భారీ వాణిజ్య సముదాయాలు నిర్మించిన వారిపైనే చర్యలు ఉంటాయని సంస్థ తేల్చి చెప్పింది.

**రికార్డుల్లో సర్కారు భూమి..**

సేత్వార్ రికార్డుల ప్రకారం సర్వే నంబరు 44లోని మొత్తం 260.01 ఎకరాల విస్తీర్ణం ప్రభుత్వ భూమిగా నమోదై ఉంది. అయితే, ఈ భూమిలో చాలా కాలంగా అనేక నివాస గృహాలు వెలిశాయి. "హైడ్రా ఏర్పాటుకు ముందు (జులై 2024 కంటే ముందు) నిర్మించిన నివాసాలను తొలగించకూడదన్నది ప్రభుత్వ నిర్ణయం. ఇదే నిబంధన ఇక్కడి నివాసితులకు వర్తిస్తుంది" అని అధికారులు వెల్లడించారు.

**రెచ్చగొడుతున్న 'బడా' ఆక్రమణదారులు**

నివాసితుల వెనుక దాక్కుని తమ అక్రమ వ్యాపారాలను కాపాడుకోవాలని కొందరు






ప్రయత్నిస్తున్నట్లు హైడ్రా గుర్తించింది తప్పుడు పత్రాలు సృష్టించి ఎకరాల కొద్దీ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు. షోరూంలు, దుకాణాలు నిర్మించి నెలకు లక్షల రూపాయల అద్దెలు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు హైడ్రా ఫెన్సింగ్ వేస్తుంటే.. తమ వాణిజ్య అడ్డాను కాపాడుకునేందుకు సామాన్య ప్రజలను ఆక్రమణదారులు పావులుగా వాడుకుంటున్నారని అధికారులు హెచ్చరించారు.

**గట్టి చర్యలకు ఉపక్రమం**

ఈ ప్రాంతంలో అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారాన్ని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన సబ్ రిజిస్ట్రార్‌ను ఇప్పటికే సస్పెండ్ చేసింది. తాజాగా 'ప్రజావాణి'లో అందిన ఫిర్యాదుల మేరకు.. బీకే ఎన్‌క్లేవ్ చెరువు పరిసరాల్లోని 5 ఎకరాలతో పాటు, గత శని, ఆదివారాల్లో మరో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. కేవలం అనుమతులు లేని కట్టడాలు, వాణిజ్య సముదాయాలనే తొలగించామని, ఆక్రమణదారులు వ్యాప్తి చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని నివాసితులకు హైడ్రా విజ్ఞప్తి చేసింది



## స్వామి వివేకానందకు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి


ఎల్బీనగర్, జనవరి 12 (భారత శక్తి): స్వామి వివేకానంద గారి 163వ జయంతి సందర్భంగా భారాస పార్టీ యువ నాయకులు చీర శ్రీనివాస్ ఆధ్వర్యంలో చంపాపేట (ప్రస్తుత కర్మన్ ఘాట్) డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ ఓల్డ్ గ్రామం నందు ఉన్న స్వామి వివేకానంద విగ్రహనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, దేశ యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. భారతదేశాన్ని జాగృతం చెయ్యడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండులలో యోగ, వేదాంత శాస్త్రములను తన ఉపన్యాసాల ద్వారా,వాదనల ద్వారా పరిచయము చేసిన ఖ్యాతి అతనికి ఉంది. భారతదేశాన్ని ప్రేమించి, భారతదేశం మళ్ళీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానంద అతని వాగ్ధాటికి ముగ్ధులైన అమెరికా ప్రజానీకం వారికి బ్రహ్మరథం పట్టింది.ఎంతో మంది అతనికి శిష్యులయ్యారు. అక్కడే శికాగోలోను,అమెరికాలోని ఇతర ప్రాంతాలలోను ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. తిరిగి భారతదేశం వచ్చి రామకృష్ణ మఠాన్ని స్థాపించి దీని ద్వారా భారత యువతకు దిశానిర్దేశం చేశాడు.ముప్పై తొమ్మిది ఏళ్ళ వయసులోనే మరణించాడు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని "జాతీయ యువజన దినోత్సవం" గా 1984లో ప్రకటించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఓరుగంటి వెంకటేష్,సిద్దాల దశరథ్, రాజిరెడ్డి,మల్లేశ్ గౌడ్,సదానంద్ రెడ్డి, యాదిరెడ్డి,కనకేశ్, రమాదేవి,ఉమ మహేశ్వర్, కొత్తపేట ప్రభాకర్,శేఖర్ రెడ్డి,శివ, విద్యాసాగర్,బబ్బూరి రవి,చీర సాయినాథ్, తిరుమలేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## హుడా కాంప్లెక్స్ లో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు

ఎల్బీనగర్, జనవరి 12 (భారత శక్తి): చైతన్య భారతి ఫౌండేషన్ మరియు వివేకానంద యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో భారతీయ యువతకు స్ఫూర్తి ప్రదాత,యుగపురుషుడు స్వామి వివేకానంద 163వ జయంతి (నేషనల్ యూత్ డే) సందర్భంగా సరూర్ నగర్ డివిజన్ హుడా కాంప్లెక్స్ లోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఆరుట్ల సురేష్ కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. చైతన్య భారతి ఫౌండేషన్ చైర్మెన్ ఆరుట్ల సురేష్ కుమార్ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ "గమ్యం స్థిరంగా ఉండాలి,మార్గం ఖచ్చితంగా నిర్ణయించుకోవాలి, ప్రయత్నం రాజీలేని ధోరణిలో సాగాలి అపుడే విజయం మన సొంతమవుతుందని వివేకానందులు ప్రవచించిన విషయాలు గుర్తు చేశారు.భారతీయ సంస్కృతిని, ఖ్యాతిని,



విశిష్టతను అంతర్జాతీయ వేదికపై ప్రపంచానికి చాటిన ఆధ్యాత్మిక వేత్త, ఆధునిక యోగి పుంగవులు తత్వవేత్త , తన ప్రసంగాలు, బోధనలతో యువతకు ప్రేరణగా నిలిచిన స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఆ మహనీయుని స్మరించుకుంటూ సుస్థిర భవిష్యత్తు కోసం బాధ్యత, దృఢ చిత్తంతో దేశాన్ని నిర్మించడానికి యువత పునరంకితమవ్వాలని కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీహెచ్ఎంసీ సరూర్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ బోనగిరి శ్రీనివాస్ విశిష్ట అతిథి శ్రీ ఎస్వి నివాస్ జీ తెలంగాణ ప్రాంత గోసేవ ప్రముఖ్ ముఖ్య వక్త శ్రీరామ్ సుధాకర్ జీ ఆరోగ్య విద్యా బోదన్,విశిష్ట అతిథులు అనూప్ రాజా,మల్లారెడ్డి,శివ కుమార్ విచ్చేసి స్వామి వివేకానంద జీవిత విశేషాలు వారి బోధనలు స్మరించుకున్నారు.ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన వివేకానంద యువజన సంఘం ప్రస్తుత అధ్యక్షులు గందె రాజ్ కుమార్ వ్యవస్థాపాక అధ్యక్షులు వందనపు క్రిష్ణ మూర్తి జాతి నిర్మాణంలో వివేకానందులు పోషించిన పాత్రను కొనియాడారు.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.